రావుకి వివాహం చేసేయాలని చూశారు. కాని కుటుంబరావు తన కింకా వివాహావసరం కలుగలేదనీ, సంఘోద్ధరణ భారంతో సంసారభారం కూడా మోయలేననీ నిర్మొహమాటంగా చెప్పేశాడు. చేసేది లేక విశ్వపతిగారు పస్తాయించారు. కామేశ్వరమ్మ కుమిలి కుళ్ళిపోయింది.

విశ్వనాథానికి కొక సరికొత్త ఆలోచన తోచింది. డాక్టరు బ్రహ్మానందం గారిని కలుసుకుంటే ఏమైనా ప్రయోజన ముంటుందా అనుకున్నాడు. బ్రహ్మానందం గారిని విశ్వనాథానికి బాగా తెలుసు. ఆయన పేరున్న డాక్టరే కాకుండా పెద్ద సైకాలజిస్టుకూడాను. విశ్వనాథం వెంటనే వెళ్ళి బ్రహ్మానందం గారిని కలుసుకున్నాడు. రోగులందరు వెళ్ళిపోయాక తన గోడు వెళ్ళబోసుకున్నాడు. "నా కొక మిత్రుడున్నాడండి. అతను బి. ఏ. పరీక్ష మార్చిలో తప్పి సెప్టెంబరులో పూర్తిచేశాడు. కొద్ది కాలంనుండి అతనిలో ఒక గొప్ప మార్పు కలుగుతూ వస్తోంది. నేను ఎంతో ప్రయత్నం చేశాను కాని కారణం తెలుసుకో లేకపోయాను. అతను ఏదో మానసిక వేదనకు గురిఅవుతున్నాడని నా అభిప్రాయం. ఈమధ్యనే క్రొత్తగా భావగీతాలు కూడా రాయడం ప్రారంభించాడు. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటాడు. చాలా ముక్తసరిగా మాట్లాడతాడు. ప్రతి చిన్న విషయానికి విసుగు, చిరాకు ప్రదర్శిస్తాడు. ఏ విషయం అతనికి చిరాకు కలిగిస్తుందో, ఏ విషయం సంతోషం కలిగిస్తుందో కూడా తెలియటంలేదు. కొత్తగా "వేశ్యోద్ధరణ సంఘమ"ని ఒకటి స్థాపించి దానితో 'డవ పడుతున్నాడు. అతని విషయమై తని తలిదండ్రులు ఎక్కువగా బెంగ ట్టుకుంటున్నారు. మీరు అతనిని ఏ ధంగానైనా దారిలోకి తీసుకరావాలి."

బ్రహ్మానందంగారు విషయాన్నంతా శ్రద్ధగా విన్నారు. చిరునవ్వు నవ్వుతూ అతను ఎవరబ్బాయి?" అన్నారు.

"లాయర్ విశ్వపతిగా రబ్బాయి."

"ఓహో!" డాక్టరుగారు కళ్లు ఎగుర కేస్తూ "విశ్వపతి గారిని నేను బాగా ఎరుగుదును. రెండురోజులక్రితం అతనిని నేను లుసుకున్నాను. కాని ఈ విషయమై యన నాతో ఏమీ చెప్పలేదే" అన్నారు.

విశ్వనాథం మౌనంగా తలవంచుకొని శిరుకున్నాడు.

"సరే రేపు అతనిని తీసుకొనిరా" న్నారు బ్రహ్మానందం గారు.

* * *

"డాక్టరు బ్రహ్మానందం గారిని ఒకసారి



కలుసుకుందాం వస్తావా?" అన్నాడు విశ్వనాథం కుటుంబరావుతో.

"ఎందుకూ?" అన్నాడు కుటుంబరావు పుస్తకంమీదినుంచి దృష్టిమరల్చకుండానే.

"నీకు ఆకలి కొంచెం మందగించిందట. దొడ్డమ్మగారు డాక్టరికి చూపించమన్నారు" అన్నాడు విశ్వనాథం.

"చూడు విశ్వం! అవసరం లేకుండా అబద్ధాలాడ కూడదు. మీకు ఏదో అనుమానం ఉంది. అది తీరిపోతే సరి. పద" అన్నాడు బయల్దేరుతూ.

కుటుంబరావు డాక్టరువద్దకు రావటానికి ఇంత సులభంగా వప్పుకుంటాడను కోలేదు విశ్వనాథం. అసలు వప్పుకోడేమోనని భయపడ్డాడు. కుటుంబరావు తనంతట తానే బయలుదేరేసరికి విశ్వనాథం సంతోషంతో బరువుగా నిట్టూర్చాడు.

"ఏమిటోయ్ నీలోని బాధ" బ్రహ్మానందంగారు కుటుంబరావుని అడిగారు.

"ఎంతోమంది నన్నీ ప్రశ్న అడిగారు. వారికి నేనేమీ సమాధానం చెప్పలేకపోయాను. వారికి చెప్పినా ప్రయోజనమేమీ ఉండదు. మీరు డాక్టర్లు కాబట్టి మీకు చెప్పవలసిన బాధ్యత నామీద ఉంది. కాగితం కలం ఇప్పిస్తే రాసి చూపిస్తాను" అన్నాడు కుటుంబరావు.

బ్రహ్మానందంగారు కొంచెం ఆశ్చర్యపోయారు. మారుమాటాడకుండా కలం, కాగితం అందించారు. కుటుంబరావు కలం, కాగితం తీసికొని వ్రాతకు ఉపక్రమించాడు. బ్రహ్మానందంగారు, విశ్వనాథం కుటుంబరావుని విచిత్రంగా పరీక్షిస్తున్నారు. కుటుంబరావు ఏమి పిచ్చిరాతలు రాస్తాడో అని విశ్వనాథం దిగులుగా ఆలోచిస్తున్నాడు. కొంతసేపటికి రాయడం ముగించి కుటుంబరావు కాగితాన్ని డాక్టరుగారికి అందించాడు. డాక్టరుగారు పైకి చదివారు.

అతిప్రశాంత నిశాసమయాన
ఏదో రాగాలాపన నాహృదిలో
అవ్యక్తమై
అవగతమై
సుమధురమై
బాధావహమై
అగాధమై
అనంతమై
కల్లోల సాగర తరంగ
వీచికలబోలి
వేసవి మండు ఎండల
ఎడారిగాడ్పుబోలి
ప్రియురాలి మధురా
ధర హాసరేఖబోలి
కంటకావృతమై, కడు రమ్య
మై ఒప్పు గులాబిబోలి
దూరమై
ఘోరమై
చలితమై
క్షణికమై
రమ్యమై
భవ్యమై
దీప్తమై
వ్యాప్తమై
ప్రేయసీ ప్రియుల ప్రథమ
చుంబనము వోలె
మధుర ప్రభాత మారుతీ
వహితక్కోయిల కూతవోలె

నల్లమబ్బుల తెలిఅంచు
మెరపువోలె
నవ వధూచరణ
కింకిణీ రవమువోలె
ఏదో ప్రణయకావ్యాలాపన
కదలి, మెదలెను
నాహృదయ గహ్వరమున.

"ధోరణి బ్రహ్మాండంగా ఉంది" డాక్టరు కాగితం మడతపెడుతూ" ఈ ఆలాపనగురించి ఇంకా ఏమైనా చెప్పగలవా?" అన్నారు.

"అది ఆలాపనో, ఆవేదనో చెప్పలేను డాక్టర్" అన్నాడు కుటుంబరావు విచారంగా.

"నీకు వివాహమైందా?"

కుటుంబరావుకి బదులు విశ్వనాథం జవాబు చెప్పాడు.

"అవలేదండి. చేస్తామంటే వాడే వద్దన్నాడు."

డాక్టరుగారు కళ్లు పెద్దవిచేసి కుటుంబరావువేపు చూస్తూ ఉన్నారు. కొంతసేపు ఉండి "నువ్వు అందంగా ఉంటావుసుమా కుటుంబరావ్" అన్నారు.

కుటుంబరావు కొద్దిగా సిగ్గుపడ్డాడు. వెంటనే తమాయించుకొని "డాక్టరుగారి అభినందనకు నేను పాత్రుణ్ణికానేమోనని నా అనుమానం" అన్నాడు.

డాక్టరుగారు నవ్వేరు. "ఇంకా ఏమైనా రాశావా?" అడిగారు

"అబ్బె! ఎక్కడండి! ఇంటి దగ్గరో పెద్దకట్ట పడిఉంది" విశ్వనాథం బదులు చెప్పేడు.

డాక్టరుగారు ఆలోచనగా "పైత్యం వలన కలిగిన ఆలాపన ఇది. నా దగ్గర ఈ ఆలాపనకి చాలా మంచిమందు ఉంది. బహుశా కొద్ది మోతాదులతోటే ఈ ఆలాపన కట్టిపోవచ్చు" అన్నారు.

విశ్వనాథం మొహంమీద సంతోష చిహ్నాలు గుంపులు కూసుతున్నయ్. కుటుంబరావు పెదవులమీద హాసపు మెరపు కనిపించి మాయమయింది.

డాక్టరుగారు కొన్ని క్షణాలు ఊరుకొని "లోపల మా అమ్మాయి ఉంది ఆమెకి భావగీతాలంటే చాలా ఇష్టం మిమ్మల్ని తప్పకుండా పరిచయం చేయాలి పదండి" అన్నాడు ఆయన లేస్తూ.

డాక్టరుగారు శకుంతలకు కుటుంబరావుని పరిచయం చేస్తూ "ఈయనో పెద్ద భావకవి లాయర్ విశ్వపతిగారబ్బాయి. ఇతను ఈయనస్నేహితుడు విశ్వనాథం. ఈవిడ మా అమ్మాయి శకుంతల" అన్నారు.

నమస్కార ప్రతినమస్కారాలైన తరువాత కాఫీసేవనము జరిగింది శకుంతలా, కుటుంబరావులు పరిచయమైన పదినిముషాల్లోనే జోస్తీ కలిపేశారు శకుంతల కూడా భావగీతాలు రాస్తుందని విశ్వనాథం డాక్టరుగారివలన తెలుసుకున్నాడు ఒక కోతిబుర్రకి మరొక కోతిబుర్రతోడైందనుకున్నాడు విశ్వనాథం.

కొంతసేపు మాట్లాడిన తరువాత "మందు ఇస్తారా" అన్నాడు విశ్వనాథం డాక్టరుగారితో.

"ఆ మందు మనిషిని బాగా నీరసపెట్టుంది. పది, పదిహేను రోజులు పోయాక మందు ప్రారంభిస్తాను. ఈ లోపున మీ స్నేహితుడు పుష్టిఅయిన ఆహారం తీసుకొని కొంచెం తయారుకావాలి" అన్నారు డాక్టరుగారు.

తరువాత విశ్వనాథం, కుటుంబరావు డాక్టరుగారివద్ద శెలవుతీసికొని యింటికి బయలుదేరారు తోవలో కుటుంబరావు ఎంకిపాట ఒకటి ఈలమీద ఆలాపించాడు.

* * *

రోజూ కుటుంబరావు డాక్టరుగారింటికి వెడుతున్నాడు. రెండుమూడు రోజులు విశ్వనాథంకూడ అతని వెంట వెళ్ళాడు. కాని వాళ్ళ కోతిబుర్రలు మాట్లాడుకొనే మాటలు విశ్వనాధానికి అర్థం కాకపోగా విసుగెత్తించేవి. క్రమంగా విశ్వనాథం డాక్టరుగారింటికి వెళ్ళడం మానేశాడు. కుటుంబరావొక్కడే వెడుతున్నాడు.

పదిహేనురోజులు గడచిపోయినవి ఆ రోజు ప్రొద్దున్నే విశ్వనాథం డాక్టరుగారింటికి వచ్చాడు.

"ఈ రోజు మందు ప్రారంభం చేస్తానన్నారు" డాక్టరుగారికి విశ్వనాథం జ్ఞాపకం చేశాడు

"ప్రారంభిద్దామనే అనుకొంటున్నాను"అన్నాడు, డాక్టరుగారు మెల్లిగా "మందు ప్రారంభింపబోయే ముందు విశ్వపతిగారి నోమారు కలుసుకొని వద్దాం పద" అన్నారు

డాక్టరుగారు, విశ్వనాథం లాయర్ విశ్వపతిగారింటికి వచ్చారు విశ్వపతిగారు డాక్టరుగారిని మహానందంతో ఆహ్వానించారు కుశలప్రశ్నల తరువాత కుటుంబరావు సంగతి వచ్చింది. వారు చాలాసేపు ఆ విషయమై మాట్లాడుకున్నారు

కామేశ్వరమ్మ డాక్టరుగారికి కాఫీ అందించుతూ "అబ్బాయిని మీ చేతుల్లో పెట్టాము ఏమి చేసుకున్నా మీదే పూచీ" అంది.

"చాలా సంతోషం" అన్నాడు డాక్టరుగారు వేడివేడి కాఫీ చప్పరించుతూ.

* * *

మరొక నెలరోజులకే శకుంతలా కుటుంబరావుల వివాహం జరిగింది

తరువాత కుటుంబరావు ఎమ్ ఏ కూడా ప్యాసయి కాలేజీ లెక్చరర్ గా పనిచేస్తూ పాపల తండ్రి అయినాడు. ఇప్పుడు కుటుంబరావు వంటి ఖులాసా వ్యక్తి మరొకడు కానరాడు.

ఎందుచేతనో కాని కుటుంబరావు భావగీతాలు మాత్రం రాయడం మానేశాడు

★

గెలుపు

ఎప్పుడూ వరండా చీడీలయినా దాటి పైకిరాని డ్రైవరు నాయరు - మా యింటి లోపలికే పరుగెత్తుకొని వచ్చాడు అతని ముఖంచూస్తే ఏదో దెబ్బతిన్న లేడి లాగ కనిపిస్తున్నాడు. కళ్ళనీళ్ళ పర్యంతం వచ్చింది; నిలువు నా నీరైపోయినట్టు ఉన్నాడు. అతను ఏం చేస్తూఉన్నాడో అతనికే తెలియదేమో! అందుకే లోపలి గదిలోకే పరుగెత్తుకొని వచ్చి "అయ్యాగారూ-అల్లు సూడండి ఎంత అన్యాయం సేసింది-నాకు గుఱ్ఱం గెలిచింది-అస్లె తీసుకుంటా నంటుంది" అని వాడి వచ్చీరాని తెలుగులో చెప్తున్నాడు. అంతా బయటికి వచ్చాం వరండా ఎదుట-పోర్టికోలో కారు నిలిచేచోట కొంతమంది జనం గుంపుకూడి ఉన్నారు. వాళ్లలో ప్రక్కయింటివాళ్ల నౌకర్లు, ఎదుటి పూరిగుడిసెలో పెట్టెలు చేసేవాళ్లు- మరో పొరుగుయింటిలో చింతపండు అమ్మేవాళ్ళూ వీళ్లంతా ఉన్నారు

అసలు మా డ్రైవరు నాయరు చాల మంచివాడు. ఎవళ్ళ జోక్యమూ కలిగించుకొనే రకంకాదు. గట్టిగా మాటలాడటం కూడా వాడికి చేతకాదు. కారు త్రిప్పినంత సేపు త్రిప్పడం లేకపోతే కారు శుభ్రంచేయడం, కడగడం ఇలాంటి పనులు చూస్తాడు. తనకి పనిలేనపుడు, షెడ్డులోనే పడుకొని యేదో పాతమళయాళం పత్రిక చదువుకుంటూ కూర్చుంటాడు. ఒకోసారి ప్రక్క పూరి గుడిసెలో పెట్టెలుచేస్తున్నవాళ్ళ దగ్గర కూర్చుంటాడు. వాళ్లు రంగులు వేయడం, కుట్టడం, మేకులు కొట్టడం ఇవన్నీ శ్రద్ధగా చూస్తూ ఉంటాడు వాళ్లూ మళయాళంవాళ్ళే అవడంచేత వాళ్ళు చెప్పేమాటలు వింటూ ఉంటాడు. అలాగే-నాలుగుబారల దూరంలో ఉన్న కిళ్ళీకొట్టు దగ్గరకుపోయి తములపాకులు వక్క తెచ్చుకొని ఆ పెట్టెలవాళ్ళతో కలిసి తాంబూలం సేవిస్తాడు. అంతే. ఇది తప్ప ఇంక ఏ వ్యాసంగమూ డ్రైవరు నాయరుకు లేదు కారు నడిచేటప్పుడు కూడా అనవసరంగా ప్రసంగాలు చెయ్యడు. పలుకరిస్తే ఒకటిరెండు చిన్న మాటలతో జబాబు చెప్పడమే అంత మౌనంగా ఉంటాడు కాని పనిలో చాల సమర్థుడు.

చిన్న చిన్న మరామతులువస్తే తానే స్వయంగాచేసి బాగుచేస్తాడు మొన్న రేడియేటరులోని నీళ్ళగొట్టం చెడిపోయింది.

శ్రీవాత్సవ

కొత్తదికొని తానే వేశాడు అదే కంపెనీకి పంపిస్తే ఇరవైముప్పై రూపాయలు అవునట. అలాగే కార్బురేటర్-ట్యూనింగ్ చెయ్యడం, ప్లగ్గులు తుడవడం, బ్యాటరీ బిగించడం ఇలాంటి చిన్నపనులు అవలీలగా చేస్తాడు. అందుకే-నాయరు పని చూచి భోజనంపెట్టి నెలకి యాభైరూపాయలు చేశాం దానితో వాడికి తృప్తికలిగింది; అతని పనిచూచి మాకు తృప్తి కలిగింది

ఆ వేళ ఆదివారం. మద్రాసులో జరుగుతూవున్న గుఱ్ఱపు పందాలు ఆవేళతో ఆఖరు ఉదయం వచ్చి ఒక అరగంట సెలవు కోరాడు ఎందుకో అని అడిగితే ఒక టిక్కెట్టుతియ్యాలని అన్నాడు. ఆ సెలవు తీసుకొని సైకిలుమీద తిన్నగా గిండీలో రేస్‌క్లబ్బుకి పోయాడట. అయిదు రూపాయలకు ఒక ట్రెబుల్ టిక్కెట్టు తీశాడట. ఆ టిక్కెట్టు తన జేబులోనే వుంది. తిరిగి వెంటనే వచ్చేశాడు. మేమంతా కలిసి ప్రొద్దున్న ఒక సినీమాకు పోతూ ఉన్నాము నాయరు డ్రైవు చేస్తున్నాడు. మధ్యత్రోవలో ఏదో దేవాలయంవస్తే చటుక్కున కారు ఆపి మ్రొక్కుకున్నాడు. కారులో ఉన్న జనంలో ఒకరయిన కృష్ణయ్యగారు నాయరును-'ఏం నాయరూ? ఏమిటి విశేషం' అని ప్రశ్నించారు.

"నేను - యీ వేళ రేసెస్‌లో - ఒక టిక్కెట్టు తీసింది" అన్నాడు.

"టిక్కెట్టు,తీసినంత మాత్రంతో వస్తుందా?"

"వస్తాదండి బాబు! ఈవేళ చూడండి"

"వస్తే ఏంచేస్తావు? ఇక్కడ పని మానేసి కారుకొంటావా?"

"ఇళ్ళే లేదండి-పనిచేస్తూ ఉంటాను. బ్యాంకులో దాచేస్తును"

"అయితే నువ్వు తరచు గుఱ్ఱపుపందేలకు కట్తావా?"

"లేదండి. సంవత్సరానికి ఒక్కసారిదా రేసెస్ ఆఖరురోజున కట్టుదును"

"ఎన్నాళ్లనుంచి కట్తున్నావు?"

"పదిసంవత్సరాలనించి కట్తున్నాను?"

"ఎప్పుడైనా నీకు వచ్చిందా?"

"లేదండి ఇది ఏమవుతుందో చూచి ఇంక మానివేస్తును."

"అయితే నాయరు-నీకు డబ్బు ఎక్కడ నించి వచ్చింది?"

"మన యింట్లోదా-శాంతమ్మ ఉన్నాదే వారుదా అంజిరూపాయ ఇస్తురు గెలుస్తే-మరి అంజి-(అయిదురూపాయలు) నానుదా ఇస్తును"

"అయితే బాగానే ఉంది. ఏం నెంబర్లు తీశావు?"

"ఇదిగో టిక్కెట్టు చూడండిసార్-మన రెండుబండ్లు నెంబర్లు తీశాను. మూడవది-మన చంటిపా తీసింది"

"బాగానే ఉంది లాటరీ. అయితే 6, 10, 8 ఈ నెంబర్లు వస్తే గెలిచినట్టు లేకపోతే పోయినట్టు-"

"ఆమా సార్"

"అయితే-పందేలకి నువ్వు వెళ్తావా?" అని కృష్ణయ్య అడగగానే మా బావగారు అందుకుని 'ఎలాగ వెడతాడు మనం సాయంకాలం టీపార్టీకి పోవాలికదూ?" అన్నారు. దానిమీద నాయరు "నేను పోను సార్ వస్తే మన యింటిప్రక్క పెట్టెల వాళ్ళకి యిచ్చివేశాను. వాళ్లుదా సొమ్ము తెస్తురు" అన్నాడు.

అలాగ మేము వెళ్ళిపోయాము. సాయంకాలంవరకు ఈమాటే జ్ఞాపకంలేదు.

సాయంకాలం మా కారు తిరిగి వచ్చేటప్పటికి 8 గంటలయింది. నాయరు

రాగానే పెట్టెలవాళ్ల గుడిసెలోకి వెళ్లాడు. నాయరు వేసిన టిక్కెట్టు వచ్చినదట. సరిగ్గా మూడు నెంబర్లూ వచ్చాయి అయిదురూపాయల టిక్కెట్టుమీద రు 2015 లు వచ్చాయి టిక్కెట్టు ఇచ్చిన వెంటనే సొమ్ముకూడా వసూలు అయిపోయింది. ఆ పెట్టె వాళ్లు కూడా చాల సుజ్జాలమీద ఆడారట. అవన్నీ పోయాయి అందుకని వాళ్ళు ఒక పెద్ద యెత్తువేశారు. ఆ సమయానికి తాము ఉండి అంతా కనిపెట్టి చూడబట్టి యీ పందెం గెలుపు వచ్చింది కాని లేకపోతే రాదని వాళ్ల వాదం. ఆ కారణంచేత వాళ్లకు చెరిసగం సొమ్ము రావాలని పేచీపెట్తున్నారు. అసలు తెచ్చిన సొమ్ము చేతిలో పెట్టమనేవాళ్ల పట్టు.

అందుకే ఆవేళ డ్రైవరు పరుగెత్తుకొని రొప్పుకుంటూ లోపల గదిలో ప్రవేశించాడు. మా బావగారి కాళ్ళమీద పడి ఈ తగాదా పరిష్కారం చెయ్యాలని కోరాడు. కృష్ణయ్యగారు కూడా అక్కడే ఉన్నారు. మా అందరిలోకీ ఆయనే ఒక పెద్ద వ్యవహర్త. వెంటనే పెట్టెలవాళ్లని పిలువమన్నారు. సంగతి విచారించారు. వాళ్లు అన్నీ ఒప్పుకున్నారు. ముందు తెచ్చిన సొమ్ము రు. 2015 లు అక్కడ పెట్టించారు అది మావద్ద వుంచడానికి- వెంటనే రేస్‌క్లబ్బుకు వెళ్లి ఆ క్లబ్బులో పెద్దలు ఎలా తీర్పుచెబితే అలాగ చెయ్యడానికే నిశ్చయించారు. నాయరుకొన్న టిక్కెట్టులో నెంబర్లు రూఢిగా తెలుస్తూనే ఉన్నది. అతను కారు నెంబర్లు కలిపివేసి వచ్చిన మొత్తం ఒకొక్క నెంబరుగా వేశాడు. మూడో నెంబరుకు లాటరీ వేసి మా పాపచేత కలిపి తీయించాడట. ఆ నెంబర్లుగల టిక్కెట్టు కొనితెచ్చాడు. ఉదయం మాకు కూడా చూపించాడు.

అందులో మార్పుఏమీ లేదు. అందుచేత న్యాయంగా ఆ సొమ్ము నాయరుకి రావలసిందే. పెట్టెలవాళ్లవాదం ప్రకారం ఇందులో వంతు ఏమీలేదు అయితే వాళ్లు కూడా పందేలకుపోయి నష్టపోయారు కాబట్టి-ఇద్దరున్నారు-వాళ్లి యిద్దరకు చెరి ఒక యాభై ఇవ్వడానికి నాయరుచేత ఒప్పించి పరిష్కారంచేశారు. కారుతుడిచే కుజ్జవాడికి వంతుఉంది అంటాడు. అనుకున్న ప్రకారం, శాంతమ్మవద్ద బదులు పుచ్చుకున్న అయిదురూపాయలకు మరొక అయిదు కలిపి మొత్తం పదిరూపాయలు ఇచ్చివేశాడు. మా పాపచేతిలో పది రూపాయలు పెట్టబోయాడు. అక్కర లేదని ఇచ్చివేశాం. పెట్టెలవాళ్ళకు యాభైయేసి రూపాయలు ఇచ్చాడు దేవుడి గుడిలో యాభై కొబ్బరికాయలు కొట్టానన్నాడు. మిగతా సొమ్ము బ్యాంకులో వెయ్యాలని నాయరు సంకల్పం.

రోజూలాగే ఆవేళ బయటికివెళ్లి తిరిగి వచ్చాము. ఇది పందేలు గెలిచిన మన్నాడు. రాత్రి 10 గంటలయింది. భోజనంచేసి నాయరు ఇంటికి వెళ్తున్నాడు పక్క సందులోంచి కాలినడకను పోతున్నాడు. ఎదురుగా ఆ కిళ్ళీకొట్టు గోపాలన్‌నాయరు చింతపండు అమ్మే సంబంధం ఎదురుగా వచ్చి నిలిచారట. వాళ్ల చేతిలో చిచ్చు కత్తులు పట్టుకుని-ఏదీ మావంతు ఏంచేశావు ఇస్తావా చస్తావా? అని బెదిరించారట. అలాగే యిస్తాలేరండి అని చెప్పి ఒక్క ఊదుటన యింట్లోవెళ్లి పడ్డాడు.

ఇంటికి చేరుకున్నాడే కాని కంటికి నిద్దుర రాదు తెల్లవార్లూ పాడికళ్ళు అయిపోయాయి పెళ్ళాంతో పలకడు ఉలుకకు రోజూ రాగానే ఎత్తుకొని ముద్దాడే చంటిపిల్లవాడిని కూడా చేరనివ్వడు మతిపోయిన వాడిలాగ ముఖంపెట్టి వెఱివాలకంతో బెదురు చూపులు చూస్తూ ఉన్నాడట ఎక్కడనించి ఆ దుర్మార్గులు వచ్చి చంపుతారో అని భయం. "అయ్యో ఎందుకు వచ్చింది యీ గెలుపు? ఇది రాకపోయినా ప్రాణం హాయిగా ఉండేదే! అందరూ బెదిరించేవాళ్లే. అంతా వంతులు కోరేవాళ్లే ఈ వచ్చిన సొమ్ములో ఎందరికి ఇవ్వను? ఇవ్వకపోతే ప్రాణాలకే అపాయం కలిగేటట్టుగా ఉన్నది శ్రీరామచంద్రా! ఏది దారి? అని పరిపరివిధాల తలపోశాడు తెల్లవారేవరకు ఒక వెయ్యి యుగాలు గడచినట్టయింది

తెల్లవారగానే తిరిగి తన కారులు, పని డ్రైవింగ్. అయితే వాళ్ళు పొంచి కూచునే ఉన్నారు. ఒంటరిగా రావడం చూచి కత్తులూ కటారులూ చూపించి భయపెట్టూనే ఉన్నారు. ఈ యిద్దరే కదాళని వదుల్చుకుందాం అని యాభైయేసి రూపాయలు మళ్ళా పంచాడు. ఇదివరకు ఎంతో ఆప్యాయంగా చూచే పెట్టెలవాళ్ళు మాటలాడటంలేదు సొమ్ము ఇచ్చినా కూడా వాళ్ళు కంట్లో నిప్పులు పోసుకొంటు

(39-వ పేజీ చూడండి)

సీరియల్ నవల

రెండు మహానగరాలు

చార్లెస్ డికెన్స్

19

‘సిడ్నీ!—మరొక పెగ్ ఇలా అందించు—ఈవేళ నీతో ఒక అతి ముఖ్యవిషయం మాట్టాడాలిసివుంది’ అన్నాడు స్ట్రైయివర్.

సిడ్నీ ఆరాత్రి తెల్లవార్లూ, ఊపిరిసలపకుండా కాయితాల కట్టల్లో సదమదమౌతున్నాడు. ఆ క్రిందటి రాత్రికూడా అలానే పనిచేశాడు. ఆ క్రితంరాత్రికూడా అలానే పనిచేశాడు. అలా చాలా రాత్రులనుంచీ, వరసని నిద్రలేకుండా పనిచేస్తున్నాడు. కోర్టు సెలవులు నెత్తిమీదకొచ్చినై ఈలోగా వున్నపని యావత్తూ సీదాచేసెయ్యాలి. ఆరాత్రితో దిగబడివున్నపని యావత్తూ పూర్తిచేసేశాడు. మళ్లా నవంబర్‌లో తిరిగి కోర్టు తెరిచేవరకూ అవంక చూడకుండా, వున్న బెడద యావత్తూ తీరిపోయింది

ఈ భీభత్సకాండనంతా నిర్వహించటానికి సిడ్నీ ఒకదాని తరవాత ఒకటి ఎన్నో గ్లాసులు ఖాళీ చేశాడు. తీయకుండా తడి తువ్వాలు మాడుపట్టున అదిమిపట్టుకు కాలక్షేపం చేశాడు. ఆ వరసని ఆ రాత్రి అయిదారు గంటలు నిర్విరామంగా పని చెయ్యటంతో, అతని శరీరస్థితి మొత్తంగా తుక్కుతుక్కయివుంది

‘ఇదిగో ఇటు చూడు భయ్యా! నీకో విచిత్రమైన సంగతి చెప్పపోతున్నాను—ఈ విషయం వింటే నీకు బలే ఆశ్చర్యమేస్తుందిలే! ఇంతవరదాకా నేను చాలా తెలివిగలవాణ్ణని అనుకుంటున్నావా లేదా?—అనుకుంటున్నావ్; ఈ మాట వింటే ఆ అభిప్రాయం పూర్తిగా మార్చుకుని వట్టి అజ్ఞానశిఖామణినని తెలుసుకుంటావ్—పెళ్లిచేసుకోవాలని సంకల్పం’—

‘నువ్వా—పెళ్లిచేసుకుంటావా?’—

‘అవును—డబ్బుకోసం కూడా కాదు—ఇప్పుడు చెప్పు నేనెలాంటివాణ్ణో.’

‘అప్పుడే నా అభిప్రాయం చెప్పెయ్యదల్చలేదు—ఇంతకీ యెవరేవిటీ ఆ కన్యారత్నం.’

‘ఆలోచించు’—

‘నాకు తెలిసినమనిషేనా!’

‘ఆలోచించు’—

‘అబ్బాయ్ యిప్పటికే తెల్లారిఝాము అయిదుగంటలు కావొచ్చింది—మెదడులోవున్న నరాలన్నీ ఊదరెత్తి ఎండుతాటాకుల్లా రెపరెపలాడిపోతున్నయ్—ఇప్పుడు మళ్లా ఆలోచనాకాండలోకి యెక్కదేడవమన్నావ్?—ఇక మళ్ళీ ఆలోచనలో పడాలంటే, ఈవేళకు కందా యిక్కడే కొట్టాలిసొస్తుంది; అన్నాడు సిడ్నీ.

‘అయితే నేనే చెపుతా నాను’ అంటూ స్ట్రైయివర్ సిడ్నీకి చేరువలోవున్న కుర్చీలోకి వచ్చి కూర్చున్నాడు ‘సిడ్నీ! నువ్వు హృదయం గిదయం లేని దున్నపోతువు—ఈ సంగతి యెలా చెపితే నీకు బోధపడుతుందో నాకు అర్థం కావటంలేదు’—

‘అయితే నీది మానవత్వం తొణికిసలాడిపోతున్న కవి హృదయం అంటావ్?’

స్ట్రైయివర్ పకపకా నవ్వాడు: ‘శృంగారఘట్టాల్లో ఆరితేరిన ఘటాన్ని కాదనుకో, అయినా నీకంటే కొంచెం రసార్ద్రమైన మనస్సుకలవాణ్ణి’—

‘నీమీదైనా నాకు అలాంటి విశ్వాసముంటే—నిజంగా అదృష్టవంతుడివనే చెప్పాలి’—

‘రసార్ద్రత అంటే యేవిటంటే ’

‘శృంగారకాండలో దిగబోతున్నా నన్నావుగనక—అదో శృంగారనాయకుని లక్షణమనుకో’ అని సిడ్నీ అందించాడు.

‘సరే! పోనీ అలాగే అనుకుందాం—దాని అర్థమేవిటంటే ఆడవాళ్లల్లో మెలిగేటప్పుడు నువ్వు శుద్ధ దున్నపోతువులా సంచరించుతావు నేను అలాకాదు. ఆడవాళ్లల్లో మెలిగేటప్పుడు కొంచెం వాళ్ల మనస్సుకు నచ్చేలా సంచరించాలనే జాగ్రత్తవుంది నాలో, కాస్త హావభావవిలాసాలు నటించి వాళ్ల హృదయాలను ఆకర్షించటానికి ప్రయత్నించే చాకచక్యంవుంది నాలో’

‘సరే! అనంతర కథావిధానం ఉపక్రమించు’—

‘అసలు, నాకథ ఉపక్రమించే ముందు, నీ సంగతి చెప్పెయ్యాలి; నాకుమల్లేనే, నీవుకూడా డాక్టర్ మానెట్ ఇంటికి అనేక పర్యాయములు వచ్చావు. నిజానికి నేనంటే నువ్వే ఎక్కువగా వాళ్లింటికి తిరుగుతూవుంటావ్; వాళ్లింటికి వెళ్లినప్పుడల్లా నువ్వు అలా మాడుమొహం పెట్టుకుకూర్చోటంచూసీ, యెంతో సిగ్గుపడిచచ్చే వాణ్ణనుకో; అసలు, సర్దాగా మాట్టాడటం చేతేగాదాయిరి. అస్తమానం యేదో కోపంగా వున్నట్టు మొహం ముడుచుకు మౌనంగా కూర్చుంటావ్; నీ గురించి, నామూనానికి నేను యెంతో సిగ్గుపడి చచ్చేవాణ్ణంటే నమ్ము’—

‘అయితే మంచిపనే జరిగింది ప్లీడరీవృత్తిలోవున్న నీవంటివాడు యే వొక్క విషయంలోనైనా సిగ్గుపడటం అంటూ వుంటే నిజంగా చాలా ఆరోగ్యకరమైన విషయం—ఇందుకు నువ్వు నాకు కృతజ్ఞత తెలుపవలసి వుంది’—

‘అలా నువ్వు ఉటంకించి తప్పించుకోవటానికి వీల్లేదు—ఈ విషయం నీకు చెప్పితీరవలసిన బాధ్యత నామీద వుంది. నీ

అనువాదకు: తెన్నేటి సూరి

మొహంమీద అనేస్తాను. అలాంటి సమాజంలో మెలగటానికి తగిన బుద్ధికుశలత రవ్వంతేనా లేని వట్టి శుంఠవు; అకటావికటం మనిషివి.'

సిడ్నీ మళ్ళా ఒక పెగ్ బిగించి నిర్లక్ష్యంగా పకపక లాడాడు.

'ఇదిగో ఇటు చూడు సిడ్నీ! నలుగురిలోనూ మంచివాడనిపించుకోవలసిన అవసరం నాకంటే నీకు ఎక్కువుంది. నిజానికి అలాంటి అవసరం నాకేమీ లేదు. నాకేవిటి నేను స్వతంత్రంగా బ్రతకగలను అయినా యిదంతా ఎందుకు చేస్తున్నానంటావ్'—

'నువ్వు మంచివాడి వనిపించుకోవటానికి ప్రయత్నించటం నేనెప్పుడూ చూళ్ళేదులే' అన్నాడు సిడ్నీ.

'ఎందుకు ప్రయత్నించటం లేదు—తప్పకుండా ప్రయత్నించుతున్నాను—అలా ప్రయత్నించటం లౌక్యం—ప్రాపంచిక ధర్మం—అలా నడుస్తున్నాను గనక నే- జీవితంలో ముందుకు సాగిపోగలుగుతున్నాను—'

'సాగుతున్నావు బాగానే వుందితే—నీ వివాహగాధా కథనంమాత్రం ముందుకు సాగటం లేదు—ఆ సంగతేవిటో చప్పున తేల్చుదూ చంపుకు తినక—నా సంగతి కేమొచ్చె—నేను మరమ్మతయ్యే దశ దాటిపోయిన రకమని నీకు తెలీదు గనకనా?'

'అలాంటి చెయ్యి మీరిన శుంఠవై కూర్చోటానికి నీకు హక్కు లేదు.'

'హక్కు లేదులే—ఇంతకీ ఆ కన్యారత్నం ఎవరు'—

'ఆ పిల్ల పేరు వింటే నువ్వేమి గతుకుతిని దించుకుపోతావో అని ఆలోచిస్తున్నాను. నీతో వచ్చిన గొడవేవిటంటే నువ్వు మనసులో ఒకటి పెట్టుకుని, బయటికి నాలుకకు తోచిందేదో అడ్డదిడ్డంగా మాట్లాడేస్తూ వుంటావ్. ఆ మాటల్ని బట్టుకుని నీ మనస్సులో ఏముందో తెలుసుకోటానికి వీల్లేదు; నిజంగా నువ్వన్నది మనస్ఫూర్తిగా అన్నమాటే అయినట్టయితే ఇందులో చిక్కేమీ లేదు. ఇంతకీ ఈ ఉపోద్ఘాతమంటూ ఎందుకు చెబుతున్నానంటే- ఆ అమ్మాయిని గురించి నువ్వు ఓసారి చాలా చులకనగా మాట్లాడావు'—

'నేను చులకనగా మాట్లాడానా?'—

'మాట్లాడావు—మళ్ళీ మాట్లాడితే ఈ గదిలోనే మాట్లాడావు.'

'సిడ్నీ తనముందున్న సోడా గ్లాసులోకి తొంగిచూచాడు. నెమ్మదిగా ఎత్తి గొంతులో పోసుకున్నాడు. సాలోచనగా స్ట్రియివర్ ముఖంలోకి చూస్తున్నాడు:

ఆవిణ్ణి పట్టుకొని బంగారుజుట్టు అతికించిన గుడ్డ బొమ్మన్నావ్. అనలేదూ?—మిస్ మానెట్ ఆ అమ్మాయి నువ్వు అలా అన్నందుకు నిజంగా నాకు కోపం రావలసిందే—ఎందుకు రాలేదంటే నువ్వు అర్థంపర్థం లేకుండా వాగుతావని నాకు తెలుసు. చిత్రరచన విషయంలో ఓనమాలు కూడా తెలియని అవివేకి యెవడేనా నేను వేసిన చిత్రాన్ని విమర్శించాడంటే, దాన్ని లెక్క చెయ్యవలసిన పనేవిటి? సంగీతంలో, సాపాలు తెలియని అరసికుడెవడేనా నేను పాడిన బిలహరిరాగాన్ని వెక్కిరించాడనుకో, వాడి మాట లెక్కేవిటి?'—

సిడ్నీ గుక్క తిరక్కుండా పెగ్ మీద పెగ్ ఎక్కించేస్తున్నాడు. అయోమయంగా స్ట్రియివర్ ముఖంలోకి చూస్తున్నాడు.

'అబ్బాండో! విషయమంతా చెప్పేశాను. ఇదీ సంగతి. నేను డబ్బుకోసం ఆశపడదలచ లేదు. ఆపిల్ల చాలా అందమైన మనిషి అది నా సర్దా; నాకు అలాంటి సర్దాలు అనుభవించదగిన యోగ్యతలున్నాయి నేను జీవితంలో యేదో మార్గం అందుకుని స్థిరపడిపోయి, యింకా ముందుకు పోయే అవకాశంవున్నవాణ్ణి. కాస్తో కూస్తో యింత వున్నవాణ్ణి. ఆ అమ్మాయికూడా యింత సిరిసంపదలు అనుభవించటానికి తగిన యోగ్యతలున్న మనిషి. నావంటివాడికి ఆ అమ్మాయిమీద మోజుకలగటం నిజంగా ఆ పిల్ల అదృష్టం—ఏం? ఇదంతా నీకు ఆశ్చర్యంగా వుందా?'—

'ఇందులో ఆశ్చర్యపడవలసిం దేవిటి?'

'అయితే యీ వ్యవహారాన్నంతా నువ్వు ఆమోదించినట్టేనా?'

'ఆమోదించనని యెందు కనుకోవాలి?'—

'అయితే ఫరవాలేదు—నువ్వు యీ విషయాన్ని యింత చులాగ్గా తీసుకోగల్గుననుకోలేదు—చాలా యిదౌతావను కున్నాను. మన కిద్దరికీ యేదైనా తటపటాయింపు కూడా వస్తే రావచ్చు ననుకున్నాను. అయినా నేను యే విషయంలోనైనా ఒక నిర్ణయానికి వచ్చిన తరవాత మాటల్లో వదిలెట్టేవాణ్ణి కాదనుకో! అవును సిడ్నీ ఈ ఘోటక బ్రహ్మచర్యంతో ప్రాణం విసుగెత్తిపోయింది. ఏదైనా కొంత మార్పు అవసరంగా తోస్తోంది. మిస్ మానెట్ చాకచక్యంగల పిల్ల; అందుచేత ఈ నిర్ణయానికి వచ్చేశాను. ఇక నీ విషయంలో ఒకమాట చెప్పవలసి వుంది నువ్వు చాలా పెడమార్గంలో నడుస్తున్నావ్. నిజంగా చాలా తప్పుడుపంథాలో పోతున్నావ్. నీకు డబ్బువిలువ బొత్తిగా తెలీదు. నీ బ్రతుకంతా చాలా అస్తవ్యస్తంగా వుంది. ఇవాళో రేపో యేదో కుదుపుతిని మూలబడతావ్. దారిద్ర్యం చుట్టుకుని మంచంలో పడ్డావంటే ముఖంచూసేవాళ్ళుండరు దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి నాకు ఆడసహాయం కావలసి వస్తుంది. ముందుగా ఆలోచించు'

సిడ్నీ సంరక్షకబాధ్యతంతా తన నెత్తినే వున్నవాడి ధీమాతో అదో పెద్దరికపు పోజు బెట్టి మళ్లీ ఉపక్రమించాడు.

'ప్రతివిషయాన్నీ వాస్తవిక దృక్పథంతో ఎదుర్కోవాలి. నాపద్ధతిని నేను వాస్తవిక దృష్టితో ఈ సమస్యను ఎదుర్కొంటున్నాను. నీ పద్ధతిలో నువ్వు అలాగే ఈ సమస్యను పరిష్కరించుకోవాలి. నామాట విని పెళ్లి చేసుకో. నీకష్టసుఖాలు ఆదుకోగల మనిషి నెవర్నైనా చూసుకో ఆడవాళ్ళవిషయంలో నీ యిష్టానిష్టాలు వగైరా చెత్తవిషయాలన్నీ ఆలోచించకు ఏదో ఒక కొమ్మ పట్టుకో. కాస్త మర్యాదాగల ఆడదాన్ని చూడు. కాస్తో కూస్తో చేతిలో పైసా వున్నదైతే నయం. ఏ హోటలు యజమానురాల్నో చూడు. పెళ్లి చేసుకో!—కష్టకాలానికి ఆసరా అవుతుంది. అదీ నాకు కావలసింది; ఆలోచించు'—

'సరే! చెప్పారుగా సలహా!—ఆలోచిస్తాను'—

20

స్ట్రయివర్ డాక్టర్ కూతురుకు అదృష్టం పట్టించటానికి కృతనిశ్చయుడై సెలవులకు తాను ఊరికి వెళ్లిపోయేముందే ఆ శుభవార్తను ఆ అమ్మాయికి తెలియజేసి వెడదామనుకున్నాడు. సెలవులకుముందే, ప్రాథమిక వ్యవహారాలనన్నిటినీ తేల్చివేస్తే, అనంతరం ఏ క్రిస్టమస్ పండగల్లోనో పాణిగ్రహణశుభోత్సవం యేర్పాటు చెయ్యవచ్చుననుకున్నాడు.

తనవిషయంలో తనకు యెలాంటి సందేహమూ లేదు. అవ

తలపక్షంనుంచి అంగీకారం రాదనే సందేహమే లేదు. అందుచేత సెలవలివ్వగానే ఆ కార్యక్రమానికి ఉపక్రమించాడు

మొదటిది మిస్ మానెట్‌ను తనతోపాటు, "వాక్స్‌హాల్ గార్డెన్సుకు" వాహ్యాళికి రావలసిందని కోరాడు; అది పారలేదు పోనీ రానిలాకు రమ్మన్నాడు. అదీ పారలేదు. చిరాకెత్తింది. డాక్టర్ యింటికి వెళ్లి ముఖాముఖి ఢంకాబద్దలుకొట్టి సంగతి చెప్పెయ్యాలనుకున్నాడు. సోహోకు వెడుతుండగా మధ్యేమార్గంలో టెల్‌సన్సు బ్యాంకు తగిలింది. బ్యాంకు సైనుబోర్డు చూసేసరికి దాల్లో పనిచేస్తూవుండే లారీ డాక్టర్ మానెట్ కుటుంబానికి మిత్రుడనే సంగతి ఆయనకు జ్ఞాపకం వచ్చింది ముందుగా యీ వార్తను ఆయనకు తెలియజెయ్యాలనుకున్నాడు. తలుపుతోసుకుని లోపలికి వెళ్లాడు స్ట్రయివర్ లోపలికి వెళ్లేసరికి రూళ్ళపుస్తకాలు ముందు వేసుకుని సదమదమవుతున్నాడు.

'ఏవండోయ్!—కులాసా?' అన్నాడు స్ట్రయివర్.

'చిత్తం; తమకు క్షేమమేనా అండి' అంటూ చెయ్యి అందించాడు.

మామూలు పరామర్శలు పూర్తిఅయినతరవాత: 'ఏదో పనిమీద దయచేసినట్టున్నారు?' అన్నాడు లారీ, వ్యాపార ధోరణిలో.

'బ్యాంకువ్యవహారం కాదులెండి—మీతో ఒక ముక్క ప్రయివేటుగా మాట్లాడాలి—స్వవిషయం'

'ఓహో! అలాగా అండీ?' అంటూ ముందుకు వంగి చెవి దోరబెట్టాడు. స్ట్రయివర్ కొంచెం బల్లమీదికి వంగి, మందర స్వరంలో అన్నాడు 'నేను యిప్పుడు డాక్టర్ గారి యింటికి వెడుతున్నాను. వాళ్ళమ్మాయిని పెళ్లిచేసుకోవాలనుకుంటున్నాను ఈ విషయం స్వయంగా ముఖాముఖి చెప్పెయ్యాలని వెడుతున్నాను.'

'ఆఁ!—ఏవిటీ!' అంటూ, లారీ స్ట్రయివర్ ముఖంలోకి అదో విభ్రాంతుడై చూచాడు

స్ట్రయివర్ కుదుపు తిన్నాడు: 'ఏవిటి అంత దీర్ఘం తీశారు? ఏవిటి మీ ఉద్దేశం?'—

'నా ఉద్దేశమా అండీ—మంచి సదుద్దేశం—నిజంగా మీరు అభినందించగల ఉద్దేశం కాని—నిజానికి, స్ట్రయివర్ గారూ!—మీకు తెలుసు—ఈ విషయంలో, నిజానికి చాలా వుంది?'—

'మీరు మాట్లాడుతున్న దేవిటో నాకు ఒక్కముక్క అర్థం కావడం లేదు'

లారీ సమాధానం చెప్పలేదు. తాపీగా నెత్తిమీద విగ్గు సరిచేసుకుని చేతిలోవున్న కలంపుల్లచివరను కొరుకుతూ కూర్చున్నాడు.

'ఏవిటి? యింతకీ నాకు తగిన యోగ్యత లేదంటారా?'—

'ఆఁ!—హే!—అవును—మీరు యోగ్యులే—యోగ్యతల మాటకొస్తే—ఆఁ!—తప్పకుండా యోగ్యులు!'

'కలవాణ్ణి కాదంటారా?'—

'అయ్యయ్యయ్యో!—ఎవరంటారు అలాంటి మాట?'

'మరి ఇక మీకున్న అనుమానమేవిటి? ఇంతకీ మీ అభిప్రాయమేవిటి?'

'సరే!—సరే ననుకోండి—ఇప్పుడు మీరు అక్కడికి వెడుతున్నారా?'

'ఎకాఎకి'—

'నే ననేదేవిటంటే—మీరేదో వెడుతున్నారుగాని—మీరే నేనయినట్టయితే, నేను వెళ్ళేవాణ్ణి గాదు సుమండీ'

'ఏం? ఎందుకు వెళ్లకూడదు—కారణం ఏవిటి?'

'ఎంచేతనంటే—మనం యేపనిమీదనేనా బయలుదేరుతున్నామంటే దాల్లో మనకు విజయం కలుగుతుందని యేరవ్వంతేనా ఆశ అనేది వుండాలి'

'అంటే?'—

'అంటే ఆ అమ్మాయితో ఈ వ్యవహారం ఫాక్తుపడుతుందనే ఆశ ఇంతో అంతో వుండాలి—ఇంతకీ—చూశారూ—ఈ వ్యవహారమంతా ఆ పిల్ల యిష్టానిష్టాలమీద ఆధారపడివున్న విషయం గాదుటండీ'—

'ఏవిటి ఇంతకీ నీ అభిప్రాయం?—మెదడులేని వట్టి దద్దమ్మనంటావా యేవిటి?'

లారీ ముఖం కందగడ్డలా ఎర్రబడిపోయింది

'అది కాదనుకోండి!—కాని నేను మీకు చెప్పదలచిందేవిటంటే—ఆ అమ్మాయిని గురించి అవకతవక వాగుడేదీ నేను వినదలచలేదూ అని—ఈ బల్లదగ్గిర నుంచుని, నాలిక దగ్గిర పెట్టుకోవటం చేతగాకుండా లూసీని గురించి ఎవ్వడు వాగినా వాడికి నా తడాఖా చూపించటానికి ఎన్నడూ వెనకాడనూ అని—వింటున్నారా?—అదీ నేను మీకు చెప్పదలచింది.'

స్ట్రయివరకు కాళ్ళూ చేతులూ శీతలించినై గబుక్కున తగ్గి డిక్కుమొహం వేసి, 'ఇదంతా నాకు చాలా విచిత్రంగావుంది లారీగారూ?—నేను బాగ్లోకల్లా పెద్ద వకీలును—ఇలాంటివాణ్ణి—నేను ఈ సంబంధానికి దిగివస్తే, మీరు నన్ను డాక్టర్ యింటికి వెళ్ళొద్దని యెందుకు సలహా యిస్తున్నారో, నాకు బోధపడటం లేదు

'స్ట్రయివర్ గారూ యీ విషయంలో మీరు నా సలహాను అపేక్షించుతున్నారా?'

'అవును'—

'శుభం — అలాగైతే సలహాయిస్తున్నాను — మీరు వెళ్ళొద్దు'—

'ఇదంతా చాలా విచిత్రంగా వుంది'

'ఇక చెబుతా వినండి! నేను కాస్తో కూస్తో జీవితానుభవం వున్న ముసలివాడిని ఇంత పసికందుగా వుండగా ఆ అమ్మాయిని ఈ చేతులతో ఇక్కడికి తీసుకొచ్చాను. ఆ తండ్రికీ బిడ్డకీ కూడా నాకంటే ఆప్తులైనవారు మరొకరెవరూ లేరు ఆ యిద్దరిమీదా నాకు ఎంతో వాత్సల్యమున్నదని కూడా మీకు తెలుసు

యిప్పుడు చెప్పండి నే నిచ్చిన సలహా మంచిది కాదనటానికి వీలుందా?'

'మీ సలహా మంచిదే కావచ్చు—క్షమించండి'—

'మరేం ఫరవాలేదు—నేను ఎందుకు చెబుతున్నానంటే—ఇలాంటి విషయాల్లో ముందు కొంత యేదో ఆశ కనుపించంది, ఉభయపక్షాలూ ముఖాముఖి తారసిల్లటం మంచిది కాదు. తీరా మీరు అడిగితే వారు లేదంటారనుకోండి అప్పుడు మీ మనసుకు కష్టంగావుంటుంది అలాంటిముక్క మీముఖాన చెప్పవలసివస్తే డాక్టర్ గారికీ కష్టంగానే వుండవచ్చు. ఆ కుటుంబంలో మనిషినిగావుంటున్నవాణ్ణిగనక, మీకు అంగీకారమైతే, నేను స్వయంగా వెళ్లి ఈ విషయం వాళ్ళని కదలేస్తాను. వాళ్ల అభిప్రాయం ఎలా వుందో వచ్చి మీకు తెలియజేస్తాను—ఏవంటారు?'—

'సెలవులకు పోకుండా—ఈ నగరంలో యింకా ఎన్నాళ్లుండమంటారు?'

(38-వ పేజీ చూడండి)



★

అబ్బ రాజుగారి
కొబ్బరీ తోట
తరుగులే కుండంగ
విరగ గాచింది.

చలమయ్య దీన్నెట్లు
తెలిసికొన్నాడో
కాజేయ వలెనంచు
కాచి యొకనాడు,

చీకటీ పడగానె
చెలమయ్య పోయి,
గబ గబా యొక చెట్టు
కెగ బ్రాకినాడు.

కొబ్బరీ చెట్టుపై
కొలువు తీరాడు.
అంతలో నబ్బరా
జటకేగు దెంచి,

"చెట్టెందు కెక్కేవు
చెప్పరా చలమ!
డొక్క చీలిచి నిన్ను
డోలు కట్టేను"

అనగానె చలమయ్య
హడలి పోయాడు
మారు చెప్పంగ తిక
మకలు పడ్డాడు.

ఎట్టకేలకు నాత
డిట్టు లన్నాడు
"అదిగాదు నామాట
ఆలించు బావ!

ఎల్లావు దూడొక్క
టేడ్చింది నాకు
తెల్లవాళ్లూ మేత
కల్లాడు చుండె,

దూడమేతే మైన
దొరుకునని బావ!
గబగబా చెట్టెక్కి
గాలించు చుంటి."

"దొంగ వెధవా! మేత
దొరకేనా పైన?"
"అందుకే దిగివచ్చు
చుంటి బావా!" అని

'జర్రు' మని క్రిందికీ
జారి వచ్చాడు,
'తుర్రు' మని యావలకు
దూసు కొన్నాడు.

తప్పు చేసియు దాని
కప్పిపుచ్చుటకు
కుంటి సాకులు చెప్పు
కొందరీ రీతిగా.

ట్వీడ్ సూట్

"వెంక్య"

"ఏమిరా; రామూ, పెళ్లి బాగాజరిగిందా" అంది రామంతల్లి, సీతమ్మ. రాము అప్పుడేరైలు దిగొచ్చాడు

"చాలా బాగాజరిగిందమ్మా. పెళ్లికూతురు నిజంగా అప్సరసంటే నమ్మ. మనరాజారావు కట్నంబాగానే కొట్టేశాడు, ఆరువేలు, వాచీ..."

"రాజ్యం పిన్ని, రాఘవయ్య బాబాయి వచ్చారా!"

"రాకేం? అందరూ వచ్చారు. నువ్వు, నాన్న తప్ప." అన్నాడు రాము విసురుగా. "యేంచేయమంటావురా! నాన్నగారివంట్లో బాగా లేదాయె. ఇల్లూవాకిలీ యెవరు చూస్తారు, నేనుకూడా వస్తే?"

"ఊఁ...కాస్త పడిశంపడితే అది ఒంట్లో బాగుండకపోవటం కాబోలు! ఆయన కానీ కర్చైందంటే, వారం రోజులు నిద్రాహారాలు మానుకొంటాడు. అచ్చటా ముచ్చటలేని వాడికి పాతికెకరాలు, ఉండేం! లేకేం"

"అదేమిట్రా, నీకేం కళ్లు కుడుతున్నైవ్యేరా ... నాకు తెలియకడుగుతా? ఇప్పుడు నీకేం తక్కువైందీ?"

"యేం తక్కువైందా...చూడు; రాజారావుకు వాళ్లనాన్న యెటువంటి ట్వీడ్‌సూటు కుట్టించాడో? పట్టుమని పదెకరాలు లేవు, నాకు అలాంటి సూట్ కుట్టించమంటే ఖస్సుమన్నాడు, నానా తిట్లూ తిట్టేడు నాన్న. మరి యీ ఆస్తి యేంచేస్తాడో; యేమిటో నాకేం అర్థంకావడంలా...పోన్లే" అంటూ రుసరుసలాడుతూ బయటికి వెళ్ళేడు రాము. ఒక్కసారిగా కోపం తెచ్చుకోవడం రాము స్వభావం.

"అన్నమైనా తినకుండా ఎక్కడికి వెడుతున్నావురా!" అరిచింది సీతమ్మ. వినుపించుకోకుండా వెళ్ళిపోయాడు రాము.

కొంచెంసేపట్లో రామయ్య యింటికి వచ్చాడు. "అబ్బాయ్



వచ్చేట్టే? భోంచేశాడా?" అని ప్రశ్నలవర్షం కురిపించాడు.

"ఆఁ ... రామూవచ్చాడూ, ... పోనూపోయాడు! పెళ్లి బాగానే జరిగిందిట. వాడేదో స్వీడ్ సూటు అడిగితే కుట్టించలేదని కోపంతో తిండైనాతినక వెళ్ళిపోయాడు."

"పిల్లకాకికేం తెలుసునే, ఉండేలు దెబ్బ! ఆ సూటు మాటలతో వస్తుందా? యెంతౌతుందో, ఏమిటో? సంగతి, సందర్భం తెలిస్తేగా" అంటూ నడుంవాల్చాడు రామయ్య.

రామయ్య పిసినిగొట్టు. కానీ డబ్బు ఖర్చైతే గుని సేరకం. పెళ్ళికెడితే కట్నాలు - కానుకలూ, రైలుఖర్చులూ చాలా ఖర్చౌతుందని మానేశాడు. కొడుకు చెవినిల్లుగట్టుకుపోరితే, పింగిటించి పింగిటించి రైలుఖర్చులిచ్చాడు. ఎంత పీనాసిఅయినా, కొడుకంటే పడిచచ్చేప్రేమ. అంతవరకే! పంట్లాం కుట్టించమంటే నిక్కర్ చాలంటాడు తల్లీకొడుకులు పోరగా పోరగా, ఎట్టకేలకు రెండు పైజమాలు కుట్టించాడు.

రామయ్యకు చక్కటిడాబా, పాతికెరాలు పిత్రార్జితం. బ్యాంకులో 75వేలు నిల్వవున్నాయి. రాముతప్ప వేరే సంతానంలేదు. రామూ కాలేజీలో యింటర్ చదువుతున్నాడు. కొంచెం జల్సాచెయ్యాలనేరకం; నలుగురితో పాటు సరదాగా తిరగాలంటే చేతిలో పావలాడబ్బులుండి యెరుగడు. ట్వీడ్ సూట్ మీద అతనికి అమితమైన మక్కువ. కాని తండ్రి దేవాంతకుడు. మాటచెల్లనీయడు. ఆలోచనలతో బుఱ్ఱవేడెక్కి రాత్రి తొమ్మిదింటికి ఇల్లుజేరేడు రాము. చాలా కోపంగా ఉన్నాడు.

"యెక్కడికెళ్ళేవురా" అన్నాడు రామయ్య విసుగ్గా.

"........"

"నిన్నే.. వినపట్టంలా"

"అలాబయటికెళ్లేను" అన్నాడు దురుసుగా

"భోంచెయ్యకుండా వెళ్లావట, ఎందుకని?"

"నా కాకలికావడంలా...భోం చేయను"

"యేడిశావ్ లే...నీ యెత్తులు నాకు తెలుసు, నువ్వు వెధవషోకులు మరిగేవ్, నా చేతులారా ఆ సూటు కుట్టించేది ఉత్తది. నీచేతికి దమ్మిడీ కూడా యివ్వను. ఏంచేసుకొంటావో చేసుకో, ఫో."

"యెందుకండీ అలా కోప్పడతారు? నిదానంగా చెబితే వాడు మాత్రం వినడూ?" అని చల్లగా అందుకొంది సీతమ్మ.

"వింటాడు; వినకేం? - వాడిని నువ్వే యింతవరకు తీసుకొచ్చావ్.. నువ్వు అవతలికి నడు, ముందు" అన్నాడు కోపంగా రామయ్య.

సీతమ్మ మనస్సు కరిగి నీరైపోయింది. ఐదుగురుపిల్లలు పోగా రామూ ఒక్కడుదక్కేడు. వాడ్ని గారాబంగా పెంచేది. శక్తిఉండి కూడా వాడికోరిక చెల్లలేదేఅని బాధపడింది. కాని యేంలాభం? రామూన్ని అన్నానికి రమ్మని సీతమ్మ యెంతైనా బ్రతిమాలింది. ఎంత బ్రతిమాలినా లాభంలేక

పోయింది. ఈ బ్రతిమలాట విని రామయ్య మండిపోతూ, "పోనీ వెధవని...ఇంతలో మరేం ప్రమాదం రాదులే" అని కసిరాడు.

ఆరాత్రి యెవ్వరికీ నిద్రలేదు. రామానికి, సీతమ్మకి కన్నీరు మున్నీరుగా పారింది. యేడిస్తే మాత్రం వస్తుందా సూటు?

*　*　*

తెల్లవారింది మంచంమీద రాములేడు! సీతమ్మకు గుండె బద్ద లైంది.

'వాడేవస్తాడులే' అని రామయ్య ఊరుకొన్నాడు. ఆరోజు రాత్రివరకు చూశారు. రాము రాలేదు. సీతమ్మకు మతిపోయినట్లైంది. కొడుకు కోసం తపించిపోయినా లాభంలేక పోయింది ఒకరోజు రెండురోజులు, మూడురోజులు, - ఇలా చూస్తుండగానే వారంరోజులు గడిచిపోయినై. అప్పటికి రామయ్య రాతి మనస్సు కొంచెం కరిగింది.

రెండురోజులతర్వాత దినపత్రికలో..."యెఱ్ఱటికుఱ్ఱవాడు ముఖాన మచ్చ, ఉంగరాలజుట్టు, యెత్తు $4\frac{1}{2}$ అడుగులు. చెవిపైభాగాన బంగారపుకాడ. వారంరోజులక్రితం ఇంటినుండి వెళ్ళిపోయాడు జాడ తెలిపిన వారికి రూ. 400 బహుమతి పేరు రామనాథం.

ఇట్లు
ము. రామయ్య."

అని ప్రకటనపడింది.

4 రోజులతర్వాత రాము కాకినాడలో ఉన్నట్లుగా సుబ్బారావు అనేతాలూకా ఆఫీసు గుమాస్తా దగ్గరనుండి లేఖవచ్చింది. రెక్కలుగట్టుకు కాకినాడలో వ్రాలేడు రామయ్య. సుబ్బారావు రామయ్యని సత్కరించి, ఆరాత్రి భోజన హోటల్‌కు తీసుకవెళ్ళేడు. రాము అదేసమయాని కక్కడే భోంచేస్తున్నాడు. రామయ్య అమాంతంగా వెళ్ళి రాముని కౌగలించుకొన్నాడు. రామం నెత్తిమీద రెండు ఆనంద బాష్పాలుకూడా కురిసినై. రాము వెళ్ళిపోతే సీతమ్మ, తను, యెంత బాధపడ్డారో వివ... ... ప్రతిమలాడి రామాన్ని వెంటబెట్టుకొని సుబ్బారావుతోపాటు స్టేషన్‌కు దారితీశాడు సుబ్బారావుకు చాలా కృతజ్ఞత తెల్పుతూ రూ 400 అతని చేతిలోపెట్టేడు రామయ్య సుబ్బారావు కొంచెం బెట్టుచేస్తూనే పుచ్చుకొన్నాడు. ఆ నాలుగు వందలు, రైలెక్కే సమయానికి రామయ్య చూడకుండా సుబ్బారావు, రాము చేతిలో పెట్టేడు. రైలుకదిలింది.

స్వగ్రామం చేరినతరువాత ముదురు నీలం ట్వీడ్‌సూట్ వెంటనే కుట్టించాడు రామయ్య.

రెండురోజులతర్వాత ఒకనాటి సాయంత్రం కాఫీరంగు సూటు వేసుకు బయటికి వచ్చాడు రామం.

"ఈ సూటు యెక్కడిదిరా? నీలంసూటేది?" అని ఆశ్చర్యపడుతూ అడిగాడు రామయ్య.

"ఇదీ వాడిసూటేనండీ! మొన్న బహుమతి పుచ్చుకొన్న కుఱ్ఱాడు లేడూ - ఆ సుబ్బారావే - అతని చేత మనవాడే ఇంతనాటకం ఆడించి, మన్ని యేడిపించి, మీ దగ్గరనుంచి సునాయాసంగా నాలుగువందలూ పుచ్చుకొన్నాడు. ఆ డబ్బుతోనే చేతిగడియారం, సూట్ కొన్నాడు. మొత్తంమీద తండ్రికి తగినకొడుకే!" అని అందుకొంది సీతమ్మ నవ్వుతూ.

రామయ్యనోట్లోవున్న చుట్ట క్రిందపడింది. నోరు పెద్ద కొండగుహ అంతైంది. "ఏడవకపోయాడు: వెధవ! వెధవ!!" అంటూ బుర్ర అటు తిప్పేసుకొన్నాడు. ★



విజ్ఞానవీధులు

"డాక్టర్




17 చేదులేని క్వైనా

మనదేశంలో ఏదో ఒకసారైనా చలిజ్వరం కుదుపు అనుభవించని వారుగాని, క్వైనా మోతాదు పుచ్చుకోని వారుగాని, ఉండరనడంలో ఏమాత్రమూ అతిశయోక్తి లేదు. ఈ విషయం జ్ఞాపకం చెయ్యగానే క్వైనా చేదూ, "అయ్యేటి రోగాలూ కమ్మటి మందులూ ఉంటాయా? కళ్లుమూసుకుని ఈ మోతాదుమింగి చేదుపోవడానికి పిప్పరమెంటు వేసుకో" అని ఆప్తులు చేసిన వెటకారానునయాలూ స్మృతిపథంలో మెరుస్తాయి. అలాంటి వెటకారాలు శాస్త్రవేత్తల కృషివల్ల ఎదురుతిరగవలసిన వెటకారాలయాయి. వారి పరిశోధనలవల్ల నేడు చేదులేని క్వైనా లభిస్తోంది. అది కమ్మటిమందు కాకపోయినా చప్పటి మందు మాత్రం అవును. కస్తూరి జలంతో కడిగినా ఉల్లిగడ్డకున్న వాసన పోదనీ, నిలువెల్లా చేదుగాఉండే క్వైనా ఏంచేసినా చేదుతగ్గదనీ విన్పించేమాటలు సగంమారాలి.

క్వైనా రుచిని మాటుపరిచేశక్తి రసాయనిక క్రియలవల్ల సాధ్యమైంది. అదిసాధించిన రసాయన శాస్త్రవేత్తలకు రుచితెలిసే సందర్భంలో జరిగే క్రియలూ మార్పులూ మొదలైనవాటినిగురించిన విజ్ఞానము తోడ్పడింది. ఏ పదార్థాన్నైనా నాలికమీద వేసుకోగానే అది నోటిలోని లాలాజలంలో కరిగిపోతుంది. ఆ ద్రవం కొండనాలికమీదా జిహ్వామూలంలోనూ, ఉన్న అసంఖ్యాకరసనాగ్రంథుల్లోకి చేరుకుంటుంది. ఆ గ్రంథుల్లో స్తూపాకారంగల చిన్న చిన్న జీవకణములుంటాయి వాటిలోపల నరాల చివరలు ఇమిడిఉంటాయి. వస్తువులరుచి ఆ నరాల ద్వారా మనస్సుకి రవాణా అవుతుంది. శారీరశాస్త్రవేత్తలు నిర్ణయించిన ఈ విషయంవల్ల ఒక ముఖ్యమైనసంగతి తేలుతోంది. ఏ వస్తువు రుచియైనా స్పష్టంగా తెలియాలంటే, అది లాలాజలంలో కరగాలన్నమాట. లేకపోతే దానికి రుచీపచీ లేదనిపిస్తుంది.

సామాన్యంగా మందుల్లో క్వినీను సల్ఫేటు లవణాన్ని వాడుతుంటారు. అది నీటిలో కరుగుతుంది. లాలా జలంలోనూ కరుగుతుంది. రుచికి చేదుగాఉంటుంది. క్వినీను హైడ్రోక్లోరైడు లవణము నీటిలో మరింత బాగా కరుగుతుంది. అందుచేత అది మందులాగ తాగితే మరింత ఎక్కువచేదుగా ఉంటుంది. ఇలాగ క్వినీనులవణాలన్నింటిని శోధించగా వాటిలో "క్వినీను ఈథైల్ కార్బొనేటు" లవణంఅనేది నీటిలో కరగదని స్పష్టమైంది. అది నాలుకమీద వేసుకుంటే చప్పచప్పగా ఉంటుంది. అందుచేతనే దాన్ని శాస్త్రవేత్తలూ వైద్యులూ చేదులేని క్వైనాఅని వ్యవహరిస్తున్నారు. దీని మోతాదుకూడా మామూలు క్వైనాకంటె ఏమంత ఎక్కువ కాదు. కాని, ఖరీదుమాత్రం దానికంటె నాలుగురెట్లుంటుంది. దానివల్లకలిగిన మేలుతో పోలిస్తే అదేమంత చెప్పుకోదగిన లోపం కాదు అనే అనాలి కాదూ!

ఒక్క హెచ్చరిక. క్వినైను ఈథైల్ కార్బనేటు నోటిలోని లాలా జలంలో కరగదు. కనక రుచిని బాధించదు. కాని కడుపులోని రసాలలో కరుగుతుంది. కనక నెత్తురులో కెక్కి మలేరియా క్రిముల్ని సంహారిస్తుంది. "రుచి యెలాగు తెలుస్తుందీ?" అని శోధించినందువల్ల వచ్చిందీ లాభము! కొన్నాళ్లుపోతే చేదు మందులు ఉండనేఉండవు!—'హరి'



(గత సంచిక తరువాయి)

"ఏమోయ్; సుందరం! కాలాన్ని ఎన్ని విధాల కొల్చే వారో చెప్పాను కదా; ఆవిధాలు ఏవో ఒక్కమారు చెప్పి చూతాం." ఇంత సేపటి నుంచీ తాను చెప్పుతున్న విషయాలు సుందరానికి ఎంతవరకు జ్ఞాపకం వున్నవో తెలుసుకొందా మన్న వుద్దేశంతో గడియారం అడిగింది. స్కూల్లో మేష్టారి మాదిరిగా యీ గడియారం కూడా 'ప్రశ్నలు' వేస్తూ వుండటం సుందరానికి ఒకింత చిరాకు పుట్టించక పోలేదు. అయినా - యింత చక్కని కథలు చెపుతున్న యీ గడియారం మనస్సు నొప్పించటం ఎందుకని సుందరం, ప్రశ్నలకు సమాధానాలు యీయటానికే పూను కొన్నాడు.

"మొదట్లో పుస్తకాలతో కొలిచారన్నావు తరువాత దీపాల తోనూ, కొవ్వు వత్తులతోనూ. ఆ తరువాత కర్రతోనూ, గరాటా తోనూ"

"అవును. ఇంకా ఎన్నోరకాల కొలిచారు. ఇంతెందుకు ? ఇప్పుడు నువ్వు చేస్తున్నట్టే నేలమీద బొటన వేలితో కొట్టుతూ కూడా కాలాన్ని కొలవవచ్చు గదా ?"

అంతవరకు తనకు తెలియకుండా నేలమీద బొటన వేలుతో కొట్టు తున్న వాడల్లా, గడియారం యీ మాట అనేసరికి, సుందరం చప్పున ఆపేశాడు.

"ఆఁ! ఏమిటీ ? కాలితో నేల మీద కొట్టుతూ గంటలు లెక్క పెట్టవచ్చు నంటున్నావా ?"

"అవును; ఎందుకు లెక్కపెట్ట కూడదు?"

"ఏడిసి నట్టుంది. ఇదేమైనా కాలు అనుకొన్నావా, కర్ర ముక్క అనుకొన్నావా ? ఎంత సేపని యిలా కొట్టగలం ? నొప్పి పుట్టుకు రాదూ ?"

సుందరం ముఖం మీద కను పించిన చిట్టికోపం చూడ ముచ్చ టగా వున్నది. గడియారానికి అందతా చాలా మురిపెంగా తోచింది.

"అంతలో కోపం తెచ్చు కొంటా వేమోయ్; సుందరం! వూరికే మాటవరసకు అన్నాను కానీ, అలా ఆగకుండా నేలమీద కొట్టుతూ వుంటే నీ చిన్ని పాదం కందిపోతుందని నాకు మాత్రం తెలియదూ ! చూడూ-ఎవరు ఎన్ని రకాలుగా కాలాన్ని కొలవటానికి ప్రయత్నించినా, వాళ్లు ముఖ్యంగా రెండు సమస్యలను ఎదుర్కోవలసి వచ్చింది. ఒకటి-వీరువుపయోగించే



ప్రమాణం వుపయోగంలో వుండగా, వేగంగా అయిపోవటం కానీ, జోగుతూ పనిచేయటం కానీ కుదరదు. ఇక రెండోది- అప్రమాణం ఎవరు ఎప్పుడు ఎక్కడ వుపయోగించినా ఒకేలా పనిచేయాలి. ఈ రెండు సమస్యలూ కుదరక, ఎన్నో వందల సంవత్సరాల పాటు మీా మనుష్యులు తల క్రిందు లైనారంటే నమ్మ."

"చివరకు యీా సమస్య ఎలా తీరింది ?"

"సుందరం ! శాస్త్రజ్ఞులకు అసాధ్యమైన విషయం అంటూ ఏదీ లేకుండా పోయిన యీా యుగంలో యీా సమస్యలు ఒక లెక్కా ! రెండు వందల ఏభై ఏండ్లకు పూర్వం యూరప్‌లో ఒక కుర్రాడు పుట్టాడు ఆ కుర్రాడు ఒకరోజు వాళ్ల అమ్మతో కలిసి చర్చికి వెళ్లాడు. ఆ చర్చిలో కొవ్వు వత్తులు తగిలించే గుత్తులు, చూరు నుంచీ కిందికి వేళాడగట్టి వున్నాయి. అవి చాలా క్రిందికి వేళాడగట్టివున్నాయేమో, ప్రార్థన జరుగుతున్న సమయంలో ఒక పెద్దమనిషి కూర్చున్న చోటి నుంచి లేవబోతే, ఆ గుత్తులు ఆయన తలకు రంగున కొట్టుకొన్నాయి. ఈ కుర్రాడికి యిదంతా బలే సరదాగా వుంది. అందుకని అలాగే చూస్తున్నాడు. ఆ పెద్దమనిషి తలకు తగిలిన దీపాలగుత్తి, ఆయన అక్కడనుంచి లేచి వెళ్లిపోయాక కూడా చాలా సేపు ముందుకు, వెనక్కు వూగటం ఆగలేదు. ఇదంతా గమనించిన ఆ కుర్రాడు యింటికి వచ్చాక రకరకాలైన రాళ్లు, బిరడాలు, సీసాలు పొట్టి దారాలతోనూ, పొడుగు దారాలతోనూ కట్టాడు. ఆ దారాల రెండో కొసలను తను పడుకొనే మంచానికి పందిరివుంటే ఆ పందిరికి కట్టివేసి, ఒక్కొక్క దానిని కదిలించి చూశాడు. ప్రతిదీ ముందుకు వెనక్కు వూగటం మొదలు పెట్టాయి. ఇలాగు యివన్నీ ఆగకుండా వూగుతుంటే అతనికి బలే సరదా వేసింది. అలా కొన్ని ప్రయోగాలు చేసినమీాదట మీాటరు పొడుగు వుండే దారానికి కట్టిన బరువు ఒకసారి ముందుకు వూగి మళ్ళీ వెనక్కు రావటానికి సరిగా ఒక్క సెకండు కాలం తీసుకొంటుందని కనిపెట్టాడు."

"ఇంతకీ ఆ కుర్రాడి పేరు చెప్పావు కాదు."



"అన్నట్లు - మరచిపోయాను; అతని పేరు గెలీలియో గెలీలి. అంత వరకు బల్లపరుపుగా వున్న భూమిని గుండ్రంగా చేసింది యీయనే."

"అదేమిటి ! భూమి బల్లపరుపుగా వుండటమేమిటీ? దాన్ని యీయన గుండ్రంగా చేయుటమేమిటి ?

"అయితే భూమి ఎలా వుంటుందంటావు."

"భూమి నారింజ కాయవలె గుండ్రంగా నుండును. ఇది ఒకటో క్లాసు చదివే కుర్రాడికి కూడా తెలుసునే !"

"అవును భూమి గుండ్రంగా వుంటుందని యిప్పుడు యింత కుర్రాడికి కూడా తెలుసు కానీ అప్పుడు అంత పెద్దవాళ్ళకు కూడా యీ విషయం తెలియకపోగా, భూమి గుండ్రంగా వున్నదని చెప్పినందుకు యీ గెలీలియోను కాల్చి చంపేశారు."

"ఆయన్ను కాల్చి చంపటం ఎందుకు"

"ఎందుకంటే-తనచుట్టూ తానే తిరుగుతూ, సూర్యుడిచుట్టూ తిరిగే యీ గుండ్రని భూమిని ఆయన ఏ విధంగానూ మార్చలేకపోయాడు కాబట్టి."

"అంతా విచిత్రంగావుందే !"

"అవును. అప్పటి మనుష్యులు, వాళ్ల నమ్మకాలు, వాళ్ళ పట్టుదలలూ అన్ని మనకు విచిత్రంగా కనుపిస్తాయి. గెలీలియో పుట్టే వరకూ యూరుప్‌లో మతభోధకులందరూ భూమిబల్లపరుపుగా వున్నదనే ప్రచారం చేశారు. ప్రజలు



హోటల్ యజమాని. "ఎందుకబ్బాయ్! తలక్రింద పెట్ట కాళ్లు పైకెత్తి నిల్చున్నావ్?" కుర్రాడు. "మరి ఏం చెయ్యమంటావ్! గంటసుపైగా కుర్చీలో కూర్చుంటే నాకేం కావాలో కనుక్కొన్నవాళ్లు ఒక్కరూ లేరు. ఇలాగైనా కూర్చుంటే ఎవరైనా బల్ల దగ్గరకు వస్తారేమోనని"

వాళ్లు చెప్పిన మాటలన్నిటిని నమ్మినట్లే దీన్నీ నమ్మారు. ప్రజల నమ్మకాలను యిలాటి ప్రచారంతో ధ్వంసం చేస్తున్నాడనే కోపంతో ఆ మత బోధకులు యీ గెలీలియోను హతమార్చారు."

"గెలీలియోను అయితే కాల్చి చంపారు కానీ, భూమి గుండ్రగా లేదని ప్రజలచేత నమ్మించగలిగారా?"

"అలా నమ్మించగలిగితే యిప్పుడు మీ రంతా స్కూలు పాఠాలలో భూమి గుండ్రగావున్నదని ఎలా చదువగలరూ? అందుకే—నే చెప్పేదేమంటే - సత్యం అనేది ఎవరు ఎంత దాచాలని చూచినా, బయటకు రాక మానదు. ఈసూత్రాన్ని నవ్వు బాగా జ్ఞాపకం వుంచుకో." (ఇంకావుంది)

కొంగకు కాళ్లు ఎన్ని

అనగనగా సిరిపురంలో ఒక జమిందారు గారుండే వారు. చాలా మంచివాడని పేరు బడ్డాడు. ఎవ్వరితోనైనా సరే చాలా చమత్కారంగా మాట్లాడే వాడు ఆయనదగ్గర శేషయ్యఅని ఒకవంట వాడుఉండేవాడు. వాడు బలే వుపాయశాలి. వాడెప్పుడూ ఎదో ఒకటి చెప్పి జమీందారు గారిని నవ్వించే వాడు. అందుకని జమిందారుగారికి అతనంటే ఎంతో అభిమానం. జమీందారు గారికి వాడిని ఎప్పుడు ఏడిపిద్దామన్నా సమయం దొరికేదు కాదు. ఆయన ప్రతిరోజు వాడిని వెంట పెట్టుకొని- కాలవ గట్టుకి షికారు వెళ్లుతుండే వాడు.

ఒకరోజున ఇద్దరూ కాలవగట్టు దగ్గరకు బయలుదేరారు. కాసేపు అట్లఅట్లా తిరిగి గట్టుమీద కూర్చున్నారు. కాలవలో బోలెడన్ని కొంగలు కనుపించేయి. వాటిని చూసి జమీందారు శేషయ్యతో ఒక కొంగను కాల్చి పట్టుకువచ్చి కూర వండమన్నారు. సరే నని శేషయ్య తుపాకీతో ఒక కొంగను కాల్చి పట్టుకువచ్చాడు.

ఆరాత్రి శేషయ్య కొంగని కోసి మాంచి మసాలా అదీ వేసి, అద్భుతంగా వంట వండాడు. కూర భలే కమ్మని వాసన వేసుంది. అది అంత కమ్మని వాసన వేస్తూంటే వాడు రుచి చూడకుండా వుండ లేక పోయాడు. "ఈకూర ఇంత రుచిగావున్నది గదా! జమీందారు గారు అంతా తినేస్తారేమో! చివరకు నాకు ఏమీ మిగిలబోదని" గ్రహించి, ఉపాయం ఆలోచించసాగేడు. చివరికి దానికాలు ఒకటి తీసి దాచేశాడు.

జమీందారు దంపతులు భోజనానికి వచ్చేరు. భోజనం ముందు కూర్చొని జమీందారు గారు శేషయ్యని తెగ పొగడటం ప్రారంభించారు. శేషయ్య మాత్రం తన గుట్టు ఎక్కడ బయట పడుతుందో నని ఆందోళనపడుతూనే వున్నాడు.

ఉన్నట్టువుండి జమీందారుగారు "ఈకూరలో ఒకటే కాలు కనిపిస్తోంది; రెండో కాలు ఏదోయ్?" అన్నారు.

శేషయ్య మొదట నివ్వెరపోయాడు. చప్పున తేరుకొని "కొంగకి అసలు ఒకటే కాలు గదండీ," అన్నాడు

ఈ జవాబు విని జమీందారు పకపకా నవ్వేడు. "ఒకేకాలేమెటోయ్? కొంగకి కాళ్లు రెండు" అన్నాడు జమీందారు.

"అబ్బే! లేదండీ? నిన్న

(38-వ పేజీ చూడండి)





బొమ్మరిల్లు సీరియల్

డాన్ క్విక్ సెట్

పూర్వ కథ

లామంచా అనే గ్రామానికిచెందిన డాన్ క్విక్ సెట్ అనే వెర్రి వెంగళప్ప ఒకడు తనుకూడా ఒకవీరుడు (నైట్)గా పేరుపొందాలని వువిళ్లూరపడి, 'రోజినాంటీ' అనే ఒక కుంటిగుర్రాన్ని ఎక్కి బయలుదేరాడు. ఒకానొక స్త్రీమూర్తిని ఎంచుకొని ఆమెకు తానే 'డల్ సీనియా' అనే పేరు పెట్టుకొన్నాడు. ఆమెమన్నన సంపాదించటం కోసమే తాను ధర్మరక్షణమనే కఠోరదీక్ష స్వీకరించానని నమ్మాడు.

ఏవేవో వెర్రివెర్రి ఆశలుచూపి శాంకోపాంజా అనే ఒక అమాయకపు కూలీని తన బంటుగా చేసుకొన్నాడు వాడు 'డాపుల్' అనే ఒక గాడిదనెక్కి యీాయన వెనకాలే బయలుదేరాడు 'లాపిస్' కనుమ ప్రాంతంలో ఎవరో యిద్దరు సన్యాసులు, ఒక గుర్రపు బండి, కొందరు మనుష్యులు కలిసి ప్రయాణం చేస్తూ వీళ్లకంటబడారు ఆ సన్యాసులిద్దరూ మాంత్రికులనీ, ఆ బండిలో ఎవరో రాకుమార్తెను వీళ్లు బందీగా తీసుపోతున్నారనీ డాన్ క్విక్ సెట్ వూహించి, వాళ్లమీద యుద్ధానికి వెళ్లాడు. అక్కడ చిన్నయుద్ధం జరిగింది డాన్ క్విక్ సెట్ చేసిన హంగామాకు ఆ గుంపులో వాళ్లు బెదిరిపోయారు ఈయన పెట్టిన షరతులకు ఒప్పుకొని, వాళ్లు తమ దారిని తాము వెళ్లిపోయారు విజయగర్వంతో వీళ్లిద్దరూ అడివిదారిని పడిపోతూ గొర్రెల కాపరుల పల్లెకు చేరారు. ఆ అమాయకులు వీళ్ళకు మర్యాదచేసి తినటానికి యింత తిండిపెట్టారు.

6

ఆ రాత్రి అంతా ఆవిధంగా ఆగొల్లపల్లెలో సుఖంగా కాలక్షేపం చేసి, డాన్ క్విక్ సెట్, ఆయన బంటు మర్నాడు ప్రొద్దునే బయలు దేరారు. ఆ దేమి దురదృష్టమో—ఆరోజు వాళ్లిద్దరూ అనవసరమైన ఒక జంజాటంలో యిరుక్కొని చావు తప్పించుకు బయట పడ్డారు.

బాగా ఎండవచ్చాక రెండుమూడు గంటల సేపు అలాగే రోడ్డువెంట వెళ్ళిన వాళ్లు, అంతలో ఒక పెద్ద పచ్చికబయలు కనిపిస్తే, అందులోకి తమ వాహనాలను మళ్లించారు. బాగా ఒత్తుగా పెరిగిన పచ్చ గడ్డితో ఆ మైదానం కనుల పండువుగా కనుపిస్తున్నది. అక్కడ మంచి నీళ్లవాగు ఒకటి ప్రవహిస్తోంది. ఆవాగు పైనుంచీ వచ్చే చల్లనివాయువులు, ఆతరంగాల ధ్వనిలో వినిపించే మర్మ సంగీతస్వరాలు వీళ్ల మనస్సుల నెంతో వుత్తేజ పరిచాయి. అప్పటి కప్పుడే బాగా ప్రొద్దెక్కిపోయి, ఎండ చితచిత లాడుతున్నది. ఇంత ఎండలో పడిపోవలసినంత తొందరపని ఏదీలేని కారణాన, వీళ్లిద్దరు ఆ చల్లనిచోట కాసేపు విశ్రాంతి తీసుకొని మరీ, ముందు కదిలిపోదామని కూడ బలుక్కొన్నారు. ఆబుద్ధి వాళ్ళకు పుట్టక పోయినా బాగుండేది!



అనువాదం: శ్రీ విశ్వాత్ముల నరసింహమూర్తి

పచ్చిక బయలులో కొంతదూరం వెళ్ళి వాగు ఒడ్డున ఆగారు. ఇద్దరూ వాహనాల మీదనుంచీ దిగి, ఒకచోట కూలబడి పిచ్చాపాటీ మాట్లాడుకొంటూ న్నారు. నిజానికి 'రోజినాన్‌టే'ని ఓ చెట్టుకు కట్టి, దాని విషయంలో శ్రద్ధ తీసుకోవలసిన బాధ్యత అంతా బంటు అయిన శాంకో పాంజాదే. రోజినాన్‌టే అన్ని గుర్రాలలాగా పొగరుబోతు గుర్రం కాదనీ, ఎక్కడ నిల్చోబెట్టితే అక్కడే వుండిపోయేటంత బుద్ధిగల జంతువు అనీ శాంకో పాంజాకు ఒకవిధమైన నమ్మకం. అల్లరి చిల్లరిగా యజమానిని తప్పించుకు పోయే తత్వం యీ ముసలి గుర్రానికి లేదు కదా అన్న ధైర్యంతో, దానిని చెట్టుకు కట్టివెయ్యకుండా యథేచ్ఛగా వదిలివేశాడు, శాంకో పాంజా. దాంతోనే వచ్చింది చిక్కు అంతా!

అంత ఎండవేళప్పుడు చల్లని గాలి ఒంటికి సోకేసరికి ఆస్వామీ, యీ బంటూ వళ్లు మరిచి నిద్రకు పడ్డారు. ఆగాడిదా యీగుర్రం అక్కడా అక్కడా కాసేపు తాచ్చాడాయి. నోటికందిన పచ్చి గడ్డి చివళ్లను సుతారంగా కొరుకుతూ నింపాదిగా అడుగుదీసి అడుగు వేస్తూ ముందుకు సాగి పోతున్నాయి.

ఇంతలో పెద్ద గుర్రాలమంద నొకదానిని మళ్ల వేసుకొని కొంతమంది కాపరులు ఆ మైదానానికే వచ్చారు. వాళ్లు రోజూ యీ మందను యిక్కడికే తోలుకువచ్చి, వాటి యిష్టంవచ్చినంత సేపు వాటిని మేయనిచ్చి, ఆప్రక్కనే వున్న వాగులో యిన్ని నీళ్లు పట్టి, మళ్ళీ యిళ్లకు మళ్లేసుకు పోతుండే వాళ్లు.

తనజాతికి చెందిన గుర్రాలు యిన్ని ఒక్కసారి ఒక పెద్ద మందగా కంటపడేసరికి, 'రోజినాన్‌టే'కి ఏమిటో వళ్లు తెలియని మైకం కమ్మినట్లు అయింది. అవతల ఆయజమాని పడుకొని వున్నాడు కదా, ఆయనను అడిగిపోవాలన్న ఆలోచనన్నా లేకుండా యీ ముసలి గుర్రం ముట్టె ఆడించుకొంటూ, గబగబా ఆమందలో తానూ, తగుదునమ్మా అంటూ, కలియబోయింది. పోనీ ఆగుర్రాలకైనా కాస్త బుద్ధివుండ కూడదూ? తమజాతికి చెందిన గుర్రమే కదా, యీ రోజినాన్‌టే కూడా! అందులోనూ, వయస్సు మళ్లిన ప్రాణికదా! కాస్త మర్యాదగా చూడ కూడదూ? పెద్దా చిన్నా తారతమ్యం లేకుండా, మాటా మంతీ లేకుండా, పూసుకు తిరుగుదామన్న ఆశ కొద్దీ వచ్చిన 'రోజినాన్‌టే' పళ్లు వూడి కిందపడేలా ఒక్కొక్క గుర్రం దీని ముట్టెపైన వెనక కాళ్లతో తన్నటం మొదలు పెట్టాయి. ఇంకా చూడండి! గుంపుగా వస్తున్న గుర్రాలన్నీ, ఫుట్‌బాల్ గ్రౌండులో ఆటగాళ్లు సర్దుకొన్నట్లుగా అక్కడ ఒకటి యిక్కడ ఒకటిగా మైదానం అంతటా సర్దుకొని, యీ ముసలి గుర్రాన్ని అటునుంచి యిటు యిటునుంచి అటు తన్నుతూ విలాసంగా ఆట ఆడటం ప్రారంభించాయి.

లల్లాయి పదాలు పాడుకొంటూ వస్తున్న ఆకాపరులు, గుర్రాల మందలో బయలుదేరిన ఆకలవరాన్ని గమనించి, సంగతేమిటోనని తొందర తొందరగా పరుగెత్తుకొంటూవచ్చి, యీ దృశ్యాన్ని చూశారు. పరాయివాళ్ల గుర్రం ఏదోవచ్చి, తాము అనువాయితీగా తమ పశువులను మేపుకొనే యీ బీడులో పడి తెగతింటూ వున్నదని యీ ముసలి గుర్రం మీద కోపం తెచ్చుకొన్నారు. చేతుల్లోవున్న దుడ్డు కర్రలతో ఆముసలి జీవాన్ని చావచితక పొడిచారు. అలా వాళ్లఅందరి చేతుల దురదా తీరేదాకా కొట్టి కొట్టి, కదలలేని స్థితిలో 'రోజినాన్‌టే'ని వదలి పెట్టారు.

ఈలోగా అక్కడ డాన్ క్విక్‌సెట్‌కు, శాంకో పాంజాకు మెలుకువ వచ్చింది. వీళ్లకు 'రోజినాన్‌టే' చుట్టుపట్ల ఎక్కడా కనుపించలేదు. కొంచెం దూరంలో కర్రలతో ఎవరినో కొట్టుతున్నట్లు, గుర్రపు డెక్కలు కదులుతున్నట్లు, చప్పుళ్లు వినిపిస్తున్నాయి. ఇద్దరూ ఒక్కసారిగా లేచినిల్చొని, ఆ చప్పుళ్లు వినవస్తున్న వైపుకు నురుగులు కక్కుకొంటూ పరుగెత్తారు. తీరా అక్కడికి వచ్చిచూస్తే—ఇంకేముంది? వీళ్లెవరో యీ దుండగులు 'రోజినాన్‌టే'ని చావబాదుతూ వున్న దృశ్యం ఆతని కంటబడింది. ఒక్కమారుగా ఆతని ముఖమూ, కళ్ళు జేవురించాయి. శాంకో పాంజాకు కూడా కోపం వచ్చింది. ఆకోపంతో వాడు, గాలికి కదిలే ఎండుటాకులా, ఎగిరెగిరి పడటం మొదలు

పెట్టాడు. డాన్ క్విసెట్ సర్రున కత్తిదూసి, ముందుకు దూకాడు. శాంకో పాంజాకూడా ఆయన వెనుకాలే గంతులు వేశాడు. అవతల వాళ్ళు అంతమంది వుండగా తామిద్దరమేనన్న విషయమైనా తలపోయ కుండా యిద్దరూ చిందులు తొక్కుతూ పెద్దగా రంకెలు పెట్టారు.

అంతమంది కాపర్లలోనూ డాన్ క్విక్‌సెట్, యాదాలాభంగా నిల్చొనివున్న ఒకడిని వెతికి, వాడి మీద ఒక్కదెబ్బ చరిచాడు దాంతో ఆ కాపర్లందరికీ మాంచి ఆవేశం వచ్చేసింది. అందరూ పెద్దగా కేకలు వేసుకొంటూ ఒక్కసారిగా డాన్ క్విక్‌సెట్ మీదకు కమ్ముకువచ్చి, దుడ్డుకర్రలతో తలా ఒకటీ యిచ్చుకొన్నారు డాన్ క్విక్‌సెట్‌కు పట్టినగతి చూసి ముందుకు పోవటానికీ ధైర్యంచాలక, వెనక్కు రావటానికీ దిక్కుతోచక తికమక పడుతూ అక్కడే నిలబడివున్న శాంకో పాంజాను కూడా ఆకాపర్లు ఆచేత్తోనే రెండు వుతికేశారు. అంతా ఐదు నిముషాలు గడిచేలాగా ఆమైదానం మీద ముందు 'రోజినాన్‌టీ', తరువాత డాన్ క్విక్‌సెట్, ఆ తరువాత శాంకో పాంజాగా, ముగ్గురూ నేలపై వాలిపోయారు. అప్పటికి ఆకాపర్లకు, వీళ్లిద్దరూ కొంపతీసి చచ్చిపోయారేమో అని, దిగులు పుట్టుకొచ్చింది. ఎక్కడివాళ్ళు అక్కడ తమ పశువులను తోలేసుకొని తప్పించుకు పారిపోయారు.

క్షతగాత్రుడైన వీరాధి వీరుడు, శూరాధి శూరుడు డాన్ క్విక్‌సెట్, ఆయన నమ్మిన బంటు, కాబోయే గవర్నరు శాంకో పాంజా—యిద్దరూ వాళ్ళు చితక పొడిపించుకొని మాటా మంతీ లేకుండా, బాధతో మూలుగుతున్న రోజినాన్‌టీ ప్రక్కనే చాలాసేపు పడివున్నారు.

ఎట్టకేలకు శాంకో పాంజా అతి ప్రయత్నం మీద కనురెప్పలు విప్పి, మెల్లిగా మెడ కదిలించి తన స్వామివైపు చూచాడు. ఆయనలో అసలే కదలిక వున్నట్లు కనుపించలేగు. అంతమాట అనరాదు కానీ—ఆయన ప్రాణం కాస్తా 'హరీ' అన్నదేమో అని శాంకో పాంజా గుండె తల్లడిల్లి పోయింది.

"స్వామీ! నా స్వామీ!" అంటూ క్షీణ స్వరంతో ఆయనను పిలిచాడు. ఆ డాన్ క్విక్‌సెట్

గారికి యింకా ఊపిరివున్నది. శాంకో పాంజా పిలిచిన పిలుపు ఆయనకు వినిపించింది. కళ్లు తెరవకుండానే, యింకా అంతకంటే హీనమైన కంఠస్వరంతో "ఏమి కావలెను, సోదరా !" అని బదులు పలికాడు.

శాంకో పాంజాకు ధైర్యం వచ్చింది. తన స్వామి బ్రతికే వున్నందుకు వెయ్యి దేవుళ్లకు దణ్ణాలు పెట్టాడు.

"ఆ ! ఏమీ లేదు;...మన కాళ్లూ చేతులు మళ్ళీ మన స్వాధీనంలోకి రావటానికి అసలు ఎన్నిరోజులు పట్టుతుందో, మీకేమైనా తెలుసునేమో అడుగుదామని పలుకరించాను."

శాంకో పాంజా అడిగిన యీ ప్రశ్నే, డాన్ క్విక్‌సెట్‌ను కూడా యింతసేపు కానరాకుండా లోలోపల సలుపుపెట్టి మహా వేధిస్తున్నది. ఆ ప్రశ్నకు సమాధానం ఏం చెప్పాలో తెలియక, "యిదమిద్ధమని ఏమియు చెప్పజాలము ! శాంకో !" అంటూ అనునయ పూర్వకమైన కంఠస్వరంతో సమాధానం యిచ్చాడు. ఇలా అంటే యీ బంటు మళ్లీ ఎక్కడ దిగులుపడి పోతాడో అని భయంవేసి, డాన్ క్విక్‌సెట్ యీ విధమైన దుర్గతి తమకు ఎందుకు పట్టిందీ, దానికి గల కారణాలు ఎంత అసాధారణమైనవీ, తన కెంత ఓపిక లేకపోయినప్పటికీ, ఓపినంతమటుకు వివరించాడు. వీరుడుగా వ్యవహరించబోయినందువల్లనే యీ తిప్పలన్నీ వచ్చిపడినవని, శాంకో పాంజా ఎక్కడ అపోహపడ్తాడో అనే ఆ తొందర కొద్దీ, వీరులు, వీరులవర్గం--- వీరికిగల ప్రాశస్త్యం అంతా మరొకసారి విడమర్చి చెప్పాడు. అక్కడికీ మనస్సు ఆగక "శాంకో ! అసలు యిందుజరిగిన పొరపాటు అంతయు నాదియే. నీవేమియును వగచెందకుము. నేనా పొరపాటు చేయకయున్నచో, మనకీ గతి పట్టి యుండెడిది కాదు. నాకా విషయము బాగుగ తెలియును. నీవది గ్రహించితివో లేదో గానీ, వీరుల వర్గమునకు చెందిన నావంటి వ్యక్తి, యిట్టి క్షుద్రమానవుల జోలికిపోకూడదు: వారిని కన్నెత్తి చూడరాదు, పన్నెత్తి పలుకరించరాదు. వీరులకు నిషేధితములైన పనిని చేసితిని కనుకనే నాకీ శిక్ష---ఇప్పుడు నేననుభవించుచున్న యీ శిక్ష యికముందైననూ యిట్టి క్షుద్రుల జోలికి బోరాదని హెచ్చరిక చేసినట్లు అయినది. మన మిక సలుపు విహారములలో మరెన్నడైననూ యిట్టి క్షుద్రులతో తలపడవలసిన అవసరమే వచ్చినచో, వారిజోలికి నేను పోను. నీకు వీరాభిషేకము కాలేదు కనుకనూ, నీవు వీరకంకణము కట్టించుకొననందుననూ, అట్టి క్షుద్రులను నీ యిచ్ఛవచ్చిన రీతిని నీవే పరిమార్చుము. నీకా అధికారము నిదే యిచ్చుచున్నాను" అని గంభీరంగా అన్నాడు.

ఇంత పెద్ద అధికారం యిచ్చేస్తున్నందుకు శాంకో పాంజా సంతోషిస్తాడు కదా అని యీయన ఎంతో ఆశపడ్డాడు. కానీ యీయన ఆశ నిరాశ అయింది. తాను ఎవరితో కూడా పోట్లాడేరకం మనిషిని కానని, శాంకో పాంజా సవినయంగా చెప్పుకొన్నాడు. ఎవళ్లు ఎంత అసహ్యంగా ప్రవర్తించినా, తాను వాళ్లపై కత్తి దుయ్యనే దుయ్యననీ, ఏ క్షుద్రుడైనా తప్పి జారి తననొక తప్పుడుమాట ఆడినాకూడా వాణ్ణి వెంటనే క్షమించి వూరుకోవటానికైనా ఒప్పుకొంటాను కానీ, వాళ్లపైకి కాలు త్రవ్వి కయ్యానికి పోలేనని నిక్కచ్చిగా చెప్పివేశాడు.

డాన్ క్విక్‌సెట్‌కు, వీడిమాటలు వింటుంటే, బావురుమని ఏడ్పు వచ్చినంత పనిఅయింది. వీడు యింత పిరికివాడేమిటా, యింత పౌరుషంలేని వాడేమిటా అని అతనికి బలే దిగులువేసింది. ఆదిగులు కొద్దీ ఏదేదో మాట్లాడుతూ, "శాంకో ! రేపు మనము ఆదీవిని స్వాధీన పరచుకొనిన తరువాత, దానిపై పరిపాలనాధికారము, యింత పిరికి గుండెవైన నీకు, నేనెట్లు అప్పగించగల వాడను !! " అంటూ విస్తుపోయాడు.

ఆక్షణాన శాంకో పాంజా మనస్సుకు ముందెప్పుడో రాబోయే గవర్నరుపదవి, ఆ వైభోగాల కంటె కూడా, ప్రస్తుతం పట్టుకు పీడిస్తున్న వళ్లు నొప్పులే అతి ప్రధానంగా తోచాయి. అందుకని ఆమాటల ధోరణి మార్పించడం ఎందుకైనా మంచిదని వాడికి తోచినమీదట, "స్వామీ ! మీరు ఏమైనా కాసలేచి నిలబడగలరేమో ప్రయత్నం చేయకూడదా ? ముందు మీరు లేవగలిగితే, పాపం, మన 'రోజినాన్‌టీ'ని కూడా

లేవదీసి నిలబెట్ట వచ్చునే!" అని సాధింపు ధోరణిలో అన్నాడు.


డాన్ క్విక్ సెట్ వెర్రివాడు అయితే కావచ్చు. ఇంగితజ్ఞానం లేనివాడైతే కావచ్చు. కానీ, కష్టం వచ్చినప్పుడు ఆకష్టాన్ని ధైర్యంగా ఎదుర్కొనే సాహసం మాత్రం కలిగివున్న మనిషి. అతని విషయంలో అంతవరకు ఒప్పుకోకతప్పదు. శాంకో పాంజా ఆవిధంగా దెప్పటం ఆరంభించే సరికి యితనికి పౌరుషం వచ్చేసింది. పళ్లబిగువున, లేని ఓపిక తెచ్చుకొని, ఎక్కడికీళ్లు అక్కడ పట్టుకుపోయినా, అతి ప్రయత్నంతో లేచి నిలబడ గలిగాడు. అసలు యిప్పట్లో లేచి మనిషిలా నిలబడలే ననుకొన్న తనే లేవగలిగినప్పుడు, యీ బంటుగాడు యింకా ముక్కుతూ మూలుగుతూ గడ్డిమీదనే ఎందుకు పడుకొని వుండలో యీయనకు అర్థంకాలేదు. తాను యజమానిని అనీ, వాడు బంటూ అనీ మరొకసారి జ్ఞాపకం తెచ్చుకొని, ఆ వరసను మూలుగుతున్న వాడిని వెంటనే లేచి నిల్చోమని హెచ్చరించాడు.

ఎన్నడూలేనిది తనను యజమాని యిలా గదమాయించేసరికి, శాంకో పాంజాకు ఏం చెయ్యాలో తోచక, ఆయన వుత్తరువు వేసిన ప్రకారమే లేచి నిల్చోవటానికి ప్రయత్నంచేయ నారంభించాడు. ఎంతోసేపు మకీ–, మూలిగీ, రాయిని తిట్టీ, రప్పను తిట్టీ, చెట్టును తిట్టీ, పుట్టను తిట్టీ, చిట్టచివరకు ఎలాగైతేనేం—ఆ దెబ్బలతోనూ, ఆ గాయాలతోనూ కట్టెలా బిగుసుకుపోయిన తన కాయాన్ని, భూమిమీద నుంచీ లేవదీసి, విల్లంబు బద్ద వంగినట్లు వంగి నిలబడ కలిగాడు. నిలుచుని వున్నప్పుడు అతని వెన్నముక అలా వంకరగా తప్పితే, నిటారుగా వుండటానికి ఎంత ప్రయత్నించినా అవకాశం యివ్వనే లేదు. అలాగే ఆగూను తోనే నడుచుకొంటూ పోయి 'రోజినాన్ టీ'ని లేవదీయటంలో తన యజమానికి యింత సహాయంకూడా చేశాడు. లేచిన వాణ్ణి ఎలాగూ లేచానుకదా-అని, తనగాడిద 'డాపుల్' ఎక్కడికిపోయిందోనని, దాన్నికూడా వెతికి పట్టుకు వచ్చుకొన్నాడు.

నడుం వంగిపోయినా కూడా అలాగే తంటాలు పడి డాన్ క్విక్ సెట్ గారిని లేవనెత్తి 'రోజినాన్ టీ' వీపున కుదేశాడు. చావుదప్పి కన్ను లొట్టపోయి వున్న 'రోజినాన్ టీ'కళ్లేన్ని తెచ్చి, తన గాడిదతోకకు అంటగట్టాడు. ఆగాడిద కళ్లేన్ని తాను చేత్తో పుచ్చుకొని, యీ జీవాలన్నిటినీ రోడ్డుమీదికి చేరవేద్దామనే తలంపుతో తన గాడిదను అదిలించాడు. ఆగాడిద తను నడవగలిగినంత నింపాదిగా నడక సాగించింది. అథవా—ఆగాడిద అంతకంటే వడిగా నడిచినా కూడా ఆ 'రోజినాన్ టీ' కానీ, యీ వీర శూరాగ్రేసరుడు డాన్ క్విక్ సెట్ గారు కానీ, యీ బంటు శాంకో పాంజాకానీ ఆవేగానికి ఆగలేక పోయేవాళ్ళే!

శాంకో పాంజాకు రోడ్డు ఏవైపున వున్నదో సరిగా తెలియదు. అయినా ఏవైపున వుంటుందోనని ఒక క్షణకాలం యోచించి, ఏవైపున వుంటుందని తనకు తోచిందో ఆవైపుకే, మిగిలిన ప్రాణులను కూడా నడిపించాడు.

(ఇంకా వుంది.)



రెండు మహానగరాలు

(23-వ పేజీ తరువాయి)

'ఎబ్బెబ్బే! ఎంతో వ్యవధి అవసరంలేదు రెండుమూడు గంటల వ్యవధిలో తేల్చేసి స్వయంగా మీ గృహానికివచ్చి, తాడూ బొంగరం తేల్చి చెప్పేస్తాను.

'సరే! వస్తున్నాను—రాత్రికి ఏ సంగతీ చెప్పించండి వెళ్లొస్తాను—సెలవు.' స్ట్రియివర్ వెళ్లిపోయాడు. ఆరాత్రి పది గంటలయ్యేసరికి, లారీ స్ట్రియివర్ ఇంటికి వచ్చాడు. మామూలు పరామర్శలు పూర్తిఅయిన తరవాత లారీ నెమ్మదిగా ఉపక్రమించాడు:

'నేను డాక్టర్ గారి యింటికి వెళ్ళొచ్చాను'—

'వెళ్లొచ్చారూ?—పండా కాయా?—

'నేను యిచ్చిన సలహా మంచిదేనని ఇప్పుడు నాకు బాగా నమ్మకం కలిగింది?

'నేను చాలా విచారిస్తున్నాను—ఇందులో నాకు వచ్చిన నష్టమేమీ లేదనుకోండి—ఇలాంటి సదవకాశం జారవిడుచుకున్నందుకు ఆ కుటుంబం తరుచు-చిరకాలం పస్తాయించవలసి వస్తుందని నా విచారం—సరే ఈ విషయం ఇక మనం విచారించాల్సిన పనిలేదు' అన్నాడు స్ట్రియివర్ అదో దర్జాగా.

'మీఅభిప్రాయమేమిటో, నాకు బోధపడలేదు.'

'ఏవుందండీ! వాళ్ళేదో తెలివిగలవాళ్ళనుకున్నాను. ఆడవాళ్ళు ఇలానే తెలివితక్కువపనులు చేస్తూ వుంటారు. దారిద్ర్యం అనుభవించేటప్పుడు తరువాత పస్తాయిస్తారు. నేనేదో లేనిపోని ఉదారతలకు పోయాను. ఈ సంబంధంవల్ల నిజానికి నాకు కలిసివచ్చే దేమిటండీ? ఇంకా నయం వెళ్లి అడిగి లేదనిపించుకున్నానుగాదు. నలుగురిలో తలెత్తుకు తిరిగే ఆస్కారం వుండేది కాదు. బతికించారు. ఈ ఆడపిల్లల తలతిక్కలు ఇలానే వుంటై. మీ సలహాకు కృతజ్ఞుణ్ణి.'

లారీ సెలవు తీసుకుని వీధిలోకి వచ్చేసరికి బాగా పొద్దుపోయింది. స్ట్రియివర్ సోఫామీద పడుకుని ఆకాశంవంక చూస్తూ గోళ్ళు కొరుక్కుంటున్నాడు. ★

కొంగకు కాళ్ళు ఎన్ని?

(32-వ పేజీ తరువాయి)

నీళ్ళలో వుండగా నేను చూసేనుగా ఒకటే కాలండీ" అన్నాడు శేషయ్య.

"సరే! రేపు చూపిస్తాను ఎవరు నెగ్గుతారో చూద్దాం" అన్నారు ఆయన.

సరే; ఆ సాయంకాలం ఇద్దరూ బయలుదేరారు. చెఱువు దగ్గరకి రాగానే వంటవాడు సంతోషంతో అటువేపు చూపిస్తూ "కావలిస్తే చూడండి కొంగకి ఒకటే కాలు" అన్నాడు. ఇతను చూపెట్టిన ఆ కొంగ నీళ్లల్లో ఒక కాలు ముడుచుకొని నిలబడి వుంది. (కొంగ ఒకకాలు యిలా ఎత్తి నిల్చొని వుండటాన్నే కొంగ జపం అంటారు) ఈ సంగతి శేషయ్య తెలుసుకోలేక పోయాడు.

"కాదోయ్ సరిగా చూడు;" అంటూ జమీందారు చేత్తో చప్పట్లు కొట్టేడు. ఆకొంగ గబుక్కుని రెండో కాలు కిందికి దింపేసింది.

"కొంగకి కాళ్లు ఎన్నో యిప్పుడు చెప్పు?" అన్నారు జమీందారు గారు హేళనగా. కాని వంటవాడు ఆయనకంటే రెండాకులు ఎక్కువే చదివేడు. "అవునండీ; నిజమే! మీరు చప్పట్లు కొట్టగానే రెండవ కాలు వచ్చేసింది. నిన్న మీరు అన్నం దగ్గరకూడా ఇల్లాగే చప్పట్లు కొట్టివుంటే ఆకొంగకు కూడా రెండవ కాలు కనపడేదేమో!" అన్నాడు చమత్కారంగా.

శేషయ్య యిచ్చిన జవాబు విని జమీందారు గారు చాలా సంతోషించేరు. "నిజంగా నీది చాలా తెలివైన బుర్రోయ్" అంటూ జేబులోంచి ఐదు రూపాయల కాగితం ఒకటి తీసి వాడిచేతిలో బహుమానంగా పెట్టేరు. ★

గెలుపు

(2[illegible]-వ పేజీ తరువాయి)

న్నారు. లేనిపోని అసూయ. చుట్టుప్రక్కల పలకరించేవాళ్ళే లేరు. ఎటుపోవాలన్నా భయమే. కిళ్ళీకొట్టువాడు, చింతపండు బండివాడు, పెట్టెలవాళ్లు అందరూ స్నేహ కోటిలో వాళ్ళే పూర్వం. ఈగెలుపు తర్వాత ప్రతిఒక్కడూ పక్కలో బల్లెం. ఇంట్లో శాంతమ్మతోపాటు - ఇతర చిన్ననౌకర్లకి ఒక్కో రూపాయ ఇచ్చాడు. అయినా తృప్తిలేదు. డబ్బిచ్చి శత్రుత్వం కొని తెచ్చుకున్నట్టు ఇంటికి వెళ్లడానికి భయం తో. త్రోవలో ఎవళ్ళువచ్చి ఏంచేస్తారో? గుక్కెడు ప్రాణం తియ్యడానికి ఎంత సేపు కావాలి? తాను ఇంటికి చీకటిలో నడచివెళ్తూ ఉంటాడు, ఆ ప్రక్కసందులో నించి వచ్చి ఏ చాకుతో గుచ్చివేసిగా పైసలా- చాకు దాకా ఎందుకు; గట్టినా బలంఅయిన చేతులతో పీక నొక్కివేసినా చాలు. ఇంతెందుకు - ఆ యెత్తుగోడమీద నించి ఒక బండరాయివేస్తే చాలు పచ్చడి అయిపోతాడు. అయ్య బాబోయ్! అప్పుడే చావు ఏమిటి? తాను ఇంకా చాలకాలం జీవించాలి. తన వయస్సు 28 యేండ్లేకాదూ? ఇంకా సగం వయస్సు పైగా ఉంది. తాను అనుభవించింది ఏముంది? కష్టాలతోటే సరిపోయింది. తమ్ముళ్లను చదివించడం, కుటుంబ ఖర్చులు భరించడం. పెళ్ళిచేసుకోవడం ఇవన్నీ కష్టంతో కూడిన ఖర్చులే. తన సంపాదన అంతా ఎలాగో ఖర్చుఅయిపోతూ వుంది. చంటిపిల్లవాడికి జబ్బుచేస్తే అయ్యగారివద్ద నించి అడ్వాన్సు పదిరూపాయలు తీసుకోవలసివచ్చింది. ఆ మహారాజు దయగా వదిలేశారు కనక సరిపోయింది కాని యీ పదిరూపాయలు తగ్గితే ఎంత కష్టం అయ్యేది. ఏమైనాసరే బతికిఉంటే బలుసాకైనా తినవచ్చు బలుసాకు ఏమిటి - ఈ గెలుపు సొమ్ముతో ఒక చిన్న యిల్లు ఏర్పాటుచేసుకొని అక్కడే ఒక గేదెను కొంటే దానివల్ల నెలకోవంద, వంద యాభై మిగులుతాయి. ఆ ప్రక్కయింటి పెరుమాళ్లు చూడరాదూ? ఒక్క గేదెతో ఎలాంటి వ్యాపారం చేస్తున్నాడో! అయితే తనకు ఎలాగు కుదురుతుంది? ఆడదాని తెలివితేటలలో ఉంది పెరుమాళ్లు పెళ్లాం కుప్పమ్మకున్న తెలివితేటలు తన భార్యకున్నాయా? పిల్లవాడిని పెంచడానికే పెద్ద బ్రహ్మాండం చేస్తుంది? అయితేయేం లే-గేదె ఒకటి కొనిఉంచితే ఒక మనిషిని పెట్టుకోవచ్చు. అన్నీ బాగానే ఉన్నాయి ముందు ఈ గండం గడచి బయటపడితేను! వాళ్లు ఇరుగుపొరుగు వాళ్ళు ఎంత దుర్మార్గంగా ఉన్నారో! పోలీసువాళ్ళకు రిపోర్టుచేస్తేనో? ఏం లాభం? ఏమైనాసరే వారం పదిరోజుల వరకు ఇంటికి వెళ్ళకూడదని నిశ్చయించాడు. డ్రైవరు నాయరు మా యింటిలోనే కారు షెడ్డులోనే ఉండిపోతున్నాడు. పగలుబట్టలుమార్చుకోవడానికి వెళ్లి మళ్లీచిన్న కారులో వచ్చేశాడు. ఈ సంగతి చూడలేక మేము పోలీసువారికి కూడా రిపోర్టుచేశాం. వాళ్లు వచ్చి ఇరుగుపొరుగు వాళ్ళను అందరినీ విచారించి వెళ్ళారు. వాళ్లు అందరూ ఏమీ ఎరగనట్టు నటించారు. మళ్ళీ పోలీసువాళ్లు పోగానే-గేదె కొన్న పెరుమాళ్లూ, చింతపండు అమ్మే సంబంధం కలిసివచ్చి-'ఏం నాయరు! గేదె కొంటావట నిజమా? ఈ గెలుపు చూచుకొని కళ్లు నెత్తిమీదకు వచ్చాయే?" అని చేతిలో గడ్డపార నెత్తిమీదికి ఎత్తాడు.

నాయరు గుండెలో ప్రాణాలు నిలువునా ఎగిరిపోయినంత పని అయింది. ఆవేళ ఇంటికి వెళ్ళినపుడు పెళ్లాం విసుగుకుందట. "ఇదేమిటి-గెలుపువచ్చిన తర్వాత బొత్తిగా మతిపోయినట్టు ఉందేమిటి? ఇంటిపట్టున ఒక్కక్షణం ఉన్నదే అరుదైపోయింది" అన్నదట. కోపంమీద పెళ్ళాన్ని చెంప వాచేటట్టు కొట్టి తిరిగి వచ్చాడు.

ఆవేళ కారులో మేమంతా వెళ్తూ ఉంటే పరధ్యానంగా డ్రైవుచేస్తున్నాడు. ఎదురుగా లారీవస్తూ ఉంది. చూచుకోలేదు. టర్నింగ్‌లో హారన్ కొట్టడం మరచిపోయాడు. ఈ కారు ఢీకొని-పప్పుఅయిపోవలసిందే. ఒక వీసంలో తప్పిపోయింది. మా కందరికీ గండం గడచింది. మా బావగారు నాయరుమీద కేకలేశారు. పనిలోంచి తీసివేస్తామన్నంత కోపం చూపించారు. నాయరు క్షమార్పణ కోరుకున్నాడు.

నాయరుకి ఏం తోచిందో బ్యాంకుకి వెళ్లి ఆ సొమ్ము తీసుకొనివచ్చి-అందరికీ పంచిపెట్టివేశాడు. గేదెవాడు, చింతపండువాడూ, కిళ్ళీకొట్టువాళ్లూ-యింకా చాల మంది పంచుకొన్నారు. భార్యకు ఏమాత్రమో ఇచ్చాడు. ఆ గెలుపు సొమ్ము తనదగ్గర ఉన్నంతకాలం తనలో బలం అంతా పోయినట్టయింది. క్షణక్షణం తానొక నీడలాగ అయిపోతున్నట్టు తోచింది. అది పోగానే ఎప్పటివాడు అయ్యాడు. ఆ సొమ్ము తన దగ్గర ఉండటం ఏదో అపరాధం చేస్తున్నట్టు అనిపించింది. ఎంత మందికో అన్యాయంచేసి వాళ్ల ధనం తాను బలవంతంగా లాక్కున్నట్టు తోచింది. అందుకే అది అయిపోగానే - కొంత భారం తగ్గినట్టయింది.


ఇది జరిగిన మరునాడు రాత్రి పదిగంటలకు మమ్మల్ని వదలిపెట్టి యింటికిపోతున్నాడు. ఇదివరకు తనకు తెలియనివాళ్ళు ఇద్దరు ఎదురయ్యారు. వాళ్ళ చేతిలో ఇనపకడ్డీ లున్నాయి. "ఏం నాయరూ! గెలుపు వచ్చిందటనే" అని పలుకరించారు.

"వస్తే మీకేం?" అని ఎదుర్కున్నాడు. వాళ్ళు వికటంగా నవ్వి ఇనపకడ్డీలు చూపారు.


"ఇది వేళాకోళంగా ఉందా? గెలుపు వచ్చింది పోయింది. ఈమాటు నన్ను భయపెట్టాలని చూస్తున్నారేమో. రండి-ఏం చేస్తారో" అని ఒకడిమీద కలియబడి ఇనపకడ్డీ లాగుకుని రెండోవాడిని ఎదుర్కొన్నాడు. ఇద్దరినీ చావమోదాడు. ప్రళయ కాలరుద్రుడిలాగ నాట్యంచేశాడు. అతనిలో కొత్తబలం చూచి ఆ దుండగీండ్రు పరారీఅయ్యారు ఇన్నాళ్లు భయంవల్ల అణగారిపోయిన తన శక్తులన్నీ ఒక్కసారి ప్రజ్వలించాయి. తిరిగి మనిషి అయ్యాడు. ఇదివరకు, పరిస్థితులకు వాటిని వీలుచేసుకొని తనమీదపడిన మనుషులకీ లొంగిపోయాడు. ఈనాడు, ఈ సమయంలో వాటి నన్నిటినీ లొంగదీసుకున్నాడు. అణగారిన తన బలాన్ని కనుక్కున్నాడు. కొత్త ధైర్యం తెచ్చుకున్నాడు. కొత్తశక్తి తెలుసుకున్నాడు. మనిషిఅయ్యాడు. ఇంతవరకు తాను భయపడిన శత్రువులు తాను కల్పించుకొన్నవాళ్ళే. తనలోని దౌర్బల్యాలే. తనలోని చేతకానితనం, పిరికితనం సృష్టించినవే. అవి పారద్రోలిన వెంటనే బ్రతుకు పోటీలో గెలుపు సాధించాడు. అదృష్టం, ఛాన్సు, అవకాశం ఇచ్చిన గెలుపుకంటె ఈ గెలుపు వెయ్యిరెట్లు సుఖం ఇస్తుంది. ఆనందం కలగజేస్తుంది. మనిషిని మనిషిగా నిలవబెట్టుంది అవలీలగా రెండువేలరూపాయల గెలుపు ఇయ్యలేని ఉత్సాహం, ఓజస్సు ఒక్క క్షణంలో ఈగెలుపు వల్ల తనకు లభించింది.

నాయరు గెలిచాడు. ఇంక ఫరవాలేదు.

★



జెమినీవారి "ముగ్గురు కొడుకులు"లో ముగ్గురు కొడుకుల తల్లి కన్నాంబ.



బొంబే టాకీస్ వారి "మా" చిత్రంలో శ్యాము, భారత్ భూషణ్.

ప్రభుత్వం సినిమాలు తీయవచ్చా?

భారత ప్రభుత్వపు ఫిల్ము ఉపశాఖ కథా చిత్రాలు నిర్మించటానికి చేసిన నిర్ణయం చాలమంది నిర్మాతలకూ, వారి అభిమానులకూ కోపకారణమైంది. డాక్యుమెంటరీ చిత్రాలు నిర్మిస్తే నిర్మించవచ్చుగాని కథా చిత్రాలజోలికి రావటానికి ప్రభుత్వానికి అర్హతలేదని, ప్రజాధనం దుర్వినియోగం చేయటం తప్ప మరేమీ ఫలితం ఉండదనీ కొందరు గట్టిగా వాదిస్తున్నారు. ముఖ్యంగా చందూలాల్ షా అధ్వర్యాన ఉన్న ఫిల్ము ఫెడరేషను తీవ్రంగా ప్రతిఘటిస్తోంది.

ఫిల్ము డివిజనువారికి కథాచిత్రాలు తీసే అర్హత, సమర్థత లేదనటం సాహసం. ఫిల్ముకళనుగూర్చి, పరిశ్రమనుగూర్చి ఏమీ తెలియని ప్రైవేటు నిర్మాతలనేకులు సాహసించి ఫిల్ము రంగంలోకి ప్రవేశిస్తున్న ఈ కాలంలో, డాక్యుమెంటరీ చిత్రాలలో మంచి అనుభవం సంపాదించిన ఫిల్ముశాఖవారు కథాచిత్రాలను తీయ సంకల్పించటంలో తప్పేమీ లేదు. అనేక సంవత్సరాల అనుభవమున్న నిర్మాతలు కూడా అర్థంపర్థంలేని అనుకరణ చిత్రాలు తీసి దెబ్బతింటున్నారు.


సినిమారంగమంతటా వ్యాపారదృక్పథం నిండివుంది. ఈ సమయంలో, లాభాల మీదనే దృష్టి కేంద్రీకరించకుండా ఒక నిర్దిష్టమైన సాంఘిక ప్రయోజనాన్ని ఆశించి ప్రభుత్వం సినిమారంగంలోకి ప్రవేశిస్తే అది హర్షించదగినపనే గాని గర్హించవలసినది కాదు.

అయితే ప్రభుత్వపు ఫిల్ముశాఖ కథా చిత్రాలు తీయటంలో కొన్ని చిక్కులు లేకపోలేదు. మామూలు నిర్మాతలవలె ఫిల్ముశాఖవారు ఏ కథావస్తువును పడితే ఆ కథావస్తువును తీసుకొనటానికి వీల్లేదు.

ప్రేమకథలు, దొంగల కథలు, డిటెక్టివ్ కథలు, జానపద కథలు మొదలైనవాటిని ప్రభుత్వం వర్జించవలసిఉంటుంది. ఇక

పోతే చారిత్రిక కథలు, సాంఘిక కథలు. సాంఘికకథలుకూడా మిగతా నిర్మాతల వలె ప్రత్యేకం వినోదంకోసం తీయటానికి వీల్లేదు. దేశంలోని ఆర్థిక, రాజకీయ పరిస్థితులను ప్రతిబింబించేటట్లు కథలు రాసుకోవాలి. అంటే దాదాపు డాక్యుమెంటరీల మాదిరిగానే ఉండే కథలు తీసుకోవాలన్నమాట. రష్యన్ ప్రభుత్వం తీయించే చిత్రాలన్నీ ఇలాగే ఉంటాయి. సాధారణంగా రష్యన్ చిత్రాలలో ప్రాజెక్టుల నిర్మాణమో, సమష్టి వ్యవసాయమో, ఫ్యాక్టరీలలో ఉత్పత్తియో కథావస్తువుగా ఉంటుంది. పాత్రల వ్యక్తిగత సమస్యలకంటే పాత్రలు ఎదుర్కొనే సామాజిక సమస్యలకే ఎక్కువ ప్రాధాన్యముంటుంది. అందుచేతనే రష్యన్ చిత్రాలలో ప్రచారం తప్ప మరేమీ ఉండదని కొందరు విమర్శించటం జరుగుతున్నది. కాని ఏ ప్రభుత్వమైనా సినిమాచిత్రాలు తీయటానికి పూనుకున్న తరువాత, ఆ చిత్రాలలో సామాజిక శ్రేయస్సును ప్రయోజనంగా పెట్టుకున్న కథావస్తువులు ఉండక తప్పదు. ఎందుకంటే అబ్బాయి అమ్మాయిని ప్రేమించటం, విరహ వేదనలు పడి విషాదగీతాలు పాడటంలాంటి విషయాలను ప్రభుత్వం చిత్రిస్తే హాస్యాస్పదమై ఊరుకుంటుంది. ప్రజల ప్రతినిధి అయిన ప్రభుత్వం ప్రజలందరికీ సంబంధించిన సమస్యలను చిత్రించటం తప్పనిసరి.

అయితే "సెమీడాక్యుమెంటరీ కథా చిత్రాలు" తీస్తే ప్రజలను ఆకర్షిస్తాయా అని కొందరికి సందేహం కలగవచ్చు. రష్యన్ చిత్రాలనుబట్టి చూస్తే అటువంటి సందేహం అనవసరమనిపిస్తుంది. రష్యన్ చిత్రాలు సాధారణంగా మొదటివారాల్లోనే ఉత్పత్తి వ్యయాన్ని రాబట్టుకోవటమే కాకుండా అనేకరెట్లు లాభాలు కూడా గడిస్తాయని రష్యా వెళ్లివచ్చిన భారతీయ ఫిల్ము ప్రతినిధులలో ఒకరు చెప్పారు. జె. ఏ. విల్సన్ అనే బ్రిటిష్ ఫిల్ము విమర్శకుడు ఒక వ్యాసంలో రష్యన్ చిత్రాలనుగూర్చి రాస్తూ ఇలా అన్నాడు: రష్యన్ చిత్రాలలో కమ్యూనిస్టు ప్రచారం, ఇతర దేశాలపై అపనిందలు వేయటం, చరిత్రను తారుమారు చేయటంలాంటి దుర్లక్షణాలు చాలా ఉన్నాయి. కాని రష్యన్ చిత్రాలను



తను చెప్పించిన హరికథకు పోకుండా జనమంతా ఊళ్లో వారి కథకు వెళ్లినందుకు తన పరివారాన్ని దూయబడుతున్నాడు షావుకారు గణపతి (రంగారావు), కొండయ్య (నాగభూషణం), గుమాస్తా పంతులు (డా. బసవరాజు), సుబ్బన్న (సి. హెచ్. కుటుంబరావు) పీపుల్స్ ఆర్టు వారి "పల్లెటూరు" లో.



అంజలీవారి "పరదేశి"లో చిన్నజోడా వసంత, గణేశన్.

అసంఖ్యాక ప్రజలు ఆసక్తితో వచ్చి చూస్తారన్నమాట అక్షరాలా నిజం...

ఇదే నిజమైతే మన ప్రభుత్వం తీయబోయే చిత్రాలు కూడా విఫలం కావలసిన అవసరంలేదు. రష్యన్ చిత్రాలలో, కామోద్రేకం కలిగించే దృశ్యాలు ఉండనే ఉండవు. సెక్సు విషయంలో నేటి రష్యన్లు మనకంటే కూడా ఎక్కువ "ప్యూరిటన్లు." అయినా వారి చిత్రాలు బాక్సాఫీస్ విజయం పొందుతాయంటే, రసవిహీనమని మన విమర్శకులు ఎంత నిరసించినా వారి చిత్రాలు ప్రజాదరణపాత్రము లవుతున్నాయంటే మన ప్రైవేటు నిర్మాతలు వాటినుండి గ్రహించవలసింది ఎంతో ఉందన్నమాటే.

సెక్సు అప్పీలు, స్టార్ అప్పీలు. మొదలైన బాక్సాఫీస్ సూత్రాలను తూచా తప్పకుండా అనుసరించే చిత్రాలనేకం దెబ్బ తినటం మనం కళ్లారా చూస్తున్నాం. ఇటువంటి వేమీ పెట్టుకోకుండా కొత్త దృక్పథంతో ప్రభుత్వం చిత్రాలు నిర్మిస్తే అది ప్రైవేటు నిర్మాతలకు కనువిప్పులాగా పని చేస్తుంది. ★

సినిమా వార్తలు

జెమినీవారి "ముగ్గురు కొడుకులు" తమిళ భాషా చిత్రం ఈ నెల 11 వ తేదీన మద్రాసులోనూ, తమిళనాడులోనూ విడుదల అవుతున్నది. తెలుగు తర్జుమా కూడా త్వరలోనే విడుదల చేయటానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. కన్నాంబ, ఎమ్. కె. రాధ, నాగేంద్రరావు, శ్రీరాం, జానకి మొదలైనవారు నటిస్తున్నారు. డైరెక్టరు నాగేంద్రరావు. సంగీతం ఈమని శంకర శాస్త్రి.

*　　*　　*

బాంబే టాకీస్ వారి "మా" చిత్రం ఇటీవల బొంబాయిలో విడుదల అయి ప్రేక్షకుల ప్రశంసలు, పత్రికల ప్రశంసలు అందుకున్నది. ఈ ఏడు విడుదలై విజయవంతమైన కొద్ది హిందీ చిత్రాలలో ఇదొకటి అట. లీలాచిట్నీస్ తల్లిగా బాగా

(48-వ పేజీ చూడుడు)

★  ★

"షిన్ షినాకి బుబ్లాబూ" లో కథానాయకి రెహనా.

ప్రశ్నలు - సమాధానాలు

జి. అంజయ్య—హైదరాబాదు.

ఆంధ్రపత్రిక వారపత్రిక ప్రారంభ సంచిక ఏ తేదీన వెలువడింది?

—ప్లవంగనామ సంవత్సర భాద్రపద శుద్ధ చవితినాడు, (వినాయకచవితి 1907 సెప్టెంబరు) బొంబాయిలో ఆంధ్రపత్రిక వారపత్రికగా ప్రారంభమైంది.

* * *

కె. వెంకటరాజు, విజయపురం, చిత్తూరుజిల్లా.

ప్లానింగ్ కమిషన్ సిఫార్సులకు విరుద్ధముగా, ప్రజాభిప్రాయమునకు వ్యతిరేకముగా కృష్ణాపెన్నారు ప్రాజెక్టు నిర్మించాలనటంలో తెలుగు మంత్రి శ్రీరంగారెడ్డిగారి ఉద్దేశ్యమేమిటి?

—మన ప్రాజెక్టులను గూర్చి ఖోస్లా కమిటీవారి నివేదిక ఇంకా ప్లానింగ్ కమిషన్‌కే అందలేదు. ఈలోగా 'స్వకీయ' భావాల కనుగుణంగా ఎవరెంత ప్రచారం చేసినా పట్టించుకోనక్కర్లేదు.

* * *

బి. టి. వసంతకుమార్—విశాఖపట్టణం.

కమ్యూనిస్టు, సోషలిస్టు, కె. ఎమ్ పి. పార్టీలుకలిసి ముందు ముందు కాంగ్రెసు ప్రభుత్వాన్ని పడగొట్టగలవని బలమైన సూచనలు కనిపిస్తున్నాయి. ఈపార్టీల కలయికవలన కాంగ్రెసు పతన మవుతుందా?

—మీకంత బలమైన సూచనలుకనపడుతుంటే ఎలా కాదనడం?

స్వామి సీతారాంగారి నిరాహారదీక్షవలన ప్రభుత్వంలోగాని ప్రజలలోగాని ఏవిధమైన చలనమూ కలగలేదంటాను. ఇకముందుకూడా వారి నిరాహారదీక్షలవలన ఏమీ లాభంవున్నట్లు కనపించదు. మీరేమంటారు?

—సత్యాగ్రహ భజనలూ, నిరశన వ్రతాలూ, వనభోజనాలవల్ల ప్రజల్లో సంచలనం కలిగితే ఇంకేం? ఏటికోకరూ కూటికోకరూ లాగే రాజకీయ నాయకులవల్ల ఏది సాధ్యపడుతుంది?

* * *

బి వి. విశ్వం—శ్రీకాకుళం.

ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర నిర్మాణానికి ఉపవాస దీక్షలు పనిచేయవనుకుంటాను.



ప్రతిభావారి "చిన కోడలు"లో సూర్యకాంతం, కృష్ణకుమారి, శేషమాంబ.



నేషనల్ ప్రొడక్షన్సు వారి "సింగారి" లో పద్మిని, లలిత.

మరి ఏమి చేస్తే త్వరగా మనం ప్రత్యేక రాష్ట్రాన్ని కళ్ళచూడగలం?

—ఉపవాసాలు చెయ్యడం ఇంకేమీ చెయ్యలేక నేమో! ఆంధ్రదేశనాయకులందరూ శీర్షాసనాలు వేసి చూడవచ్చు.

*   *   *

ఎ. వి. రమణ—చీరాల.

—విద్యాసంపన్నులైన ఎన్. టి. రామారావు, రంగారావు, రామశర్మ, శ్రీరామమూర్తి, ముక్కామల సినిమారంగములో చేరుట కళను వృద్ధిచేయుటకా, లేక ధనార్జనకా?

—"కావ్యం యశసే అర్థకృతే వ్యవహారవిదే శివేతరక్షతయే సద్యఃపర నిర్వృతయే కాంతాసమ్మితతయా ఉపదేశయుజే."

*   *   *

నాగుబోయిన కోటేశ్వరరావు—మైనం పాడు

భారతప్రభుత్వముచే పాశ్చాత్య నిర్మాతయైన గేబ్రియల్ పాస్కల్‌కు గాంధీ జీవిత చరిత్రకు సంబంధించిన ఫిల్మ్‌హక్కులు ఇవ్వబడ్డాయి. భారతీయుడైన ఏ నిర్మాత కూడా గాంధీ జీవితచరిత్రకు న్యాయము చేయజాలడనియేనా భారత ప్రభుత్వపు ఉద్దేశ్యం?

—గేబ్రియల్ పాస్కల్ గాంధీ జీవిత చరిత్రను అన్ని దేశాల ప్రేక్షకులకోసమూ ఉద్దేశించి ఇంగ్లీషులో తీస్తున్నాడు. అంతర్జాతీయంగా పాస్కల్‌తో తూగగల నిర్మాత మనదేశంలో ఇప్పటిదాకా లేడన్నమాట వాస్తవమేకదా!

ఇండియాలోని అభ్యుదయ రచయితలను గూర్చి మీ ఉద్దేశ్యమేమిటి?

—అభ్యుదయ రచన అంటే ఏమిటో అభ్యుదయ రచయితలకే ఇంతవరకూ అంతు పట్టలేదు.

మార్క్సిజం, లెనినిజం, స్టాలినిజం వీటిలో గల తేడా లేమిటి?

—మార్క్సిజం విత్తనం, లెనినిజం మొక్క, స్టాలినిజం పూవులూ కాయలూ.

*   *   *

ఎమ్. సత్యనారాయణ—నిడదవోలు.

ఒక చిత్రము విజయవంతమైనదని ఎప్పుడు చెప్పబడును?

—ప్రస్తుత పరిస్థితినిబట్టి చూస్తే, నిర్మా

తను ఖర్చుపెట్టిన డబ్బు దక్కితే చిత్రం విజయవంతమైనట్టే.

* * *

వి. సుబ్రహ్మణ్యం—(కాళహస్తి)

పేరెన్నికగన్న నటునికి ప్రజాభిమానం కావలెనా, ప్రొడ్యూసరు అభిమానం కావలెనా?

—ప్రజాభిమానం పొందిన నటునికి ప్రొడ్యూసరు అభిమానం నిముషాలమీద లభిస్తుంది.

* * *

కె. శ్రీనివాసరావు—తడ.

ఇద్దరు డైరెక్టర్లున్నారనుకోండి. ఒకరు నటనానుభవం లేనివారు; మరొకరు నటుడుగా ప్రఖ్యాతిగాంచిన తరువాత డైరెక్టరు పదవికి వచ్చినవారు. వీరిద్దరిలో ఎవరు ఉత్తమ డైరెక్టరగుటకు వీలుంది? ఎందుచేత?

—ఉత్తమ డైరెక్టరు అవటానికి నటనానుభవం ఉండటం మంచిదే కాని తప్పని సరికాదు.

కవిత్వమునకు అవసరమైన హంగులెవ్వి? యతిగణప్రాస నియమము లేక వ్రాయు కవిత్వమొక కవిత్వమగునా?

—"హంగుల" జాబితా కావలిస్తే పెద్దనగారి "నిరుపహతి స్థలంబు—" పద్యం మననం చేసుకోండి. కవిత్వమనేది కేవలం యతిగణ ప్రాసలలోనే లేదు.

* * *

కె. నిఖిలానందం—సికింద్రాబాదు.

దిలీప్ కుమార్, అశోక్ కుమార్—వీరిద్దరిలో ఎవరు బాగా నటిస్తారు?

—దిలీప్‌కుమార్ విషాద పాత్రలు, అశోక్‌కుమార్ చలాకీ పాత్రలు బాగా స్తారు.

* * *

పోడూరి దివ్యప్రభాకరరావు—విశాఖపట్నం.

పత్రికల్లో ప్రచురించబడే కొన్ని దృశ్యాలు విడుదలైన చిత్రాలలో కనిపించవు. కారణం ఏమిటి?

—చిత్రం పూర్తిగా నిర్మించబడకముందు, పూర్తిగా ఎడిట్ కాకముందు స్టిల్స్ తీసి పబ్లిసిటీకోసం ఇస్తారు కాబట్టి, ఆఖరున ఎడిటింగ్‌లో కొన్ని దృశ్యాలకు ప్రమాదం సంభవించవచ్చు.

* * *

ఎన్. కుమారి—రాజమండ్రి.

నేటి సినిమానటీనటులకు, మంత్రులకు గల తేడా ఏమిటి?

—ఒకరు నటిస్తున్నామనుకుంటారు, మరొకరు నిజంగా నటిస్తారు.

* * *

టి. ప్రభాకర్—మదనపల్లి.

నేటిబీదల అర్థికాభివృద్ధికి మార్గమేమి?

—దేవుడికి మొక్కుకోమని రాజాజీ ఉపదేశం.

ఆంధ్రపత్రిక వారపత్రికలో రాజకీయ వ్యాసము లెక్కువగా లేకుండుటకు కారణము?

—రాజకీయ వ్యాసాలంటే పాఠకులకు అట్టే మోజు లేకపోవటమే.

* * *

చుండూరు రామశాస్త్రులు—తెనాలి.

కమ్యూనిజమును చూపే రష్యను చిత్రము *"The Fall of Berlin"* ఇండియాలో ప్రదర్శించుటకు సెన్సారువారు అంగీకరించారేమండి?

—ఆ చిత్రంలో "కమ్యూనిజం" ఏమీ లేదని సెన్సారువారు కూడా గుర్తించి ఉండవచ్చు.

* * *

ఏ. వి. జనార్దనరావు—హైదరాబాద్.

ఎన్నికలకు పూర్వం 'మాకే ఓట్లు పడేయండి, మేం అధికారంలోకి వచ్చిన మరుక్షణంలోనే కంట్రోళ్ళను 'రద్దు చేస్తాం'అంటూ శ్రీరంగనీతులు విసరిన కమ్యూనిస్ట్ మహాశయులు, ప్రస్తుతం రాజాజీ చర్యను నిరసించడంలో అర్థం ఏమిటి? ఎంతసేపటికీ ప్రభుత్వవిధానాన్ని (అది ప్రజోపయోగమైన పనే కానీండి) విమర్శించడమే వీరు పరమభాగ్యంగా భావిస్తున్నట్టున్నారు. రాజకీయ దృష్ట్యా, ప్రజాక్షేమదృష్ట్యా కూడా వీరి ఈపంథా శుద్ధ అవివేకంగా వుందంటాను. మరి మీ అభిప్రాయం ఏమిటి?

—వాగ్దానాలు, వాగ్దానభంగాలు, విమర్శలు, ప్రతివిమర్శలు, ప్రచారం, దుష్ప్రచారం—ఇవే రాజకీయపక్షాల రాజకీయాలు.


* * *

డి. వి. కృష్ణరాజు—విజయనగరం.

చిన్నవాళ్లు పంపినకథలుకూడా ప్రచురిస్తారా?

—బావుంటే ఏస్తాం.

★



కీ॥ శే॥ సి. ఆర్. సుబ్బరామన్.

పాలిటెక్నిక్ - మత్స్యశాఖ

(6-వ పేజీ తరువాయి)

ర్థులు. ఖాళీలు లేవు అంది ప్రభుత్వము. విద్యార్థులు నిరాశాపూరితు లయ్యారు.

అసలే, రాష్ట్రప్రభుత్వశాఖలలో జీతాలు చాలా తక్కువ. అసిస్టెంటు యిన స్పెక్టరు ఆఫ్ ఫిషరీస్ - అనే హోదాగల తాలూకా ఆఫీసరుగారికి జీతం రు 60/-; కరువుబత్తెం 24 రూ॥ వెరశి 84/- వస్తుంది దానితో అతని మీద ఆధారపడివున్న సంసారాన్ని లాగాలి. యిప్పుడున్న తాలూకా ఆఫీసర్లలో చాలామంది సాంకేతికంగా ఏ విజ్ఞానము లేనివారే! అయితే వారికి, సాంకేతిక నిపుణులకు ఒకే జీతం అంటుంది ప్రభుత్వము. యీ తేడాలేని జీతాలకు విద్యార్థులు నిరసన జూపారు. తిరిగి ప్రభుత్వంతో సంప్రదింపులు సాగించారు. "మాకు రు 90 జీతంతో ఉద్యోగం మొదలుపెట్టాలి" అన్నారు విద్యార్థులు; "ఆర్థిక యిబ్బందులవల్ల అసంభవము. రు60/- యిస్తామని" అంది ప్రభుత్వం. పైగా చాలామంది "మీరెంత, మీకు డిగ్రీ వుందా? S. S. L. C ప్యాసయిన వాళ్ళేగా" అని చిన్నచూపు చూడ్డం జరిగింది. జరుగుతోంది. కాని వాళ్ళు చదివిన సాంకేతిక విద్యమాట ఏమిటి? ప్రభుత్వంతో రాయబారాలు నిష్ఫలమయాయి. విద్యార్థులు నీరసించారు. తమ అదృష్టాలనీ చదివిన కోర్సునీ తిట్టుకొన్నారు. వీరిలో చాలామంది తాలుకాఫీసుగుమాస్తాలుగా, రైల్వే గుమాస్తాలుగా, పోస్టల్ గుమాస్తాలుగా ఎవరికి దొరికిన ఉద్యోగాలను వారు ఆశ్రయించారు. సాంకేతిక నిపుణుల భవిష్యత్తు ఇలా వుంది. ప్రభుత్వం నెలకొల్పిన ఆ కోర్సు చదివిన విద్యార్థులకు ఉద్యోగాలు చూపడం ప్రభుత్వవిధి అయివుంది...కొంతమంది విద్యార్థులు గత రెండుసంవత్సరాల నుంచి ట్రెయినింగ్ అవుతూనే వున్నారు! ఎన్నాళ్లు అలా ట్రయినింగ్ అవాలి?


కొంతకాలానికి కొంతమందికి ఉద్యోగాలు యిచ్చింది ప్రభుత్వం. అవి ఎటువంటివి? బెస్తవాళ్ళకి నూలు పంచే గుమాస్తా ఉద్యోగాలవి. సాంకేతిక నిపుణుల స్థితి చివరకు ఇలా దిగజారింది! ప్రభుత్వము ఉద్యోగాలు చూపించలేకపోతే తక్షణం పాలిటెక్నిక్స్‌లో ఆకోర్సు తీసేయాలి. లేకపోతే యింకా యిలాగే అమాయక విద్యార్థుల, భావిభారత పౌరుల జీవితాలతో చెలగాటం ఆడడం తటస్థిస్తుంది. రెండవది: యిప్పుడున్న సాంకేతికనిపుణులు అందరికి వెంటనే ఉద్యోగాలు యివ్వాలి. వారి జీతాలనుకూడా పెంచాలి. మత్స్యపరిశ్రమ యితర దేశాలతో పోల్చుకుంటే మనదేశంలో ఎంతో అభివృద్ధిపొందవలసివుంది. చేపలు యీనాటి ఆహారకొరతను కొంతవరకు తీరుస్తాయని ఉపన్యాసాలు దంచే వారందరూ ఒక్కసారి ఈ అమాయకవిద్యార్థుల భవిష్యత్తును పరిశీలించమని నామనవి. మూడు: నావిగేషన్ చదువుకొన్నందుకు ప్రభుత్వము వీరిలో కొందరిని విశాఖ పట్టణపు నౌకా కేంద్రములో పనిచేయడానికి సిఫార్సు చేయాలి. ప్రభుత్వము వెంటనే తగు చర్యతీసుకోవాలని కోరుతూ, తీసుకొంటారని ఆశిస్తున్నాను. ★

మతిమరుపు

(5-వ పేజీ తరువాయి)

బావగారి బనీను పైపే వున్నాయి చూపులన్నీ వెంకట్రావుకి. సారధి భార్య యిట్టె గ్రహించుకుంది. "ఆబనీనువాడిది, మీరేసుకళ్ళారేమండీ" అని నవ్వసాగింది. "నీకేమైనా పిచ్చా? ఇది నేను నిన్న సాయంత్రం కొనుక్కొని రాత్రివంకెకి తగిలించాను. నన్ను దొంగని కడుతున్నారా నా యింట్లో?" అని అన్నంతినే కంచం విసిరి పారేశాడు. వాకిట్లో కొచ్చేటప్పటికి, ప్రక్క వీధి హోటలులో పనిచేసే క్లీనరు ప్రత్యక్షమై, "యిదిగోనండీ బాబుగారూ, మీ బనీను. దీంట్లో మీ పేరుతో రాసిన బిల్లుంది. నిన్నసాయంత్రం మా హోటలులో కాఫీ తాగి మర్చిపోయారక్కడ" అని చేతి కిచ్చాడు. వెనకాతే భార్య యిరపైసొట్టలుపడ్డ వెండికంచం తీసుకొచ్చి చూపించి "మట్టిఅయిందని కడిగాను, కాస్త మీ కొత్తబనీనుతో తుడిచి పెడతారా?" వేళాకోళంగా అంది.

సారథి మతిమరుపు నివారణార్థం యిప్పటికి ఎటులేదన్నా యీ యేడాదినుంచీ, వొక వందరూపాయలు ఆయుర్వేద వైద్యులికీ, మరో వందరూపాయలు యింగ్లీషు మందులికీ ఖర్చుపెట్టాడు. కాని యేమాత్రం అభివృద్ధి కనిపించినట్టు తోచదు. మీరేదైనా "సర్వరోగ సంహారి" కని పెట్టి కాస్తంత సాయం చేద్దురూ, మీకు పుణ్యముంటుంది. ★



SISTA'S-J-279

సినిమా వార్తలు

(48-వ పేజీ తరువాయి)

నటించిందట. భారత్ భూషణ్, శ్యామ, పాల్ మహేంద్ర, కుముద్ మొదలైనవారు తదితర నటీనటులు. డైరెక్టరు బిమల్ రాయ్. ఈ చిత్రం బహుశా జూలై ఆఖరులో మద్రాసులో విడుదల కావచ్చును.

సంగీతదర్శకుడు సి. ఆర్. సుబ్బరామన్ గత నెల 27 వ తేదీన మద్రాసులో గుండె జబ్బుతో కాలధర్మం చెందారు. ఈయన వయసు 28 సంవత్సరాల వయస్సే అయినా ఇప్పటికి సుమారు 35 చిత్రాలకు సంగీతం రచించారు. చనిపోయేనాటికి తెలుగు చిత్రాలకు సంగీత దర్శకుడుగా పనిచేస్తున్నారు.

వినోదా పిక్చర్సు సంస్థలో ఈయన ఒక భాగస్వామి కూడా. ఈ స్థితిలో ఉండి, ఇంత చిన్నవయస్సులో ఈయన మరణించటం సినిమారంగంలోని వారికీ, అభిమానులకు విచారకారణం. ★

నాలుగు తప్పులవరకూ మూర్చుతేని బహుమతులు !!

రూ 1,500

రూ 600 రైటు—రూ 300 ఒక తప్పు—రూ 200 రెండు తప్పుల—రూ 150 మూడు తప్పుల—రూ 100 నాలుగు తప్పుల ఆన్సర్లు పంపినవారికి—రూ 50 మెరిట్ బహుమతులు.


★ లాటరీపద్ధతి బహుమతులు:—రూ 100, మూడు రూపాయలకు పైగా విలువ గల కూపన్లుపంపిన పోటీదారులలో 25 మందికి మాత్రము లాటరీ పద్ధతిగా పంచబడును.

శ్రీ సత్యదేవ్ పజిలు నెం. 26 ★ ముగింపు తేది 18-7-52

కీసొల్యూషన్ హైద్రాబాదు మర్కెంటైల్ బ్యాంకితో డిపోజిట్ చేసితిమి

ప్రవేశరుసుము:—రూపాయికి 2 కూపన్లు, రూ 2-0 0 లకు 5 కూపన్లు చొ॥న పంపాలి.

నిఘంటువు:— శబ్దార్థ చంద్రిక



ఆధారములు

★ అడ్డము: 1. పది అవతారము లెత్తిన ఘనుడు 4. హనుమంతుడు 7. ప్రజల అభిమానములేని "-యకుడు" పైకివచ్చుట అసాధ్యమే. 9. భర్త 10. ధనముగలవాడు 12. విన్నవించుట 13 పెదవి 14. శీఘ్రముగ 15. ఆజ్ఞ 18. నిత్తనము 20. వేగము 22 జలము 23. చిన్నదోనె.


★ నిలువు: 2. భూమి 3. విఘ్నేశ్వరుడు 4. ఒక నెల 5. ఒక దివ్యక్షేత్రము 6. ఆటంకము 8. ఈ తరువు 11. గుడిసె 13. మొగము 15. ధ్వని 16 చంద్రుడు 17. "-విటి" వానికి పెండ్లికావటం కొంతకష్టమే 19. భీముని ఆయుధము 21. "-డు" బ్రతుకు సుఖప్రదం కాదు.

★ **నిబంధనలు**:—ఎన్ని కూపనులైననూ కాగితములపై వ్రాసి పంపవచ్చు లేదా 6 కానీబిళ్ళలు పంపిన 10అచ్చుకూపనులు పంపుదుము. కూపనుల రుసుము మనిఆర్డరుద్వారా పంపవలెను. M. O. రశీదు కూపనులతో కలిపి పంపాలి. కీ సొల్యూషన్ 24-7-52 ఆంధ్ర వారపత్రికలో తప్పక ప్రకటించబడును. పూర్తి ఫలితములు 25-7-52 నాడు రంజనిలో ప్రకటించి పంపుదుము. పూర్తి ఫలితములకు 0-1-6 బిళ్ళలు తప్పక పంపాలి.

SRI SATYA DEV & Co., Kachiguda, HYDERABAD—(Dn.)

★ మా తెలుగు క్రాస్‌వర్డు పజిలు నెం. 26, 27 లకు విడువకుండ పోటీచేసిన వారికి మా పజిలు నెం. 28 పూర్తిచేయుటకు తగిన పదముల జాబితా (అర్థములతో సహా గలది) పంపుదుము. ఈ జాబితాలో పజిలు నెం. 28 కీ సొల్యూషన్‌లో వుండే పదము లన్నియు తప్పక వుండగలవు.

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St Madras


పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
దేవశర్మ ముక్కు మూసి సంధ్య వార్చుతున్నాడు
దూరంగా కుమ్ముకునే రెండు గొర్రె పొట్టేళ్లను చూస్తూనే దేవశర్మ చాలసేపు గడిపాడు.
వాటి నడుమ బోలెడంత నెత్తురు కాలువలు కట్టె.
నెత్తురు కొరకు నక్క యొకటి ముందుకు చొచ్చుకునివచ్చె
ఢీకొను పొట్టేళ్ల నడుమ ఇరుక్కొన్న నక్క మడిసె.
ఇది చూచిన దేవశర్మ శివశివయని వగచినాడు.
అపుడు గట్టుపైకి వచ్చి
"శిష్యా! ఓ శిష్యా!" యని కంఠమెత్తి అరిచాడు. శిష్యుడచట ఉంటేగా!!
పేరాసకు పోయి నక్క మడసినట్లు, లేనిపోని ఆశలతో మోసపోతి నని ఏడ్చెను దేవశర్మ."
"కనుకనే ఓ కరటకుడా! విధి నెవ్వరు దాటలేరు....
అయితే ఒక్కొక్కసారి వెనుకటికొక కాకి లాగ అపాయమును ఉపాయముతో దాటగలడు బుద్ధిశాలి."
"ఎవరా కాకి? ఏమా కధ?"

సిద్ధముగా నున్నది. త్వరపడుడు!

హకల్ బెరీ ఫిన్

మార్క్ ట్వేన్ రచన

అనువాదం: నండూరి రామమోహ[illegible]వు

★

ఈ నవలను గూర్చి

ఈ రచనలో ప్రయోజనంకోసం వెదికేవారు ప్రాసిక్యూ[illegible] చేయబడతారు; నీతికోసం వెదికేవారు దేశంనుండి బహిష్కరింప బడ[illegible] ఇతివృత్తంకోసం వెదికేవారు తుపాకితో కాల్చివేయబడతారు. —గ్రంథకర్త.

"హకల్ బెరీఫిన్" "టామ్.సాయర్" కు రెండో భాగ[illegible]ప్పవచ్చు. అందుచేత "టామ్‌సాయర్ ను" ముందు చదివివుంటే ఈ నవల బాగా అర్థమవుతుం[illegible]నా ఆ నవలలో కథావస్తువుకీ ఈ నవలలో కథావస్తువుకీ సంబంధం లేదు. "టామ్‌సాయర్"లో [illegible] చిన్న పిల్లల స్వభావాలను, అల్లరిపనులను, ఆలోచనలను మాత్రమే మార్క్ ట్వేన్ వర్ణించాడు[illegible] బెరీఫిన్"లో ఇతివృత్తం ఇంకా విశాలమైనది. అమెరికా దేశాన్నంతటినీ మన కళ్లకు కట్టి[illegible]పిస్తాడు రచయిత. కొంత దూరందాకా "టామ్‌సాయర్" కథతో ముడిపెట్టుకుని నడిచినా[illegible]సు ఈ నవల అంతర్యుద్ధానికి పూర్వంగల అమెరికన్ సమాజాన్ని, ఆ సమాజసమస్యలను చి[illegible]కి పూనుకుంటుంది.

వెల: రెండు రూపాయిలు

పోస్టు ఖర్చులు ప్రత్యేకము.

ఆంధ్రగ్రంథమా[illegible],

మదరాసు-1.

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



4 అణాలు

9-7-'52


పంచతంత్రం
మిత్రభేదం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
వెనుకటి కొక అడవిలోన హనుమంతుని ఆలయాన
దేవశర్మ నామధేయు డర్చకు డొకడుండువాడు
భక్తు లిచ్చు కానుకలను పొరుగూరిలో అమ్మివైచి
డబ్బంతా బొంతలోన కుట్టి దాచి వుంచువాడు
ఆ డబ్బును దొంగిలింప తలపు కలిగి తుంటరొకడు
"నన్ను నీదు శిష్యునిగా స్వీకరించి కావు"మనియె.
తనపేరాషాఢభూతి అనిచెప్పిన ఆ తుంటరి గురువుగారి బొంతపైన కన్నువేసి వుంచాడు
కొన్నాళ్లిటు గడువగ ఆషాఢభూతి శిష్యరికం నమ్మకముగ సాగినది.
ఒకరోజున గురుశిష్యులు పొరుగూరికి పోవుచుండ
"స్వామి, స్వామి! నిన్నరాత్రి మనం మకాం చేసిన ఆ ఇంటివారి పూచిముల్లు నా పంచెకు తగిలి వచ్చె."
"తిరిగివెళ్లి వారిసొమ్ము వారికిచ్చి వచ్చెదను"
"ఎంత నమ్మకస్థుడో నా శిష్యుడు ఆషాఢభూతి పరుల పూచి ముల్లయినా ముట్టడు గద, వెర్రికుంక!"
ప్రొద్దుననగ పోయిన ఆషాఢభూతి అట్టిట్టా తిరిగి తిరిగి సాయంత్రం గురువుగార్ని కలుసుకొనెను
"అదుగో ఆ కొలనులోన-సంధ్యవార్చుకొని వత్తును అంతవరకు గట్టుమీదె-బొంత చూస్తు ఉండవోయి."
6

సంవత్సర చందా
రు. 12-0-0
విడిపత్రిక 4 అ.

ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక


Founder : K. NAGESWARA RAO

సంపుటము 44
సంచిక 44
9-7-52

నందన ఆషాఢ బహుళ విదియ బుధవారము

విషయానుక్రమణిక

'మిత్రభేదం' బొమ్మలకథ ఈ సంచిక నుండీ లోవైపు కవరు పేజీలపై ప్రచురింప బడుతుంది.



దాక్షారామంలో భీమేశ్వర దేవాలయం

—ఛాయాచిత్రకారుడు : శ్రీ [illegible]

వ్యాఖ్యలు, విమర్శలు :

మద్రాసు శాసనసభ



మద్రాసు లెజిస్లేచర్ బడ్జెట్ సమావేశం జూన్ 27 వ తేదీని గవర్నరు, శ్రీ శ్రీ ప్రకాశ్ గారి ప్రసంగంతో ప్రారంభమయింది. అదే రోజు సాయంకాలం రాష్ట్రప్రభుత్వ బడ్జెట్ ఎసెంబ్లీ, కౌన్సిల్ సభలలో ఆర్థికమంత్రి శ్రీ సుబ్రహ్మణ్యం, ముఖ్యమంత్రి శ్రీ రాజగోపాలాచారిగార్ల చేత నివేదించబడింది. ఈ సంవత్సరం ఆయవ్యయాలలో సంభవించగల రు 3 కోట్ల 59 లక్షల అధిక వ్యయం నిమిత్తం అయిదు కొత్తపన్నులను విధించడానికి ప్రభుత్వం నిర్ణయించింది. వీనివల్ల రు 2 కోట్ల 70 లక్షలు భర్తీకాగా ఇంకా రు 89 లక్షలు లోటు ఉంటుంది. కొత్త పన్నుల వివరాలు :

1. భూమిశిస్తు రు 50 పైబడి చెల్లించే వారికి శిస్తురేట్లు హెచ్చించాలని ప్రభుత్వం ప్రతిపాదిస్తున్నది.
2. ప్రభుత్వ కార్యక్రమాలవల్ల కొత్తగా సాగులోకి తేబడిన భూములపైన అభివృద్ధి పన్ను విధించబడుతుంది.
3. బస్ ప్రయాణీకులు చెల్లించే ప్రయాణపు చార్జీలపై సర్ చార్జీ
4. మోటార్ పెట్రోల్ పైన అమ్మకపు పన్ను హెచ్చింపు.
5. పర్మిట్లుగలవారి విదేశీ మద్యాలపై ప్రత్యేకపు పన్ను.

వీనిలో మొదటి రెండుపన్నులవల్లా మధ్యతరగతి ప్రజలకి భారం అధికం, ప్రభుత్వానికి రాబడి రు 75 లక్షలూ, రు 60 లక్షలూ మాత్రమే. మూడోపన్నువల్ల బస్సుల్లో ప్రయాణాలు చేసేవారందరికీ భారం అధికం. ప్రభుత్వానికి ఈయేడాది కోటిరూపాయలు, తరవాత సాలీనా రు 2 కోట్లు వసుంది. మిగిలిన రెండుపన్నులూ ధనవంతులకే కాని ఇతరులకి పట్టవు. అయితే ఈ పన్నులవల్ల వచ్చే రాబడి మొత్తం ఈ యేడాది రు 35 లక్షలే.

కొత్తపన్నుల భారం దాదాపు అంతా మధ్యతరగతి ప్రజలు, సామాన్యతరగతుల ప్రజలపైనే పడుతున్నందువల్ల బడ్జెట్ చర్చల సందర్భంలో ఇతర పార్టీలవారు, ముఖ్యంగా కృషికార్ లోక్ పార్టీ, సోషలిస్టులు, స్వతంత్రసభ్యులు, కామన్వీల్, ముస్లింలీగ్ పార్టీలవారు ప్రభుత్వాన్ని బలపరచడానికి జంకవచ్చును. అందువల్లనే ముఖ్యమంత్రి శ్రీ రాజగోపాలాచారిగారు పన్నులూ, ప్రజల బాధలమాటెలా వున్నా, తమ ప్రభుత్వాన్ని ప్రస్తుత పరిస్థితుల్లో బలపరుస్తారో లేదో స్పష్టంగా తెలుసుకోడంకోసం విశ్వాసతీర్మానాన్ని శాసనసభలో ప్రతిపాదించారు.

“నేనింతవరకూ చేసినదానికి మెచ్చుకోలుకోసం నాపట్ల విశ్వాసం ప్రకటించమనడంలేదు ; ముందుముందు చేయదల్చుకొన్న కొన్నిటికోసం నన్ను బలపర్చమనే నేను కోరుతున్నది” అన్నారు రాజగోపాలాచారిగారు. ఈ సందర్భంలోనే దేశాన్ని కమ్యూనిస్టుల ముప్పునుంచి కాపాడ్డం తమ ముఖ్యకర్తవ్యమని కూడా రాజగోపాలాచారిగారు స్పష్టపరిచారు

బడ్జెట్ పై చర్చను వాయిదా వేసి విశ్వాసప్రకటన తీర్మానంపైన నాలుగు రోజులు చర్చ జరిపారు. ఈ నాలుగు రోజుల చర్చలోనూ గమనించవలసిన విషయమేమిటంటే కాంగ్రెసు పక్షానికి చెందిన సభ్యులెవరూ ప్రసంగించలేదు. అన్యపక్షాలవారికే అవకాశమివ్వబడింది. ప్రస్తుత ప్రభుత్వ విధానాలనుగురించి, ముఖ్యంగా ఆహారవస్తువులపై కంట్రోల్ రద్దునుగురించి ప్రతికూలపక్షాలకు ఏకాభిప్రాయంలేదు. అయినా నాలుగురోజుల చర్చ సందర్భంలో అభిప్రాయభేదాలు అట్టే వ్యక్తపడలేదనే చెప్పాలి. వోటింగ్ ని బట్టి చూస్తే స్పీకర్ ఎన్నికనాటికంటె ఇప్పటికి అయిదుగురు అధికంగా కాంగ్రెస్ పార్టీని బలపరుస్తున్నారని తెలుతున్నది. స్పీకర్ ఎన్నిక సమయంలో శివషన్ముగం పిళ్ళెగారికి ప్రత్యర్థికంటె 44 వోట్లు అధికంగా వచ్చాయి. ఇప్పుడు విశ్వాసప్రకటన తీర్మానంలో ప్రభుత్వానికి ప్రతికూలపక్షాలకంటె 49 వోట్లు అధికంగా

వచ్చాయి. స్పీకర్ ఎన్నిక సమయంలో ఏడుగురు తటస్థులు, ఇప్పుడు తటస్థంగా ఉన్నది ఒక్క సభ్యుడే. అయితే అనారోగ్య కారణంవల్లనూ ఇతర కారణాలవల్లనూ హాజరుకాలేక పోయిన ఇద్దరు కాంగ్రెస్ సభ్యులు ఇద్దరు కృషిక్‌లోక్ పార్టీసభ్యులు ఒక కమ్యూనిస్టు సభ్యుడు మొత్తం అయిదుమందిని మినహాయిస్తే 18 మంది సభకు హాజరు కానివారని తేలింది. ఈ పద్ధెనిమిది మందిలోనూ చాలమంది ఏ పక్షానా ఓటు చెయ్యడం ఇష్టంలేక సభకు రాలేదని ఎంచవచ్చును. స్పీకర్ ఎన్నిక సమయంలో సోషలిస్టులు కాంగ్రెస్‌కు అనుకూలంగా వోటుచేశారు. ఇప్పుడు ప్రతికూలంగా వోటుచేశారు. అంటే మరొక పన్నెండుమంది ప్రభుత్వ పక్షానికి మారినందువల్లనే 49 ఎక్కువ వోట్లు లభించాయన్నమాట.

మొత్తానికి కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభలో క్రమంగా బలపడుతున్నదని భావించడానికి వీలుకలుగుతోంది. ఇకపైన శ్రీ రాజగోపాలాచారిగారు భూమిశిస్తు విధాన సంస్కరణలు, ప్రభుత్వ ఋణాలు మొదలైన కార్యక్రమాలను జంకులేకుండా ప్రవేశపెట్టగల వీలు కలుగుతోంది. ఇంతేకాదు విశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ ఆర్థిక శాఖామంత్రి శ్రీ సి. సుబ్రహ్మణ్యంగారు త్వరలోనే తిరిగి ఈ రాష్ట్రంలో ఎన్నికలు జరపడం రాజగోపాలాచారిగారి అభిమతమైనట్లు తెలియచేశారు. ముఖ్యమంత్రి ఆ భావాన్ని ప్రస్తుతానికి మానుకున్నప్పటికీ, పరిపాలనలో అవసరమైన ముఖ్యకార్యాలను అమలుజరిపి త్వరలోనే ఎన్నికలను ఏర్పాటు చేస్తే ఆశ్చర్యపడ నవసరంలేదు. ప్రస్తుత శాసనసభ కార్యక్రమాల సందర్భంలో కాని, రాగల ఎన్నికలలో కాని కాంగ్రెస్ పార్టీ కమ్యూనిస్టులనే ప్రత్యర్థులుగా భావించి బలాబలాలను పరీక్షించగలదు. ఇతర పార్టీలను అంతగా పరిగణించ నవసరంలేదని రాజాజీ అభిప్రాయం.

భూమి శిస్తు హెచ్చింపు

భూమిశిస్తు చెల్లించేవారిపై సర్‌ఛార్జి విధించడానికి మద్రాసు ప్రభుత్వం బిల్లు పెట్టబోతున్నది. ఈ బిల్లుకు బొత్తిగా ప్రతికూలురైన కృషిక్‌లోక్ పార్టీ సభ్యులు విశ్వాసప్రకటన తీర్మానానికి అనుకూలంగా వోటు చేశారంటే, ఈ బిల్లులో కొన్ని మార్పులను వారు ఆశిస్తూ ఉండవచ్చును. బిల్లులో పెద్దమార్పులు జరగాలని భావించే కాంగ్రెస్ సభ్యులు కూడా లేకపోలేదు.

ప్రస్తుతపు బిల్లుప్రకారం సాలీనా రు 50 మించి రెవిన్యూశిస్తు చెల్లిస్తున్న పట్టాదార్లు సర్‌ఛార్జీలను చెల్లించవలసిఉంటారు. రు 50 మొదలు రు 100 వరకూ శిస్తు చెల్లిస్తున్నవారు ఇకనుంచి రూపాయికి పావలా చొప్పున అధికం చెల్లించాలి. రు 100 పైబడి రు 500 వరకూ చెల్లిస్తున్నవారు రూపాయికి అర్థ రూపాయి, రు 500 పైబడి రు 1000 వరకూ చెల్లిస్తున్నవారు రూపాయికి ముప్పావలా, ఆపైన రూపాయికి రూపాయి అదనం చెల్లించాలి. సర్‌ఛార్జి చెల్లించబడుతుందని అవిభక్తపు కుటుంబాలవారు ఆస్తులు పంచుకున్నప్పటికీ మూడేళ్ళవరకూ పంపకాలను పరిగణించకుండానే ప్రభుత్వం సర్‌ఛార్జి వసూలు చేస్తుంది.

భారత ప్రభుత్వం విధించే రాబడి పన్నుతో పోల్చినా లేక రైతులూ మధ్యరకం పట్టాదార్ల పరిస్థితిని గమనించినా ఈ పన్ను దారుణంగా ఉందని చెప్పక తప్పదు. ఇప్పటికే రైతులకు చిన్నపట్టాదార్లకు పన్నులుభారంగా ఉన్నాయి. ఆహారోత్పత్తి వృద్ధికార్యక్రమాన్ని పరిశీలించిన కృష్ణమాచారికమిటీ రైతులను ప్రోత్సహించి వారి పంటకు కనీసపుధర, వారి జీవనానికి అవసరమైన ఆదాయం లభించేలా చూడవలసిన అగత్యాన్ని వివరించింది. ఇటీవల ప్రభుత్వం ప్రచురించిన లెక్కలను బట్టి చూస్తే ఆహారపు పంటలు పండించే భూమి తగ్గిపోతున్నదని తెలుస్తుంది. గిట్టుబాటు కాని వ్యవసాయం నుంచి రైతులు పారిపోతున్న ఈసమయంలో ఇటువంటి పన్ను విధించడం ఆహారోత్పత్తి వృద్ధి కార్యక్రమాలకు నష్టం. కుమారస్వామి రాజాగారి ప్రభుత్వం రు 150 పై బడి చెల్లించేవారి శిస్తు పెంచడానికి బిల్లు తలపెట్టినప్పుడే అనేకమంది అసమ్మతి తెలిపారు. ఇప్పుడు రాజగోపాలాచారిగారు తలపెట్టిన ఈ హెచ్చింపుకి సమ్మతించగల ధైర్యం ఏ రాజకీయపక్షానికి గాని ఎలాఉంటుంది? ఈబిల్లుపట్ల పార్టీలూ, ప్రజల అభిప్రాయం ప్రభుత్వానికి స్పష్టంగా తెలిసింది. కాబట్టి రాజాజీ ప్రభుత్వం ఈ బిల్లును సవరించి ఆహారం పండించేవారిపై అట్టే భారం మోపకుండా జాగ్రత్తపడగలదనుకోవచ్చు.

(4-7-52)

★

విజయదశమికి ప్రత్యేక సంచిక

ఆంధ్రపత్రిక సచిత్రవారపత్రిక రాబోయే విజయదశమికి (సెప్టెంబరు 28) పిల్లల ప్రత్యేక సంచికగా వెలువడుతుంది. బాలబాలికలకు ఉల్లాసం, విజ్ఞానం కలిగించే చక్కని కథలతో, పాటలతో, వ్యాసాలతో, బొమ్మలతో ఆకర్షణీయంగా తయారవుతుంది. రచనలు పంపగోరువారు ఆగస్టు నెలాఖరులోగా మా కార్యాలయానికి అందేలాగ పంపాలి.

పిల్లలరచనా శక్తిని, చిత్రలేఖనశక్తిని ప్రోత్సహించే ఉద్దేశ్యంతో పోటీ కూడా ప్రవేశపెట్టదలచాము. పదిహేనేళ్లలోపు బాలబాలికలుమాత్రమే ఈ పోటీలో పాల్గొనాలి. పోటీకివచ్చినవాటిలో ఒక మంచికథకు, ఒక మంచిపాటకు, ఒక మంచి బొమ్మకు బహుమతు లివ్వబడతాయి. రచనలు స్వతంత్రంగా ఉండాలి. రచయితలు తమవయస్సు, చిరునామా వివరంగా రాయాలి. రచనపోటీకొరకైతే 'పోటీకొరకు' అని, మామూలు ప్రచురణకయితే 'మామూలు ప్రచురణకు' అని స్పష్టంగా రాయాలి.

—సంపాదకుడు

మతిమరుపు

సారధికి తగని మతిమరుపు. తన వస్తువెందీ తెలియదు, యితరుల వస్తువెందీ తెలియదు. ఏది వాడుకున్నా, ఎవరిది వాడుకున్నా తిరిగి ఆ వస్తువు అసలు యజమాని దగ్గరకు చేరదు. మరి అది దాని దారి అదే చూసుకుంటుంది. ఒక వేళ చేరినా చాలా రభస జరిగింతరువాత చేర్తుంది. అనేకసార్లు అనేక విషయాల్లో, భార్యను పట్టుకు ఛడామడా తిట్టాడు. తిరిగి తనదే పొరపాటనీ, జ్ఞాపకం లేక పోవడంవల్లనే యిలా జరుగుతోందనీ సర్ది చెప్పేవాడు.

ఒకసారి ఆఫీసులో తను టైపుకొట్టిన కాగితాలు మేనేజరు బల్లమీద పెట్టాడు. మర్నాడు ఆఫీసుకు వచ్చేసరికి మేనేజరు మండిపడుతూ "నీ కేమైనా జ్ఞానంవుందా, యేమిటయ్యా నువ్వు టైపుకొట్టేది? ఏం కాగితాలు నువ్వు టైపుచేసింది? నే నిచ్చిన నోటీసేది?" అని కేకలేసి మొహాన గిరవాటేశాడు. చూసుకుంటే, అవి ఆఫీసు కాగితాలు కావు. ఇంగ్లీషు వారపత్రికకి

శ్రీ [illegible]రాజు కృష్ణమోహన్

తను పంపదలచుకున్న పదిపేజీల వ్యాసం అసలు టైపుకొట్టవలసిన కాగితాలు పత్రికా సంపాదకునివద్దకు నడిచాయి. "నా వుద్యోగం పోతుంది, నన్ను జైలులో వేస్తారు" అని మొత్తుకుంటూ రెండు వుత్తరాలు రాస్తే సంపాదకునివద్దనుంచి జవాబు లేదు. ఎందుకొస్తుంది? అసలా వుత్తరాలు జేరితేగా! పెట్లోనే వుండిపోయాయి. మూడో వుత్తరం పట్టిపట్టిరాసి, స్వయంగా కవరులో పెట్టి అతికించి, స్వహస్తాలతో పోస్టు బాక్సులో పడేశాడు. నాలుగురోజులలో కాగితాలు ఎలాగయితేనేం సక్రమంగా తిరిగొచ్చాయి. దానితోపాటు వొక చిన్న వుత్తరంకూడా వుంది సంపాదకుని దగ్గరనుంచి. అందులో యిలావుంది. "మీరు రాసిన విషయాలన్నీ చదివాను. ఇలాంటి రిజిస్టరు నోటీసుల్ని ప్రచురించటం చాలా అసహ్యంగా వుంటుంది. ఇందులోని విషయాలన్నీ వొక కథానికగా వ్రాసి పంపితే ప్రచురిస్తాం." సారథికి తల తిరిగిపోయింది. 'ఏమిటా యీ గొడవ' అని కాగితాలు చదివిచూస్తే, అవి ఆఫీసు కాగితాలు కావు. మేనేజరు తన పినతండ్రి కొడుక్కి ఆస్థి విషయమై యిచ్చిన పది పేజీల రిజిస్టరునోటీసు. అంటే 'పర్సనల్ వర్కు' అన్నమాట.

మరోసారి చంటిపిల్లకి వొక చిన్న గౌను కొందామని వొక బట్టలకొట్లో దూరాడు. గౌను ఎగాదిగా చూశాడు. చాలా బాగుంది. రూపాయిన్నర. కొనటానికే గట్టిగా నిశ్చయించాడు. అయినప్పటికీ

తనకు గుడ్డనాణ్యం బాగా తెలుసనీ, కొట్టు వాళ్లు తనని మోసం చేయలేరనీ, యీ విషయమే కొట్లోవాళ్ళు అనుకోవాలనీ, తదనుగుణ్యంగా గౌను యీమూల కాసేపు, ఆ మూల కాసేపు నలిపి, గుండీలు విప్పదీసి మళ్లీ పెట్టి, యిలా చేయడం మొదలెట్టాడు. ఇంతట్లోకే వెనకాలేవొచ్చి భుజంతట్టి పలకరించాడు మిత్రుడు జయరాం. "ఏరోయి రాముడూ! ఎక్కడా వుండటం, యేం చేస్తున్నావ్?" అని మళ్ళీ తిరిగి సారధి పలకరించి, సంభాషణలో దిగాడు. సంభాషణ చాలా జోరుగా సాగుతోంది. ఇదంతా చూసి యిహ మధ్యలో ఆ బేరగాళ్ళని *Disturb* చేస్తే గౌరవం పోతుందని భయపడి, ఆ కొట్టుయజమాని యింకెవరో బేరగాళ్ళొస్తే వాళ్ళపని చూడటం మొదలెట్టాడు. జయరాం, సారధీ, అనేక విషయాల్ని గురించి మాట్లాడుకుంటున్నారు. ఇలా మాట్లాడుతూనే సారధి చేతిలోవున్న గౌనుని నలిపి, నలిపి, చివరకు జేబురుమాలు సైజుకి మడతపెట్టాడు. కాస్సేపటికి జయరాం వెళ్ళిపోయాడు. షాపు యజమానివొచ్చి, "యేం బాబూ, గౌను బిల్లురాయమన్నారా?" అని బల్లవంక చూశాడు గౌనుకోసం. ఏదీ గౌను? మాయమైపోయింది. ఇద్దరూ గాభరా పడ్డారు. షాపు యజమాని క్రిందంతా వెతికాడు. ఎక్కడా కనపడలేదు. అనుమానమేసింది సారధిమీద. "ఏమవుతుందయ్యా నీ చేతికిచ్చినగౌను? బట్టలుచూస్తే డాబుసరిగా వున్నాయి. ఆ వచ్చినవాడు, నువ్వు దొంగతనం జాయంటుగా చేశారా? వాడికిచ్చి పంపివుంటావు. పోలీసుకు రిపోర్టు చేస్తా" అని రౌద్రాకారం ప్రదర్శించి, యేదో మామూలుగా సారధి లాల్చీ జేబుమీద దృష్టి సారించాడు. అందులోనించి గౌను కనపడుతోంది. "జేబులో పెట్టావా దొరా, యిదా సంగతి!" అని జేబు పట్టుకోబోయేటప్పటికి సారధి "పళ్ళురాల్తాయ్! ఇది నా జేబురుమాలు, చూసుకో కావలిస్తే" అని పైకి లాగాడు. ఇంకేముంటుంది! జేబురుమాలతోసహా గౌను కూడా బయటకొచ్చింది సారధి రుమాలనుకుని, సంభాషణ ధోరణిలో పొరపాటుని గౌను జేబులో పెట్టుకున్నానని క్షమార్పణ కోరుకున్నాడు.

మిమ్మల్నిక నేను వేధించదలచుకోలేదు. ఆఖరి సంఘటన చెప్తున్నా.

ఆరోజు ఆఫీసుకు శెలవుదినం. ప్రొద్దున ఆరింటికేలేచి ముఖం కడుక్కుని బయలుదేరాడు కాఫీ అయినా త్రాగకుండా. "మా తమ్ముడొచ్చాడు" అని భార్య యింకా యేదో చెప్పబోతూవుంటే, వినిపించుకోకుండా, "అబ్బ! యిప్పుడు కాదు. ఎన్ని వుద్యోగాలిప్పించినా పోగొట్టుకుంటాడు. కూర్చోమను. వస్తా" అని చెప్పి చక్కాబోయాడు; వంకెనున్న బట్టలు తొడుక్కుని. ఇంటికొచ్చేటప్పటికి "మా మంచిగౌరవం చేశాం యింటికొచ్చినందుకు వాడికి." అని గొణగటం మొదలెట్టింది భార్య. "ఏం అవమానం జరిగింది నీ తమ్ముడికి?" "వాడు రాత్రి పన్నెండింటికివచ్చి బనీనుతోసహా బట్టలు వంకెకి తగిలించాడు. డాబామీద వెళ్లి పడుకున్నాడు. తెల్లవారేటప్పటికి బనీను మాయమైంది. మిగతావన్నీ వున్నాయి. క్రొత్తదిగూడాను." అని కళ్ళనీళ్ళు పెట్టుకుంది. "ఆ పనిచేసే దాని పనే యిది"-అని దాన్ని కాసేపు తిట్టాడు, అది ఎదురుగా లేకపోయినప్పటికీ. కోటు, చొక్కా విప్పి భోజనానికి కూర్చున్నాడు. ఇంతట్లో బావమరిది కూడా వచ్చి కూర్చున్నాడు అన్నం తింటున్నారన్న మాటే గాని,

(47-వ పేజీ చూడండి)



పాలిటెక్నిక్ - మత్స్యశాఖ

["ఒక పరిశీలకుడు"]

1946 సంవత్సరం జూలైనుంచి కాకినాడలో ఆంధ్రా పాలిటెక్నిక్ యిన్‌స్టిట్యూషన్ వివిధ శాఖలలో సాంకేతిక నిపుణులను తయారుచేయడం ప్రారంభించింది. అప్పటికి ఆ స్కూలులో ఉన్నవి నాలుగు శాఖలు. 1. సివిల్ యింజనీరింగ్ (*L. C. E*); (2) ఎలక్ట్రికల్ యింజనీరింగ్ (*L. E. E*); (3) మెకానికల్ యింజనీరింగ్ (*L. M. E.*); (4) ఫిషరీస్ టెక్నాలజీ అండ్ నావిగేషన్ (*L. F T. & N*). మనకు కావల్సినది చివరి కోర్సు విషయం.

కాకినాడలో యీ స్కూలు స్థాపించక ముందు యీ ఫిషరీస్ కోర్సు మద్రాసులో మాత్రమే వుండేది. యీ కోర్సు పెట్టే నాటికి మత్స్యపరిశ్రమను గురించి గాని, దాని అభివృద్ధి, భవిష్యత్తును గురించిగాని ఎవరికీ తెలియదు. ప్రతివాళ్లు యీ కోర్సు అభివృద్ధిశాఖకు సంబంధించినది కాబట్టి మంచి భవిష్యత్తు వుంటుందని ఆశించారు. కాని కాలము యిది తప్పని ఋజువుచేసింది. యీ కోర్సులో చేరిన విద్యార్థులలో చాలా మంది "నావిగేషన్" అనే పదమువలన మోసపోయారు. ఏవో నౌకలను గురించి, వాటిని నడపడము, వాటికి సంబంధించిన సాంకేతిక విద్య చెపుతారనీ, ఇందులో కృతార్థులయితే ఏ విశాఖపట్టణ నౌకా కేంద్రములోనో యింజనీర్ అవవచ్చు అనీ ఆశించారు. ఆ ఉద్దేశ్యముతోనే కలకత్తా నుంచికూడా విద్యార్థులు రావడం తటస్థించింది. కాని 'తింటేగాని రుచి, దిగితే కాని లోతు తెలియదు' అనే సూక్తి నిజమయింది. అక్కడ చెప్పే నావిగేషన్ 'చేపల నౌకలకు' సంబంధించినది మాత్రమే అని తెలుసుకోనేందుకు విద్యార్థులకు ఆట్టే కాలం పట్టలేదు.

సాంకేతికవిద్య చాలా కష్టమయినది. స్వతంత్ర భారతావని యీనాడు పారిశ్రామికదేశం కావాలంటే సాంకేతిక నిపుణుల అవసరం ఎంతయినా వుంది. వారు ఎక్కువగా మనదేశంలోనే తయారయి, జాతీయ పరిశ్రమలను వృద్ధిపరచాలని ప్రతిఒక్కరి ఆశయం. అయితే యిప్పుడు జరిగేది ఏమిటి? యీ పై చెప్పిన కోర్సు మూడు సంవత్సరాలు. ఆతర్వాత ఒక సంవత్సరము ట్రెయినింగ్ అయితేకాని 'డిప్లొమా' యివ్వరు టెక్నాలజీబోర్డువారు. అయితే యీ మూడు సంవత్సరాలు చదవడానికి చేపలగురించి తగినంత కోర్సు ఉందా అని చాలామందికి అనుమానం. నేను గమనించినంతవరకు తగినంత కోర్సు ఉంది. మిగిలిన కోర్సులకు యిది ఏమాత్రం తీసిపోదు. చాలా కష్టమయిన చదువే.

1950 సంవత్సరములో మొట్టమొదటగా ఆ స్కూలునుంచి 14 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయినారు. మూడు సంవత్సరాలు వడపోయగా మిగిలిన విద్యార్థులు వాళ్ళు. బయటికి రాగానే వారి భవిష్యత్తు అంధకారంగా కన్పించింది. భవిష్యత్తు బాటలో 'చైనా గోడ' కట్టబడి వుంది. విద్యార్థులు ఖంగారు పడ్డారు. సరే! ముందు ట్రెయినింగ్ అవాలి కదా, యీలోగా ప్రభుత్వము ఖాళీలు చూపలేక పోతుందా అని సమాధానం చెప్పుకొన్నారు. మత్స్యశాఖ డిపార్టుమెంటులో వారు 'ట్రయినీల' హోదాతో చేరారు. యీ ట్రయినింగ్ యీ విద్యార్థులకు ఒక్కరికే ఎందుకువచ్చింది? సివిల్ విద్యార్థులు కొందరు ఫలితాలు తెలియక ముందే ఎందుకు సర్వీసులోనికి తీసుకోబడ్డారు? వారి జీతాలు ఎందుకు ఎక్కువ చేయబడ్డాయి? అనే ప్రశ్నలకు ప్రభుత్వము సమాధానం చెప్పవలసి వుంటుంది.

ట్రెయినింగ్‌లో వేతనాలూ భత్యాలూ ఏమీ యివ్వమని చెప్పింది ప్రభుత్వము. కాని విద్యార్థులలో కొంతమంది అమాయకులు రాయబారాలు సాగించారు. ముందు వాళ్లు 'యిండస్ట్రీస్ సెక్రటరీ' గారిని కల్సుకొన్నారు. కాని ఆయన మొండి చెయ్యి చూపెట్టారు. తర్వాత మత్స్యశాఖ మంత్రిగారిని కల్సుకొన్నారు. ఆయన ఆప్యాయంగా "నాయనలారా! ప్రభుత్వం ఎంతమందిని తీసుకొంటుంది? ఎవరికాళ్ళమీద వారు నిలబడి జీవించడం నేర్చుకోవాలి. మనది స్వతంత్రదేశం. కాబట్టి మీరే ఉమ్మడిగానో, లేక విడివిడిగానో ఒక చిన్న ఓడను కొనుక్కొని చేపలను సాంకేతిక పద్ధతులలో పట్టి—పట్టించి వ్యాపారము సాగించడం చాలా మంచిది." అన్నారుట. రాయబారులలో ఒకరు "అలా అయితే ఆ కోర్సు ఎందుకు? తీసివేయకూడదా?" అని ప్రశ్నించాడుట. పాపం! మంత్రిగారికి కోపం వచ్చే వుంటుంది. ఏది ఎలా గయితేం! విద్యార్థుల రాయబారాల పోరు పడలేక ట్రెయినింగ్ కాలంలో నెలకు 60/-రూ॥ (*Stipend*) యివ్వడానికి సమ్మతించింది ప్రభుత్వము. సంవత్సరపు ట్రెయినింగ్ పూర్తి అయింది. ఉద్యోగాలు అన్నారు విద్యా

(47–వ పేజీ చూడండి)

మాటతో మనిషి

శ్రీ ద్వివేదుల సోమనాథశాస్త్రి

"అత్తలేని కోడలు సుఖవంతురాలూ..."

"కోడలూ లేని అత్త గుణవంతురాలూ..." అని చిన్న కూనిరాగం తీస్తూంది చింతపండు తీస్తూ ఒకావిడ—

"అత్త అంటే జ్ఞాపకం వచ్చింది-చూశావూ! ఆ లక్ష్మమ్మ కోడలు-ఆవిణ్ణి అత్తా అని పిలవదుట!" అని అంది సముద్రాలు విస్తర్లు కుడుతూ.

"అలాగా! ఎంచేతో! సిగ్గో ఏమిటో!" అంది-ఒత్తులు నలుపుతూ ఒకావిడ.

"సిగ్గేవిటి? అదో యిది-సాధారణంగా ఎలాగూ పిలవదుట! ఒట్టి ముభావంగా మాటాడుతుంది! యింక ఏనాడయినా పిలవ్వలిసి వస్తే 'ఏవండీ' అని మొగాళ్లని పిలిచినట్టు అంటుందిగాని నోరారా ఆ ముక్క అనదు!"

"బావుంది! యిదెక్కడా వినలేదు! పెద్దింటి పిల్లకదూ! పరువు, నామోషీకం కామోసు!"

"ఆఁ! లక్షాధికారి కూతురా; కోటీశ్వరుడి కూతురా; అలాగంటావు? అయినా గొప్పవాళ్ల పిల్లయితే మాత్రం అలా పిలవకూడదని వుందా ఏమిటి!"

"చక్కా అత్తాఅనో, అత్తగారూ అనో పిలిస్తే ఎంత బావుంటుంది? ఆవిడ మనస్సు ఎంత సంతోషిస్తుంది!"

"అయినా ఎందుకలా పిలుస్తుంది! అంత గర్వం కూడదు!"

"అబ్బే గర్వం గిర్వం లేదుగాని-ఇలా అడుగుతే-నాకు 'తెలీదండీ' అని అంటుంది!"

"బావుంది ఏమని పిలవాలో తెలీదూ! ఎంత ముద్దరాలమ్మా! ఇలాంటి ముద్దూ ముచ్చట్లకోసమేకదా వాళ్ళని తెచ్చుకొనేది!"

"అవును మరి! ఒక్కగా నొక్క కొడుకు మరి ఆవిడని అత్తా అని నోరారా పిలవడానికి, విని, సంతోషించడానికి-యింకెవరున్నారు? యిలా అయితే ఆవిడ మనస్సు క్షోభపడదూ!"

"పాపం! ఆవిడ ఎంత నొచ్చుకుంటూందో!"

"ఏమో లోపునే మనుకుంటూందో గాని పైకిమాత్రం, అంత అలా ఏమీ అనుకున్నట్టు కనిపించదు! అయినా యీ మధ్య మాటల్లో ఒకసారి అంది-తనని అలా పిలవదు అని-అయినా ఆ ఒక్క కోడల్ని ఏరికోరి తెచ్చుకున్నందుకు ఆవిడకా సరదా తీరింది కాదు!"

"అందరిలాంటి మనిషి ఆవిడ కాదు కాబట్టి సర్దుకుపోతూంది-మన దగ్గిర అలా పిలవడానికి సిగ్గుపడుతూందేమోగాని యింట్లో పిలవక అవుతుందా?"

"అయ్యో లేదమ్మా! ఎక్కడైనా యిదే వరస! లేకపోతే అనుకోడం దేనికి? అయినా మన కెందుగ్గానీ..."

"యీ కాలపు పిల్లలికి యిదో పెడసరం! ఏమైనా అంటే యిదవుతారు-గాని-అత్తా అని పిలిస్తే దాని కొంపేం మునిగిపోయింది! వజ్రాలూ, వైఢూర్యాలూ, రాలిపోతాయా?"

"కొంచం గట్టిగా చెప్పిచూస్తే పిలవక్కేం చేస్తుంది. దాని మొగుడేనా కేక లెయ్యలేదూ!"

"అదేం చిన్నపిల్లా చితక పిల్లా! దానంతట అది నేర్చుకొని గ్రహించుకోవాలి గాని యీపాటిదానికోసం జట్టీ లాడుకుంటారా?"

"మొదట్లో అయితే కొత్తకాబట్టి సిగ్గుపడుతూంది అనుకున్నాం గాని, మూడేళ్ళయి కాపరానికి వచ్చినా ఒక్కలాగే వుందాయె!"

"మరోపాటి వాళ్ళయితే యీ పాటికి వీధిని పడి పోయివుందురు...చిన్నపిల్ల... రానురాను అనుభవంమీద దానికే తెలుస్తుంది!"

"ఇంకేం తెలుస్తుంది...యింకా మొండికెత్తి యిదే అలవాటయి పోతుంది...... పిల్లల్ని కనేయా డొచ్చి యిదే యిలా పిలవకపోతే యింకా ఆ మనవలు వరసలు పెట్టి" పిలుస్తారని ఎలా అనుకుంటాం? పేర్లు పెట్టి, పిలుస్తే సిగ్గుసిగ్గు!"

"అదీకాక వాళ్ళాయన పట్టించుకోక పూరుకున్నారుగాని వాడు నాలుక్కేక లేస్తే పిలవకేం జేస్తుంది!"

"ఆ మాట పుట్టేది! యింకా ఆవిడ ఏమైనా అంటుందేమోగాని వాడు పల్లెత్తు మాటయినా అనడు...సరికదా! వీధిలో మనలాటివాళ్ళ మాటలు విని ఎక్కళ్ళ నేర్చుకుంటుందో అని - ఎక్కడికీ వెళ్లనివ్వడు తెలుసా?"

"అంత వాడయేడూ?"

"ఇంకా ఏం జూసేవూ! యింట్లో ప్రతీద్వారానికీ ఘోషావాళ్ళలా తెరలు కట్టేశాడు...ఆరంభకి దిష్టి తగులుతుందని.. యింత ఘోషాలో వుంచి కట్టుజేస్తున్నాడు...!"

"స్వతః పుట్టుకు రావాలిగాని వీడెంత చెస్తేమాత్రం ఏం లాభం? అయినానిన్నటి వరకూ మన కళ్ళముందు ఆడుకొనేవాడు! ఎంత వాడయిపోయాడు?"

"మరి పెదవాడవడం లేదూ?"

"అందుకే కామోసు మనం లక్ష్మమ్మతో కూర్చుని వాళ్ళ గుమ్మంలో మాటాడుకున్నా అది పైకి రావడం లేదు—"

"అవును...వాడే.. వద్దని చెప్పేడట!"

"ఇహ రెండురోజులు పోయాక ఎవళ్ళీ గుమ్మం ఎక్కనివ్వడు కామోసు!"

"అంతవరకూ ఎందుకూ? మొన్న ఆ సూరమ్మా! రావమ్మా! జట్టీ లాడుకొని వాళ్ళ సోది వెళ్ళబోసుకుందికి వాళ్ళింటికెళితే—'ఇహమీదట యిలాంటి మాటలు మా యింట్లో చెప్పడానికి వీల్లేద'ని, 'యిలాంటి మాటలాడిన వాళ్ళని, చెప్పడానికి వచ్చినవాళ్ళని, గుమ్మం ఎక్కనివ్వ'నని యింకా ఏవేవో అని వాళ్ళని పొమ్మన్నాడుట తెలుసా!"

"ఆఁ! ఏమిటీ! ఇదంతా పెళ్లాంపాడయి పోతుందనే కాబోసు! లోకంలో వీడొక్కడే పెళ్ళాన్ని పెళ్ళాడాడా ఏమిటి! అయినా వాడంత వద్దంటూంటే ఎవరికంత ఖర్మం వాళ్లింటి కెళ్ళేవరకూ? యీ బుద్ధి ఎలా పుట్టిందో గాని యింతకుపూర్వం ఎరగడు—"

"ఇంతలా వాడంటున్నా ఆ లక్ష్మమ్మ వూరుకుందా ఏమీ అనక?"

"ఆవిడేం చేస్తుంది! ఏమైనా అంటే వాడు—'నా ఇష్టం' అంటాడు."

"బావుంది... ఇరవై ఏళ్ళబట్టీ... అందరికీ అలవాటయిపోయింది వాళ్ళింట్లో కూర్చుని కష్టం వచ్చినా సుఖం వచ్చినా మాటాడుకోడం! వాళ్ళ తాతయ్యా వాళ్ళూ ఎంతో మంది పెద్దవాళ్ళు వుండేవారు గాని వాళ్ళ జోలికే వచ్చేవారు కారు - ఎంతమంది ఆడవాళ్ళు గుమ్మంలో వున్నా దించిన తల ఎత్తకుండా ఆ పక్కనించే వెళుతూ వస్తూండే వారుగాని ఏనాడయినా యిలా అడ్డు చెప్పేరా? యీనాటికి వీడేనా మహా తెలివయిన వాడు?"

"అబ్బే! వాడూ అలా అనలేదే! వాడి ఖర్మం వాడి పెళ్ళాన్ని వెళ్ళవద్దన్నాడు గాని మనల్నెవర్నీ రావొద్దనీ, చెయ్యొద్దనీ- అనలేదు...మాటొస్తే మంచీ, చెడ్డా, రెండూ అనుకోవాలి!"

"ఆఁ! వాడంటేమాత్రం మనం వెళ్లడం మానుతామా ఏమిటి?"

"ఇంక వూరుకుందురూ లక్ష్మమ్మ వస్తున్నట్టుంది, వింటే బావుండదు" - అని ఒకావిడ అనేసరికి, అందరూ అటువైపు చూసి అప్పటికా ప్రసంగం మానేసేరు.

* * *

"ఏమండీ లక్ష్మమ్మగారూ పైని కూర్చ



న్నారు? ఇంట్లో ఎవరూ లేరా ఏమిటి? యివాళ అగ్గిపుల్లలు యింట్లో నిండుకున్నాయి కొంత నిప్పు పట్టుకు వెడతాను" —అంది కొరటాలు ఇనపగరిట చేత్తో పట్టుకు వచ్చి వీధిలో కూర్చున్న లక్ష్మమ్మని చూసి—

"వెళ్ళమ్మా! వాడి పెళ్లాం వుంది ఇస్తుంది!"

"అదేవిటండోయ్! అలా అంటున్నారు వాడి పెళ్లాం ఏమిటి కోడలనక?"

"ఇంకెందుకమ్మా! నన్నది అత్తా అని పిలిస్తే లోకువయిపోతుంది, అంచేత నేను మాత్రం కోడలా అని పిలుస్తే తక్కువయిపోనూ? యిహనుండి నేనూ అలా పిలవదల్చుకోలేదు - నాకేల -" అంది నవ్వుతూ లక్ష్మమ్మ.

"బావుందమ్మా! బావుంది! అత్తా కోడళ్ల మధ్య యిలాటి పేచీ ఎక్కడా చూడలేదు-యింట్లో పెత్తనంకోసమో-డబ్బుకోసమో-అధికారంకోసమో, మర్యాదకోసమో, జట్టీలాడుకుంటారు గాని—"

"అలాంటి లేవీ మీ ధర్మాన్న లేవులెండి అయినా యిదో పేచీ అని ఎవరన్నారు, అలా పిలవనంత మాత్రంలో పోయిందేట-చిన్నపిల్ల-వుట్టినే హాస్యానికి అలా అన్నాను అంతే—"

"మీ రేవనుకుంటున్నారో గాని వీధిలో వాళ్లు మాత్రం వూరుకోలేదు మీ కోడలు, గొప్పింటి బిడ్డట-అంచేత, అత్తా అని పిలవడానికి, పరువు తక్కువట! యింకా వూరంత /గర్వం, పెడసరంట! యింకా యిలా ఏవిటో నానా మాటలూ ఈ చెవిని వినడం, ఆ చెవిని వదిలేయడం గాని యిలాటివి నాకు జ్ఞాపకం వుండవు" వాళ్ళే అనాలిగాని నే చెప్పలేను "

"ఇందులో ఏవిటి తప్పుందని యీ పాటి దానికి అంతలా అనుకుంటున్నారు? మాకేవీ లేనిది మధ్యవాళ్ళ కెందుకండీ!"

"అదేమిటో నాకేం తెలుసు! ఘోషా వాళ్ళలా మీరు యింట్లో తెరలు కట్టుకున్నారట! మీ వాడు యింటి కెవర్నీ రావొద్దన్నాడట! వాడి పెళ్లాన్ని వీధిలో ఎవరితోనూ మాటాడవద్దన్నాడట? ఎక్కడికీ వెళ్లొద్దన్నాడట యిలా మీ వాడు అన్నాడనీ అందరూ అనుకుంటూంటే మీతో చెప్పేను నాకేం తెలుసమ్మా!"

"ఇది విని లక్ష్మమ్మ ఆశ్చర్యపోయింది "

"ఇంత వుంటే అంతచేస్తారు మా వాడేం-అంత తెలివితక్కువవాడు కాదు మనం పెద్దవాళ్లం ఏమనుకుంటే వాడికేం వాడీ సుర్కు కేరాడు-పైకి నాజూకుగా వుండాలని ఆ-కట్టేన్లూ అవీ కట్టేడు గాని, అందరూ... యిలా ఘోషాలనీ, అదనీ ఇదనీ అర్థాలు తీసి అనుకుంటారనా? అలాటి మాట లెప్పుడూ వాడనలేదు అయితే మనందరితోనూ బాతాఖానీచేస్తూ వుట్టినే కూర్చునేకన్న చదువుకోడమో, అల్లుకోడమో, మరేవో పనికొచ్చే పని చేసుకుంటే మంచిదన్నాడు గాని, ఎవరితో మాటాడవద్దని గాని ఎక్కడికీ వెళ్ళవొద్దని గాని అనలేదు! ఇదుగో పులి అంటే అదుగో తోక అంటారు! యింతకీ ఎవరా అన్నది—" అని చెబుతూ అడిగింది ఆవిడ—

"ఎందుకులే అమ్మా! తెలుస్తే నన్ను నవశార్థాలూ పెట్టి తిడతారు!"

"ఫరవాలేదు చెప్పండీ!"

"ఎవరితో అనకండి గాని, యింకెవరూ మొన్న ఆ సూరమ్మా, కామమ్మా మీ యింటకొస్తే మీవాడు పొమ్మన్నాడు కదూ! వాళ్ళే పుట్టించుగొచ్చారు యిదంతా! నాలాటి వాళ్ళకేం బాధ లేదు గాని, వాళ్లిద్దరూ వూరుకుంటున్నారా! లేనిపోనివన్నీ కల్పించి చెబుతున్నారు "

"బాగానే వుంది కానీండి "

"ఆమధ్య—వనాలూ వాళ్లూ జట్టీ ఆడుకోగా—ఆ వనాలు కూతురు—ఏడుస్తూ వచ్చి మీ గుమ్మంలో కూర్చుందనీ, అదీ మీవాడు చూసి—'మా యింటిగుమ్మంలో కూర్చుని ఏడిచావంటే ఒప్పుగోనని, వెంటనే పోతావా? పోవా?' అని తగిలేశాడనీ అంటున్నారు! చూశావా!"

"అవునమ్మా! ఎక్కడెక్కడో ఆడుకున్న జట్టీలన్నీ యిక్కడ మా యింటిలోకి వచ్చి వర్లిస్తూ గోల పెడితే వాడికి కిట్టదు - వాళ్లూ వాళ్లూ - తన్నుకొని మా ఇంటో—అర్ధరాత్రప్పుడు ఏడవడానికొస్తే ఏమైనా బావుందా? అందికే పొమ్మన్నాడు! యిందులో తప్పేవిటి? వాళ్ళకి ఒదిగి వుండడానికి - మాకేం ఖర్మం—"

"అలాగ చెప్పు! అయినా ఎంత ఓఘాయిత్యం లేదమ్మా! ఒకరింటికి అర్ధరాత్రప్పుడు వచ్చి మొర్రోమని ఏడుస్తూకూర్చుందికి—? మంచిపనే చేశాడు! అంతి నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలు!"

"అవునా! మరి అందరిదగ్గరా అలా చెబుతూంటే బావుందా!"

"తెలివితక్కువవాళ్ళతో మనకేం పని,


ప్రతిదేశంలోనూ సమస్యలున్నాయి!
ప్రతిగ్రామంలోనూ సమస్యలున్నాయి!
పల్లెసమస్యలపరిష్కార మార్గాన్ని
చూపే చిత్రమే
వస్తోంది!
పీపుల్స్ ఆర్ట్ ప్రొడక్షన్స్ వారి
పల్లెటూరు
దర్శకత్వం.... T.ప్రకాశరావు...
నిర్మాత...P.శివరామయ్య..
రామారావు..రంగారావు..సావిత్రి..
& T.G.కమలాదేవి నటించినది...
రచన.
సుంకర.వాసిరెడ్డి.
సంగీతం.
ఘంటసాల.
కెమెరా
అజయకార్.
స్టూడియో
నర్సాస్.
నిర్వహణ.... M.S.చౌదరి...R.D.ప్రసాద్..
KRISHNA.

పూరుకోమ్మా! వాళ్ళనుకున్నంతలో నీకేం పోయింది!"

"అయినా ఒకళ్ళగొడవ అందరికీ ఎందుకో!"

"నే వెళ్ళొస్తానమ్మా! యింకా వండుకోవాలి!" అని చెప్పి కెరటాలు నిప్పు దీసుకు వెళ్ళిపోయింది.

ఈవిడ వెళ్ళిపోగానే లక్ష్మమ్మకి ఏమీ తోచక యింట్లోకి వెళుతూ, గదిలో ఆమె కొడుకు—కోడల్ని కేకలేస్తూన్నట్టు వినిపించి, కొంచెం ఆగింది—

"నా మాటకేం గాని చూశావా! ఆఖరికి నువ్వు అలా పిలవలేదని ఎంతలా, ఎన్ని విధాల అనుకుంటున్నారో . " దీనికి కోడలి జవాబు వినపడలేదు. అతనిగొంతుకే వినబడుతూంది.

" . ... . "

"నీకసలు ఆ జ్ఞానం వుంటే బావుణ్ను-"

" "

"ఎన్నోసార్లు చెప్పేను అత్తా అని పిలిచినంతమాత్రంలో ఏం మునిగిందని "

" . "

"యింతకీ అసలు ఎందుకలా పిలవ్వో చెప్పవు కద"

" .. . .. "

"నిన్నిలా యీపాటిదానికి అందరూ కల్పించి అంటూంటేనే బావుందా!"

" "

"అయితే నీకు నిజంగా గర్వం అయి వుంటుంది—లేకపోతే పెడసరం - యింకేమిటి?"

"బావుందండి-" మెల్లిగా అంది ఒక్కముక్క ఆమె.

"మరేంవి టనుకోడం—"

యిలా అతను కేక లేస్తూంటే లక్ష్మమ్మ వచ్చి "బావుందిరా! తప్పుకాదూ! దాన్ని అలా కేకలేస్తా వేమిటి?" అని అడిగింది

"అవునమ్మా! అందరిచేతా అనిపించుకోడం దేనికి—ఆ మాత్రంలో దీనికేం పోయిందని "

"వెధవలు ఎవళ్లో అనుకున్నారని దీన్ని కేకలెయ్యడం ఏమిటి—దానికి పిలవాలని లేకపోతే నిర్బంధం ఏమిటి?'

"పోనీ ఎంచేత పిలవదో చెప్పదుకద?"

"అవునమ్మా! కమలా! చెప్పు! ఎంచేత అలా పిలవ్వు? నీ కిష్టంలేదా! యింతలా అందరూ అనుకోడం మనకి మంచిదికాదు- పోనీ, నువ్వు పిలవకపోయినందువల్ల నాకేం కష్టం లేకపోయినా, వీధిలోవాళ్ళ నోరు కట్టడానికైనా ఆ ముక్క అందూ పోనీ వాళ్ళెవళ్ళైనా వున్నప్పుడూ, ఎవళ్ళైనా యింటి కొచ్చినప్పుడూ అంటూ వుండు చాలు!" అని కోడలితో అంది. అంతవరకూ మాటాడకుండా వింటూన్న కమల కళ్ళంట నీళ్లు తిరిగేయి.

"ఏం చేసేదండీ! మీరు నమ్మరు! అదేంవిటో ఎన్నిసార్లో నేను మిమ్మల్ని అలా పిలుద్దామని అనుకుంటాను! అనుకోడం ఏమిటి! తప్పకుండా పిలుస్తాను అని ఒట్టు కూడా వేసుగుంటాను కాని . ఎంచేతో మీ దగ్గరికివచ్చి మిమ్మల్ని చూసేసరికి అనలేకపోతున్నాను. అందామని పెదిమలదాకా తెచ్చుకుంటాను . అంతే మరి అనపడదు నేనేం చేసేది! అంతకన్నా నాకేం తెలియడం లేదు! ఎంచేత అలా అవుతూందో అని నాకే ఆశ్చర్యం వేస్తుంది ఆ తర్వాత అనలేకపోయానని నాకు ఏడుపు కూడా వస్తుంది. ఏంచెయ్యనూ!" అంది కమల

"పోనీలేరా! వూరుకుందూ మరేమీ అనక!" అని, కోడల్ని తనతో తీసుకుపోయింది

* * *

"కంది గుండలేదూ!"

"మడిలో వుండి పోయిందండీ!"

"అమ్మని పిలువు వేస్తుంది!"

"ఏమండీ "

"వస్తున్నా "

"అదుగో మళ్ళీ యింత చెప్పినా.. ఆ పిలుపు మానవు అత్తా అని పిలవలేవూ!"

అది వినగానే కమల చిన్నబోయి వూరుకుంది.

"నీ కెన్నిసార్లు చెప్పినా జ్ఞానంలేదు. మొండికెత్తిపోతే ఏంచెయ్యనూ!"

"అబ్బ వూరుకుందురూ వింటారు!"

"బావుంది వూరుకోక వురెట్టుకుంటానా? లక్షసార్లు చెప్పేను అది చిన్నబుచ్చుకుంటుందని - నీ సొమ్మేం పోయింది అలా పిలిస్తే—"

" . ... "

"ఆఖరికి వీధులో కూడా అందరినోళ్లోనూ పడిపోయావు నలుగురూ మొహం యీడుస్తున్నా సిగ్గులేదూ! ఈపాటిదానికి మహోయిది చేస్తున్నావు అందరూ పెడసరం అని అనుకోరూ?"

"నాకేమిటో అలా పిలవాలని ఎన్నిసార్లు అనుకున్నా ఆవేళకి రాకుండా వుందండీ!"

"ఏడిచావు ఎలా వస్తుంది ? చెప్పినట్టు చెయ్యాలని వుంటేకదూ అయినా యిదేదో ఆఖరికి బావుంటేట్టులేదు పైకి అమ్మ పీపీ అనకపోయినా లోపల ఎంత అనుకుంటూందో నీకేం తెలుసు ? పోనీ అత్తా అని పిలవడానికి సిగ్గయితే అమ్మమ్మా అని పిలవరాదూ, మీ అమ్మ వరసని-"అని ఇలా అంటూండగా-లక్ష్మమ్మ వచ్చి-

"అదేవిట్రా నాయనా! పెళ్ళిఅయిన తర్వాత గూడా 'అమ్మమ్మ' ఏమిటి, అక్కయ్యకూతురయితే మాత్రం నీకు పెళ్ళాం అయింతర్వాత నాకూ కోడలయింది దానికి నేను అత్తగార్ని కొబట్టి యిప్పుడూ అమ్మమ్మా అని అంటే ఏం బావుంటుంది ?" అంగి.

"మాశావా! నా మాట వినవూ యిహనైనా, అలా పిలవడం మాని సవ్యంగా పిలువు యిందులో తప్పేంవిటి" అని అతను చెబుతూంటే పోషువాడు వుత్తరం తెచ్చి యిచ్చేడు ఆ వుత్తరం లక్ష్మమ్మ అన్నగారి కూతురు దగ్గరనుండి వచ్చింది అది అతను చదివి -'అర్జంటుగా ఏదో పనివుండి లక్ష్మమ్మని రమ్మన్నారని' వుందని చెప్పేడు-లక్ష్మమ్మ కూడా ప్రయాణమయి ఆ మర్నాడే బయలుదేరింది

* * *

"ఓహో! అత్తేనా! ఏమిటి పిలవగానే వచ్చేశావు? ఎప్పుడూ లేదు! కొంప మునిగిందే!"

అత్తా! అని గుమ్మంలో కాలుపెట్టగానే పిలిచేసరికి లక్ష్మమ్మకి ఏదో చెప్పలేని సంతోషం కలిగింది—తను ఎన్నడూ ఎరగని ఆనందం అనుభవించింది

"ఏదోలే-చూడాలని వుండి వచ్చేశా-మరి ఏదో అర్జంటుగా రావాలని రాస్తే!" అని అంది

"ఏంలేదత్తా అలాగని రాస్తేగాని నువ్వొస్తావా? నేనే అలా రాయించేను! అయినా నువ్వింత వేగిరం వస్తావని అనుకోలేదు యివాళేదోవుంది ప్రళయం-అందికే మబ్బుకూడా వేసింది!"

"నీ వేళాకోళం పోయిందికాదు-"

"రా అత్తా స్నానం చేద్దూగాని, భోంచేసి తీరుబడిగా మాటాడుకుందాం"

"అలాగేలే" అని అందిగాని తనలో యిలా మాటిమాటికీ మేనకోడలు అత్తా అని చనువుగా పిలుస్తూంటే భరించలేని ఆనందం కలిగినా, తన స్వంతకోడలు పిలవలేదని విచారించకపోలేదు! అలా ఆమె పిలుస్తూంటే అక్కడే ఎన్నాళ్ళయినా వుండిపోవాలని కూడా అనిపించింది ఆమె అలా పిలిచేటప్పుడల్లా ఏదో తనకు కొరత అయిన వస్తువు లభించినట్టు, ఏదో లోటు తీరినట్టు అనిపించింది. ఆ మహానందంలో ఎన్నాళ్ళో వుండిపోయింది ఒకనాడు వుండబట్టక మాటల్లో 'తన కోడలు అత్తా అని ఎంత చెప్పినా పిలవద'ని చెప్పేసింది ఆ వెంటనే మేనకోడలు చిన్న వుపాయం చెప్పింది లక్ష్మమ్మ అలాగే చెయ్యడానికి నిశ్చయించుకుంది-ఓనాడు తన కొడుకు దగ్గరనుండి బయలుదేరి రమ్మంటూ వుత్తరం వచ్చింది.

* * *

ఆవేళనుండీ తనభర్త తనతో మాటాడకపోవడం, దగ్గరకు పిలవకపోవడం, చూసి కమలకి ఏం తోచలేదు అయినా ఎలాగో వూరుకుంది కాని రోజు రోజూ అతను సమంగా వేళకి యింటికి రాకపోవడం, భోజనం సమంగా చెయ్యకపోడం, మాటిమాటికీ కసురుతో చిరాకుగా వుండడం ఎక్కువయిపోడంబట్టీ, యింటిపట్టున వుండకపోడంబట్టీ-కమలకి ఏమనాలో తోచిందికాదు ఆఖరికి ఏడుపు గూడా వచ్చింది-తనేం తప్పుచెయ్యిందే కూడా ఎందుకిలా అవుతూందో అని భరించలేక ఆఖరికి ఆనాడు తమలపాకులు అందిస్తూ ఆయన తీసుకోనకపోయినా యిలా అంది-

"ఏమండీ"

" .."

"ఏమండీ-మాటాడరు?"

"ఏవిటి మాటాడ్డం నీ మొహం-పో-అవతలికి నాతో మాటాడవద్దు!"

"అదేవిటండీ అంత కోపం! నాల్గు రోజులయి అన్నమేనా సరిగ్గా తినకండా యింట్లోవుండకండా వున్నారు! ఏం చేశాను?"

"అందుకూ నీ శెలవే వుండాలా ఏమిటీ? నాయిష్టం—"

"అది కాదండీ కోపం అయితే పోనీండి గాని వేళకి యింత సరిగ్గా తిని పోకూడదా అని! అయినా నేనేం చేశానని యింత కోపం?"


"ఏమీ లేదు నా ఖర్మ!"

"బావుందండి! ఏదైనా తప్పంటే చెప్పండి ఏంచేశానూ?"

"ఏం చెయ్యాలి? ఆఖరికి మా అమ్మని రాకండా చేశావు! మంచి ఎత్తే వేశావు!"

ఇది వినగానే కమలకి గుండె ఆగినంత పని అయింది,—తనేవిటి! అత్తగార్ని రాకుండా, చెయ్యడం ఏమిటీ అని!





"అదేవిటండీ, యిలాటిమాటలు! నే నెందుకలా చేస్తాను? నాకేం కష్టమా?"

"ఏమో మరి అలాగే వుంది"

"యింక నేనేం చెప్పేది! ఏవిట యిందో చెప్పరూ"

"ఇదుగో చూడు మాఅమ్మని రమ్మని రాస్తే రావడానికి బదులు ఏవని రాసిందో!"

"ఏవిటి రాసేరండి?"

"ఇదంతా నీనించే—నీ మొండితనం నించే"

"అసలేవిటి రాసేరూ?"

"రెండక్షరాలు నోటంట అనడానికి చచ్చిపోయావు! ఎంతచెప్పినా విన్నావా? నీతో మాటలేమిటి?"

"ఏమండీ నేనేంచేశానని?"

"ఏం చేశావు! అత్తా! అని పిలవమని ఎందరం అఘోరించినా, కడకి నోటంట తెగించి అదే అన్నా మొండి కత్తి పాయావు అదే ఆఖరికి యింతవరకూ వచ్చింది!"

"ఇంతకీ ఏమిటయిందో చెప్పండి! - అత్తా అని పిలిచే మరో అమ్మాయినిగాని తెస్తున్నారా ఏమిటి? మీరు" అని వేళాకోళంగా అంది.

"చాల్లే నీ వెటకారం - నాకింతవరకూ ఆ వూహే తోచలేదు. లేకపోతే యింత వరకూ రాకముందే ఆపని చేద్దును"- అన్నాడు

"అయితే ఏమయింది?"

"అక్కడ తన మేనకోడలు, అత్తా అని ఎంతో ఆప్యాయంగా పిలుస్తూందిట, తనకి అక్కడే హాయిగా వుందిట! యిక్కడికి వస్తే మళ్ళీ యథాప్రకారమేనని, అంచేత తను తన బుద్ధితిరిగేవరకూ అక్కడే వుండి పోతాననీ ఖచ్చితంగా రాసింది-యిహ నేం చెయ్యడం"

"మంచి బావుందండీ! యీ పాటి దానికి అంత పట్టింపుచేస్తారనుకోలేదు!"

"లేదు చాలా సంతోషిస్తారనుకున్నావు కదూ"

"అక్కడ ఎంతకాలమని వుంటారు?"

"అంతేగాని నేను తప్పకండా, పిలుస్తాను, రమ్మనమనండి అని అనవు! దానికేం అది ఎన్నాళ్ళున్నా మహరాజులా పువ్వుల్లోపెట్టి పూజిస్తారు ఎంత పుణ్యం చేస్తే పెద్ద దిక్కుదొరుకుతుంది! ఏమిటో అనుకుంటున్నావు!"

"ఇది మరీ బావుందండీ నేనిలా అవుతుందనుకున్నానా?"

"పోనీగాని నీకెందుకింత పంతం! ఎందుకిన్నిసార్లు చెప్పినా పిలవ్వు-ఇప్పుడు చెప్పు నాతో-ఏమిటో!"

" . . "

"చెప్పు—"

"ఏమిటి చెప్పేదండి "

"అదే ఎందుకు పిలవ్వు—"

"అదేమిటోనండీ-నాకు తెలీదు! నే చెప్పలేను"

"అదుగో అయితే, యిహ నీకూ నాకు పడదు"

"ఏఁవీ లేదు వుట్టినే—"

"బావుంది వాలకం—"

"ఏం చెప్పనండీ- ఏం లేందే-మరే కారణం లేదు ఎన్నో సార్లు అనుకుంటాను పిలువద్దాఁవని ఆవేళ కొచ్చేసరికి నోటంట రాదు! పిలవలేకండా వున్నాను, సిగ్గూ కాదూ, చిన్నతనంకాదూ, ఏఁవీ కాదు, అదేఁవిటో తెలీదు! ఏం చెయ్యడం?"

"ఇది బావుంది అన్నిటికంటేను!"

"యిహనుండి తప్పకండా పిలుస్తాను! రమ్మని రాయండి!"

"అలా రాయనా?"

"రాయండి ఒట్టు—"

"వచ్చింతర్వాత పిలవకపోతే నువ్వన్నట్టే-అత్తా అని పిలిచే పిల్లని పెళ్ళి చేసుకుంటాను"

"పోనీ అలాగేలెండి—"

"అలా అయితే యిప్పుడే నువ్వు కూడా అలా పిలుస్తూ ఒక వుత్తరం మీ అత్తగారికి రాసుగో!"

"అబ్బ నే రాయలేనండీ! అదోలా వుంటుంది!"

"అలాగయితేనే చిక్కు నే చెబుతున్నాకదూ అలా అయితేనేగాని రాదు!"

"మధ్య మీరూరుకోరుకదా!"

* * *

ఇంటిముందు బండీ ఆగిన చప్పుడు అయింది కమల ఆతృతతో, "అదుగోనండీ వచ్చినట్టుంది!" అంది

"మళ్ళీ మొదలెట్టేవు సుమీ!"

"లేదండీ! అత్తగారు వచ్చినట్టుంది!"

"వెళ్ళి రమ్మను—"

"అబ్బ! మీరే వెళుదురూ! నాకదోలా వుంటుంది!"

"అలాగయితే ఆ బండిలోనే తిరిగి వెళ్ళిపోతుంది!"

"మీరు మరీనండీ!" అని అంటూ వీధిలోకి వెళ్ళి వస్తూన్న అత్తగార్ని "రండి అత్తా!" అని పలకరించింది—

ఆ మాట వినగానే లక్ష్మమ్మ పొంగిపోయింది చేత్తో పట్టుగున్న సామాను అక్కడే వదిలేసి కోడలి చెయ్యి పట్టుగుని లోపుకి వెళ్లిపోయింది.

"ఏంవండీ యీ పాటిదానికే యింత పని చేస్తారా? యిక్కడ ఆయన పెద్ద గందరగోళం చేశారు !"

"అదుగో మళ్ళీ అలాగే పిలుస్తావేమిటే!" అన్నాడతను—

"మీ రూరుకుందురూ!" అని వెనకేసుకుంది

"అమ్మ అలాఅయితే అత్తా అని పిలిచే మరో పిల్లని ఎక్కడన్నా చూడే. దీనికి విడాకులిచ్చేద్దాం !" అన్నాడు నవ్వుతూ

"అదేమిటి - అలాటి మాటలు" అని వింతగా అడిగింది లక్ష్మమ్మ.

"నీ కోడలే చెప్పింది - యిహమీదటి నుండీ అలా పిలవకపోతే, మళ్లీ పెళ్ళి జేసుకోవచ్చని !"

"సరిపోయింది యిద్దరికీ !"

"రండత్తా ఆయనతో ఏమిటి ! ఫలహారం చేద్దురుగాని. " అంది కోడలు

ఇది వినగానే తన మేనకోడలు చెప్పిన ఎత్తు ఫలించిందని లక్ష్మమ్మ చాలా సంతోషించింది.

* * *

మర్నాడు లక్ష్మమ్మని పలకరించడానికి అందరూవచ్చి గుమ్మంలో కూర్చుని పిచ్చాపాటి మాటాడుకుంటూండగా ఏదో పనుండి - కమల యివతలికి వచ్చి - "ఏమండీ అత్తా యిలా లోపలికోసారి రండి " అని పిలిచింది.

అది విని - "చూశావే అమ్మడూ యిప్పుడెలా పిలుస్తోందో" అంది సముద్రాలు

"నే చెప్పలేదుటే- అనుభవంమీద అదే తెలుసుకొంటుందని ఫూరికే యిదయిపోయారు అందరూను "

"అయినా దానికిమాత్రం తెలీదుటే - అలా ఆడించిందిగాని -"

"నిజంగా అత్తా కోడలూ వుంటున్న 'కళ' వచ్చింది యింటికి -" యిలా అంటూండగా - కెరటాలు - యినపగరిట పట్టుగువచ్చి -

"ఏం లక్ష్మమ్మా! పైని గూర్చున్నావు! యింట్లో ఎవరూ లేరూ! యివాళ అగ్గిపుల్లలు యింటో నిండుకున్నాయి కాస్త నిప్పుపట్టుకు వెళతాను !" అంది

"వెళ్ళమ్మా కోడలు ఇస్తుందీ !"

"ఏవండోయ్ కోడలని మళ్లీ పిలుస్తున్నారు ? అయితే ఏదో విశేషం వుంది!" అంటూ లోపుకి వెళ్ళి నిప్పుతీసుకుంటూ వుంటే—

"ఏమండీ మా అత్తగారు వస్తున్నారా?" అని కమల అడిగింది

అది వినగానే కెరటాలు—

"నీకడుపు చల్లగా ! చక్కటి కొడుకుని కనాలి ! ఏదీ - మళ్ళీ పిలువూ !"

"వూరుకోండీ - అవేం మాటలూ !"

"ఎలా నేర్చుగున్నావు.. అయినా నువ్వు తెలివైనదానివేలే!" అంటూ చుట్టూ చూసింది "ఎంచక్కా చేసుకున్నాడే - యిల్లంతాను ! పెద్ద ఆఫీసర్ల బంగళాలా వుంది!" అని తిరిగి వెళ్ళిపోతూ వస్తూన్న లక్ష్మమ్మను చూసి—

"అత్తగారి వనిపించుకున్నావులే !" అంది లక్ష్మమ్మనవ్వుతూ వూరుకుంది. ★

పైత్యపు కవిత్వం

లాయర్ విశ్వపతిగారు కొడుకు కుటుంబరావు విషయంలో ఎక్కువగా బెంగపెట్టుకుంటున్నారు. అతనితో పాటే భార్య కామేశ్వరమ్మ వారికి కొడుకు సంగతేమీ బోధపడటం లేదు. కుటుంబరావు బి. ఏ పరీక్ష తప్పడమే కాకుండా అసలు మనిషే పూర్తిగా మారిపోయాడు పరీక్ష తప్పడం కూడా విచిత్రంగా జరిగింది అందరూ కుటుంబరావుకి క్లాసు వస్తుందనుకున్నారు తీరా ఫలితం చూస్తే ఒకపార్టు ఉండిపోయింది అందుకు విశ్వపతిగారేమీ విచారించలేదు. కొడుకు సుఖంగా ఉంటే అంతే చాలనుకున్నారు. కాని కొడుకులో కలుగుతున్న ఈ మార్పు మాత్రం ఆయనను ఎక్కువగా కలవరపెట్టసాగింది.

స్నేహితుడు విశ్వనాధానికి కూడా కుటుంబరావు విషయమేమీ అంతు చిక్కలేదు. స్నేహితునిలో కలుగుతున్న మార్పుకి కారణం ఏమిటో తెలిసికోవాలని విశ్వనాధం విశ్వప్రయత్నం చేశాడు కాని ఫలితం శూన్యం ఎదుటి హృదయంలో ఏముందో అతి సులువుగా పసికట్టే విశ్వనాధం కుటుంబరావు మనసులోని మర్మాన్ని లేశమాత్రమైనా తెలిసికోలేకపోయాడు. ఎంతో ప్రయత్నంచేసి విసిగిపోయిన విశ్వనాధానికి కుటుంబరావు సాల్వు చెయ్యలేని ఒక ప్రోబ్లంలాగ కనిపించాడు. ఓటమివలన కలిగే కోపదుఃఖాల పరిణామ వికారంలో "వాడు ఎట్లా పోతే నాకేం? వాడి ఖర్మ ఎలా వుంటే అలా అవుతుంది" అనుకున్నాడు విశ్వనాధం.

కాని విశ్వపతీ, కామేశ్వరమ్మల విచారాన్ని చూడలేకపోయాడు విశ్వనాధం. ఒకనాడు విశ్వనాధాన్ని ప్రక్కకి పిలిచి కామేశ్వరమ్మ బ్రతిమాలుతూ "వాడు ఎందుకట్లా అయిపోతున్నాడో ఎలాగైనా తెలుసుకో బాబూ! ఎంత అడిగినా మాతో చెప్పడు ఈ చిన్న ఉపకారం చేశావా నిన్ను జన్మజన్మాలకూ మరువను" అంది. విశ్వనాధం చాల బాధపడ్డాడు. తన స్నేహితుని మంచిచెడ్డలు తనకి మాత్రం అక్కర లేదూ? ఆవిడ తనని అంతగా బతిమాలుకోవాలా? ఏ విధంగానైనాసరే ఈ కార్యం సాధిస్తానని ఆమెకు మాట యిచ్చాడు

కుటుంబరావుకి కూడా తనలోని మార్పు కొద్దికొద్దిగా అర్థమవుతోంది కాని దానికి కారణ మేమిటో అతను ఊహించలేకపోతున్నాడు తనలో ఏదో మార్పు కలుగుతోందన్న భావం తప్పితే, అది ఎటువంటి మార్పో, ఏ విధంగా జరుగుతూందో తెలియటంలేదు తనలోని మార్పుయొక్క కొన్నికొన్ని భౌతిక చిహ్నాలు అతనికి కనిపిస్తున్నయ్ వాటిని చూసి ఆశ్చర్యపోయాడు కూడాను కాని వాటి నాధారంగా చేసుకొని ఆ మార్పుకి ఒక స్వరూపాన్ని కల్పించుకోలేకపోయాడు ఏ విధంగానూ ఒక నిశ్చయానికి రాలేక మనశ్శాంతికోసం అసలు తనలో మార్పు కలగలేదనే అనుకోసాగాడు. కుటుంబరావు తన తలిదండ్రులు పడుతున్న బాధను చూస్తూనే ఉన్నాడు. వారిని ఎట్లా ఓదార్చాలో, వారికి ఏమి సమాధానం చెప్పాలో అతనికి తోచింది కాదు తనకితానే సమాధానం చెప్పుకోలేనివాడు ఇతరులకు ఏ విధంగా సమాధానం చెప్పగలడు?

కార్యదీక్ష పూనిన విశ్వనాధం కుటుంబరావు ప్రతి కదలికనీ నిశితంగా పరీక్షించసాగాడు ఒక్కటే ఒక్క విషయం అతని దృష్టిని గాఢంగా ఆకర్షించింది. కుటుంబరావు క్రొత్తగా భావగీతాలు రాయడం ప్రారంభించాడు విశ్వనాధం వాటి నన్నిటినీ అతిశ్రద్ధతో చదివాడు అవి అతనికి ఏ విధంగానూ తోడ్పడలేకపోయినవి. వానివలన కుటుంబరావుయొక్క హృదయ భావము ఏ మాత్రము తేటతెల్లము కాలేదు విశ్వనాధం మాత్రం ఈ భావగీతరచనే కుటుంబరావులోని ముఖ్యమైన మార్పుగా తన మనస్సులో "మార్కు" చేసుకున్నాడు.

విశ్వనాధం కుటుంబరావుని అడిగాడు "ఏమిటి నీ మనస్సులోని బాధ?" అని.

"బాధ అంటూ ఏమీ లేదు ఏవో కొన్ని రంగు, రూపు లేని ఆలోచనలు, భావనలు కలుగుతూ ఉంటాయి వాటిని నేనే గుర్తించలేనప్పుడు నీకెట్లా చెప్పేది? ఏదో సముద్రంలో మునిగిపోతున్నట్టు, గాలిలో ఎగిరిపోతున్నట్టు ఉంటుంది ఒక్కోసారి మంచుగడ్డలో చలికి కొలబడ్డట్టు ఉంటుంది. ఆ చలినుండి తేరుకోకముందే నా చుట్టూ మంటలు మండుతాయి వాటి వేడికి నేను సొమ్మసిలిపోతాను. మధురమైన ఒక అవ్యక్త ఆనందం, వెనువెంటనే భయమూ, బాధతో కూడిన విచారం ఏమని చెప్పను? ఎట్లా చెప్పను విశ్వం?" అన్నాడు కుటుంబరావు కలలో పలవరిస్తున్నట్టుగా.

ఈ సమాధానంతో విశ్వనాధానికి తల తిరిగిపోయింది. కుటుంబరావుకి మతిపోతోందేమో అనుకున్నాడు కాని కుటుంబరావు భావగీతాల్ని చాలామంది మిత్రులు మెచ్చుకుంటున్నారు అప్పుడే కుటుంబరావు ఒక భావకవిగా చలామణీ అవుతున్నాడు అటువంటి భావకవిని, పిచ్చివాడని ఎట్లా అనుకోగలడు? బహుశా ఈ భావకవుల కందరికీ ఇలాంటి కోతి బుర్రలే ఉంటాయి కాబోలనుకున్నాడు విశ్వనాధం కుటుంబరావు మనస్తత్వం విశ్వనాధానికి సుతరామూ నచ్చలేదు

విశ్వనాధం తను చెయగలిగిన ప్రయత్నమంతా చేశాడు. కుటుంబరావుచేత భావకవిత్వరచన ఏలాగైనా మానిపించాలని చూశాడు లాభం లేకపోయింది పైగా కుటుంబరావు కుప్పలు కుప్పలుగా భావగీతాలు రాయసాగాడు ఈమధ్య అతనిలో క్రొత్తలక్షణాలు కూడా పొడసూపినవి. కుటుంబరావు "వేశ్యోద్ధరణసంఘము" అని ఒక సంఘాన్ని స్థాపించి, రసికతకూ, ఆనందానికీ ఆటపట్టయిన వేశ్యాసమాజము అధోగతిపాలై క్షీణిస్తోందని, వారిని ఏ విధంగానైనా పునరుద్ధరించి మానవ సంఘానికి అందము, ఆనందము చేకూర్చాలని స్టేజి ఎక్కి ఉపన్యాసా లివ్వసాగాడు ఈ ప్రవర్తన విశ్వపతిగారినీ, కామేశ్వరమ్మనూ, ఆఖరికి విశ్వనాధాన్ని కూడా గాభరా పరచింది. విశ్వపతిగారు కుటుంబ

శ్రీ కర్రా వెంకటరెడ్డి